



# బోల్షివిక్

సంచిక : 3 | సి.పి.ఐ.(మావోయిస్టు) ఏ.ఓ.బి. సమాచార పత్రిక | జనవరి-జూన్ 2014

## లోపలి పేజీలో

అమరులకు నివాళి

వ్యాసం

బోల్షివిక్కుల విజయానికి....కా॥లెనిన్ ........ 4

లోక్‌సభ ఎన్నికలు-మోడి విజయం ........ 6

మితవాదాన్ని వ్యతిరేకించండి-మావో ........ 12

ఎల్.ఐ.సి-సైనిక చర్యలు ........ 14

కరపత్రం

16వ లోక్‌సభ-ఎన్నికల బహిష్కరణ ........ 18

అమరుల చరిత్ర ....... 22

పోరాట వార్తలు ........ 29

అమరులకు నివాళి

## మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది.
## లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం.

భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాలకోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2014 జనవరి నుండి జూన్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యులు, నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బిలో ముగ్గురు కామ్రేడ్స్ నేలకొరిగారు. వీరిలో కా॥ నరేందర్ (ఎ.సి.ఎమ్,) కా॥ దుంబ్రి (ఎ.సి.ఎమ్), కా॥శిరీష (ఎ.సి.ఎమ్)ల వంటి కామ్రేడ్స్ ఉన్నారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. వారు అందుకే సదా చిరస్మరణీయులు.

**సిద్ధాంత వ్యాసం**

# బోల్షివిక్కుల విజయానికి ఒక ముఖ్య షరతు

**కా॥లెనిన్ సంకలిత రచనల నుండి**

(ఇక్కడ పొందు పరిచిన ఈ భాగం కామ్రేడ్ లెనిన్ రాసిన "వామపక్ష" కమ్యూనిజం ఒక బాలరిష్టం అనే గ్రంథం లోనిది. ఈ గ్రంథాన్ని కామ్రేడ్ లెనిన్ 1920 లలో రాసాడు. ఆ నాటికి యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ సోవియట్ రష్యాలో బోల్షివిక్‌ల అధికారం రెండున్నర సంవత్సరాలుగా కొనసాగుతూ వచ్చింది. చరిత్రలో ఇదొక నూతన అధ్యాయం. ఒక నిజమైన కార్మిక వర్గ పార్టీ నేతృత్వంలో పీడిత వర్గం, బూర్జువావర్గ రాజ్య యంత్రాంగాన్ని ధ్వంసం చేసి దోపిడి వర్గాలపై కార్మికవర్గ నియంతృత్వాన్ని రెండున్నర సంవత్సరాల కాలం పాటు కొనసాగించడం చరిత్రలో నిజంగానే ఒక నూతన అధ్యాయం. ఈ మహత్తర చారిత్రక విజయానికీ ముఖ్యంగా దోపిడీ వర్గాలపై పీడిత వర్గం సాధించిన విజయానికి కార్మికవర్గ పార్టీలోని నిరవధికమైన కేంద్రీకరణ, కఠినమైన క్రమశిక్షణ, ముఖ్యమైన షరతులుగా ఉన్నాయని కామ్రేడ్ లెనిన్ నొక్కి చెప్పాడు. కార్మిక వర్గ విజయానికి అవసరమై ఉండిన క్రమశిక్షణను బోల్షివిజం అత్యంత కష్టమైన పరిస్థితులలో ఎలా నిర్మించగలిగి, నిలబెట్టగలిగిందో ఈ భాగంలో కామ్రేడ్ లెనిన్ సూటిగా, సంక్షిప్తంగా పేర్కొన్నాడు. ఈ భాగంలో చెప్పిన మూడూ సూత్రాలను అమలు చేయకుండా ఏ కమ్యూనిస్టు పార్టీ క్రమశిక్షణను సాధించజాలదనీ, నిజమైన, సమర్థవంతమైన కార్మిక వర్గ పార్టీగా రూపాంతరం చెందజాలదనీ, విప్లవంలో విజయాలు, పురోగమనాలు సాధించజాలదనీ తెలియజేసాడు. ఈ సత్యం రష్యన్ విప్లవంలో కొనసాగిన దీర్ఘకృషి, కష్టార్జితమైన అనుభవం, సిద్ధాంత కార్యాచరణల మధ్య సమన్వయం, సుసంగత్వం ద్వారా మాత్రమే రూపుదిద్దుకొన్నది. ఈ విషయాలు ప్రస్తుతం మన ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో ప్రాసంగికతను కల్గి ఉన్నాయి.

ముఖ్యంగా నేడు భారత విప్లవోద్యమం ఒక కఠినమైన మలుపును అదిగమించాల్సిన కూడలిలో నిలిచి ఉంది. గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నది. ఈ స్థితిని అధిగమించేందుకు భారత పాలక వర్గాలు విప్లవోద్యమంపై అమలు చేస్తున్న అత్యంత క్రూరమైన ఆపరేషన్ గ్రీన్‌హంట్ సైనిక దాడిని ఓడించాల్సిన అవసరం తక్షణం మన ముందు నిలిచి ఉన్నది. అందుకే నేడు మనం ఒక షరతుగానే పార్టీని బోల్షివీకరించే కార్యక్రమాన్ని చేపట్టాము. అయితే బోల్షీవీకరణను ఒక నినాదంగా ఇచ్చినంత మాత్రానే పార్టీని బోల్షీవీకరణ చెందించలేము. రష్యన్ బోల్షివిక్కుల విజయానికి ఒక ముఖ్య షరతుగా పని చేసిన పార్టీలో అత్యంత కఠినమైన క్రమశిక్షణ, నిజమైన ఉక్కు క్రమశిక్షణ, శ్రామిక వర్గపు సంపూర్ణమైన, కృతనిశ్చయమైన అండదండలు, నేడు మన పార్టీని బోల్షీవీకరించి, ఉద్యమం ఎదుర్కొంటున్న గడ్డు స్థితిని అధిగమించి ప్రజా యుద్ధాన్ని పురోగమింప చేయడంలో ఒక ముఖ్య షరతులుగానే ఉంటాయి.)

మన పార్టీ అత్యంత కఠినమైన క్రమశిక్షణ, నిజమైన ఉక్కు క్రమశిక్షణ లేకుండా గానీ, యావత్తు శ్రామికవర్గపు, అనగా, ఆ వర్గంలో ఆలోచనాశీలురై, చిత్తశుద్ధి గలిగి, అంకితులై, పలుకుబడి గలిగి, వెనుకబడిన పొరలను నడిపించడానికి, లేదా తమవెంట లాక్కుపోవడానికి సామర్థ్యం గలిగిన శక్తుల అత్యంత సంపూర్ణమైన, కృతనిశ్చితమైన అండదండలు లేకుండా గానీ బోల్షివిక్కులు రెండున్నర యేండ్లు అటుంచి, రెండున్నర నెలలు కూడా అధికారాన్ని నిలుపుకొని ఉండజాలరని యిప్పుడు దాదాపు సర్వత్రా గుర్తింపబడిందని అనుకుంటాను.

శ్రామికవర్గ నియంతృత్వం అంటే కొత్త వర్గం తన కంటె శక్తివంతమైన శత్రువైన బూర్జువాలతో చేసే అత్యంత కృతనిశ్చయమైన, అత్యంత నిర్దాక్షిణ్యమైన యుద్ధం. ఆ బూర్జువాలు కూలదోయబడిన తర్వాత (ఒక్క దేశంలో మాత్రమే అయినప్పటికీ) తమ ప్రతిఘటన పదిరెట్లు పెరిగినట్టి వాళ్ళు; వాళ్ళ శక్తి అంతర్జాతీయ పెట్టుబడి బలంలోనూ, చిరస్థాయితనంలోనూ మాత్రమే కాక, అలవాటు బలంలోనూ, సన్నకారు ఉత్పత్తి బలంలోనూ కూడా వున్నట్టివాళ్ళు. దురదృష్టవశాత్తూ, సన్నకారు ఉత్పత్తి ప్రపంచంలో ఇంకా విస్తృతంగా ఉంది. మరి సన్నకారు ఉత్పత్తి నిరంతరాయంగా, దినదినమూ, గంటగంటా, యెప్పటికప్పుడు, భారీ ప్రమాణంలో పెట్టుబడిదారి వ్యవస్థనూ, బూర్జువాలను ఉత్పన్నం చేస్తుంది. ఈ కారణాలన్నీ కార్మికవర్గ నియంతృత్వాన్ని అవసరం చేస్తాయి. గట్టి పట్టుదలనూ, క్రమశిక్షణనూ, యేకైక, అంచంచల సంకల్పాన్నీ ఆపేక్షించే దీర్ఘమైన, మొండి, తెంపరి, చావు బతుకుల పోరాటం లేకుండా బూర్జువాల మీద విజయం అసంభవం.

మళ్ళీ చెపుతున్నాను : బూర్జువాల మీద విజయానికి కార్మికవర్గంలో నిరవధికమైన కేంద్రీకరణా, కఠినమైన క్రమశిక్షణా ముఖ్యమైన షరతు అని రష్యాలో విజయం పొందిన శ్రామికవర్గ నియంతృత్వ అనుభవం ఆలోచించడం చేతగానివాళ్ళకూ, ఈ విషయం గురించి యెన్నడూ ఆలోచించే సందర్భం రానివాళ్ళకూ కూడా స్పష్టంగా చూపించింది.

యిది తరచుగా ప్రస్తావించబడుతుంది. కానీ, దీని అర్థం యేమిటి అనే దానికీ, యే పరిస్థితులలో యిది సాధ్యం అనేదానికీ తగినంత ఆలోచన అర్పించబడలేదు. సోవియట్ల పట్ల, బోల్షివిక్కుల పట్ల ప్రకటించబడే అభివందనాల వెంట మరింత తరుచుగా విప్లవ కార్మిక వర్గానికి అవసరమై ఉండిన క్రమశిక్షణను బోల్షివిక్కులు ఎందుకు నిర్మించగలిగినారో ఆ కారణాల ప్రగాఢ పరిశీలన ఉంటే మేలుగా వుండేది కదా?

ఒక రాజకీయ ఆలోచనా ధోరణిగా, ఒక రాజకీయ పార్టీగా బోల్షివిజం 1903 నుండి ఉంది. కార్మికవర్గ విజయానికి అవసరమై ఉండిన ఉక్కు క్రమశిక్షణను బోల్షివిజం అత్యంత కష్టమైన పరిస్థితులలో యెలా నిర్మించగలిగి, నిలబెట్ట గలిగిందో బోల్షివిజం ఉండిన యావత్తు కాలానికీ చెందిన దాని చరిత్ర మాత్రమే వివరించగలదు.

మొదట ఉత్పన్నమయ్యే ప్రశ్నలు యివి : కార్మికవర్గపు విప్లవ పార్టీ క్రమశిక్షణ ఎలా నిలబెట్టబడుతుంది? అది యెలా పరీక్షించి చూడబడుతుంది? దానికి అదనపు బలం యెలా సమకూర్చబడుతుంది? మొదటిది, కార్మికవర్గ అగ్రదళం వర్గచైతన్యం ద్వారా, విప్లవం పట్ల దాని భక్తి ద్వారా, దాని గట్టి పట్టుదలా, స్వార్థత్యాగం, వీరత్వాల ద్వారా. రెండవది, శ్రామిక ప్రజలలోని విస్తారమైన జన సముదాయాలతో-ప్రాథమికంగా కార్మికవర్గంతో, కాని శ్రామిక ప్రజలలోని కార్మిక వర్గేతర జనాలతో కూడా-లంకె పెట్టుకోవడానికీ, అత్యంత సన్నిహిత సంపర్కం నిలబెట్టుకోవడానికీ, కొంత వరకు లీనం కావడానికి కూడా అనండి, దానికి గల సామర్థ్యం ద్వారా మూడవది, ఈ అగ్రదళం చెలాయించిన రాజకీయ నాయకత్వ నిర్దుష్టత్వం ద్వారా, దాని రాజకీయ వ్యూహం, ఎత్తుగడల నిర్దుష్టత్వం ద్వారా-అవి నిర్దుష్టమని విస్తారమైన జనాలు తమ స్వానుభవం ద్వారా గ్రహించిన పక్షంలో ఈ పరిస్థితులు లేకుండా పురోగమివర్గపు పార్టీగా వుండటానికి నిజంగా సమర్థమైన విప్లవ పార్టీలో, బూర్జువా వర్గాన్ని కూలదోసి, సమాజమంతటిని రూపాంతరీకరించడం ధ్యేయంగా గలదానిలో, క్రమశిక్షణ సాధించబడజాలదు. ఈ పరిస్థితులు లేకుండా, క్రమశిక్షణను నెలకొల్పే ప్రయత్నాలన్నీ అనివార్యంగా నిష్ఫలమై, వాగాడంబరంలోనూ, విదూషకత్వంలోనూ అంతమౌతాయి. మరొకవైపున, ఈ పరిస్థితులు ఉట్టిపాటుగా ఉద్భవించవు. ఇవి దీర్ఘ కృషి చేతా, కష్టార్జితమైన అనుభవం చేతా మాత్రమే సృష్టించబడతాయి. వీటి సృష్టికి నిర్దిష్టమైన విప్లవ సిద్ధాంతం తోడ్పడుతుంది. ఈ సిద్ధాంతం దాని వంతుకు, పిడి సూత్రం కాదు, ఇది నిజంగా సామూహికమైన, నిజంగా విప్లవకరమైన ఉద్యమపు ఆచరణాత్మక కార్యకలాపాలతో గల సన్నిహిత సంబంధంతో మాత్రమే అంతిమంగా రూపు దిద్దుకుంటుంది.

1917-1920లో బోల్షివిజం గతంలో యెన్నడూ లేనట్టి కష్ట పరిస్థితులలో అత్యంత ఖచ్చితమైన కేంద్రీకరణనూ, ఉక్కు క్రమశిక్షణనూ నిర్మించి, విజయవంతంగా నిలబెట్టడం కేవలం రష్యాలోని పలు చారిత్రక విలక్షణాల వల్లనే.

ఒకవైపు బోల్షివిజం 1903లో చాలా స్థిరమైన మార్క్సిస్టు సిద్ధాంత పునాది మీద ఉద్భవించింది. ఈ విప్లవ సిద్ధాంతపు నిర్దుష్టత్వం, ఈ ఒక్కదానిది మాత్రమే అయిన నిర్దుష్టత్వం, పంతొమ్మిదవ శతాబ్ది అంతటా కలిగిన ప్రపంచ అనుభవం చేత మాత్రమే కాక, ముఖ్యంగా రష్యాలోని విప్లవ అలోచన అన్వేషణల, ఊగిసలాటల, పొరపాట్ల, ఆశాభంగాల అనుభవంచేత రుజువుచేయబడింది. సుమారు అర్ధ శతాబ్ది పాటు-రమారమిగా గత శతాబ్ది నలబైల నుండి తొంబైలదాకా-రష్యాలోని ప్రగతిశీల అలోచన మహపాశవికమైన, ప్రగతి వ్యతిరేకమైన జారిజం చేత పీడింపబడి, నిర్దుష్టమైన విప్లవ సిద్ధాంతం కొరకు తహతహతో అన్వేషించి, యూరప్, అమెరికాలలోని ఈ రంగానికి చెందిన ప్రతి తాజా విషయాన్నీ అత్యంత శ్రద్దతో, సమగ్రతతో గమనించింది. సాటిలేని యాతనలతో, త్యాగాలతో, సాటిలేని విప్లవ వీరత్వంతో, నమ్మశక్యం కానీ ఉత్సాహంతో, నిష్ఠతో, అన్వేషణతో, అధ్యయనంతో, ఆచరణలో పరిక్షించి చూసుకోవడంతో, ఆశాభంగంతో, తైపారు చేసుకోవడంతో, యురోపియన్ అనుభవంతో పోల్చి చూసుకోవడంతో నిండిన అర్ధ శతాబ్ది కాలంలో తాను అనుభవించిన మానసిక క్షోభ ద్వారా రష్యా మార్క్సిజంను-ఏకైక నిర్దిష్ట విప్లవ సిద్ధాంతాన్ని-సాధించింది. జారిజం కలిగించిన రాజకీయ విదేశీ ప్రవాసం ధర్మమా అని, పంతొమ్మిదవ శతాబ్ది ద్వితీయార్ధంలో విప్లవ రష్యా అంతర్జాతీయ సంబంధాల సంపదనూ, ప్రపంచ విప్లవోద్యమపు రూపాలను గురించీ, సిద్ధాంతాలను గురించీ శ్రేష్ఠమైన సమాచారాన్నీ, ఏ ఇతర దేశానికీ లేనట్టి వాటిని, సంపాయించింది.

మరొకవైపున, ఈ సిద్ధాంతపు నల్లజాతి పునాదిమీద లేచిన బోల్షివిజం ప్రపంచంలో ఎక్కడా సాటిలేనట్టి అనుభవ సంపద గల పద్దెనిండ్ల (1903-1917) ఆచరణాత్మక చరిత్రగుండా గడచింది. ఆ పద్దెనిండ్ల కాలంలో ఏ ఇతర దేశమూ అ విప్లవ అనుభవంతోనూ, ఆ ఉద్యమపు భిన్న రూపాల సత్వర, వైవిధ్యపూరిత అనుక్రమంతోనూ రమారమిగా కూడా పోలినవి యెరగదు-చట్టబద్ధ, చట్ట వ్యతిరేక, శాంతియుత, కల్లోలిత, రహస్య బహిరంగ, స్థానిక బృందాల, సామూహిక ఉద్యమాల, పార్లమెంటరీ, టెర్రరిస్టు రూపాలు. యే ఇతర దేశంలోనూ అంత స్వల్పకాలంలో ఆధునిక సమాజపు సకల వర్గాల పోరాట రూపాలకూ, చాయలకూ, పద్ధతులకూ చెందిన అంత సంపద సాంద్రీకరింపబడలేదు-ఆ పోరాటం దేశపు వెనకబాటుతనం మూలంగానూ, జారిస్టు శృంఖలాల కఠినత్వం మూలంగానూ అసాధారణమైన వేగంతో పరిణతి చెంది, అమెరికన్, యూరపియన్ రాజకీయ అనుభవంలోని ఉచితమైన తాజా విషయాన్ని అత్యంత తహతహతో, విజయవంతంగా జీర్ణం చేసుకున్నట్టిది.

---

(17వ పేజి తరువాయి భాగం)

అయితే మనం శత్రువు నెదుర్కొనేందుకు పి.ఎల్.జి.ఎలో కంబాట్ బలగాలను ఏర్పాటు చేసుకోవాలి. కఠినమైన తర్ఫీదును, ఆయుధాలను అందించాలి. ప్రత్యేక టాస్కులకు ఎంపిక చేసిన బలగాలతో ప్రత్యేక నిర్మాణాలు ఇవ్వాలి. ఈ కర్తవ్యాలను, ముఖ్యంగా సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని సృజనాత్మకంగా అమలు జరుపడం, గెరిల్లా యుద్ధాన్ని పురోగమింపజేయడం నిర్వహించేందుకు పార్టీని సైద్ధాంతికంగా, రాజకీయంగా తర్ఫీదు చేసుకోవాలి. కార్మికవర్గ పార్టీగా, మన విప్లవ కార్యాచరణకు అడ్డుగా ఉన్న పెటి బూర్జువా దృక్పథాన్ని వదిలించుకొని ఎమ్.ఎల్.ఎమ్ దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ప్రజలను పాత వ్యవస్థ తాలూకు భావజాల బంధనాల నుండి విముక్తి చేసి కార్మికవర్గ సిద్ధాంత, రాజకీయాలతో ప్రభావితుల్ని చేసి ప్రజాయుద్ధంలోకి సమీకరించాలి. మనం ఇప్పటి దాకా చరిత్ర పురోగమనం వైపు నిలబడ్డాం. భవిష్యత్తులో కూడా నిలబడదాం. బోల్షివిజం సారం నుండి మనం నేర్చుకొన్నది ఇదే. కనుక ప్రస్తుతం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిని సైతం బోల్షివిజం సారాన్ని మరింత పుణికి పుచ్చుకోవడం ద్వారానే అధిగమించ గలుగుతాము.

వ్యాసం

# దేశాన్ని ఫాసిజం దిశగా నడిపించిన 16వ లోక్‌సభ ఎన్నికల పర్యవసానమే మోడి విజయం!

ఈ దేశ పాలక వర్గాలు 16వ లోక్‌సభ ఎన్నికలను "విజయవంతంగా" నిర్వహించి పీడిత ప్రజలపై మరోసారి విజయం సాధించాయి. ఎలానంటే ఈ ఎన్నికలు ప్రజల నిజమైన అభీష్టం ప్రకారం జరుగుతున్నవి కావు కనుక, వారిపై మోసపూరితంగా బలవంతంగా రుద్దుతున్నవి కనుక, ఇంకా నిర్ధిష్టంగా చెప్పుకోవాలంటే నేటి భారత ప్రజాస్వామిక రిపబ్లిక్‌లో పీడక వర్గపు యే నిర్ధిష్ట ప్రతినిథులు తమకు పార్లమెంటులో ప్రాతినిథ్యం వహించి తమను అణచివేయాల్సిందీ నిర్ణయించడానికి పీడితులు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి అనుమతింపబడతారు కనుక'.

గడచిన 67 సంవత్సరాలలో 15 సార్లు జరిగిన లోక్‌సభ ఎన్నికలు ఈ వాస్తవాన్నే నిరూపిస్తూ వచ్చాయి. ఈ ఎన్నికలు ప్రజల అభీష్టాన్ని వ్యక్తపరిచేందుకు గానీ, సాధించేందుకు గానీ ఏ మాత్రం దోహదపడలేదు. ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలు తమ అధికారాన్ని మరింతగా స్థిరపరుచుకొనేందుకూ, సంపదలను మరింతగా పోగేసుకునేందుకు మాత్రమే ఎన్నికలు సాధికారతను కల్పిస్తూ వచ్చాయి. కనుకనే ఈ సారి జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికలు  కూడా తమ తలలను నరికే 'సరైన తలారి' ని ఎంపిక చేసుకునేందుకు మాత్రమే ప్రజలకు దోహదపడ్డాయి.

ఇక నిర్దుష్టంగా 16వ లోక్‌సభ ఎన్నికల ముందునాటి పరిస్థితిని ఒకసారి మనం సంక్షిప్తంగా అవలోకనం చేసుకుందాము. 2004 నుండి 10 సంవత్సరాల పాటు కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ ప్రభుత్వం దేశాన్ని పాలించింది. ఈ కాలంలో మన్‌మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా యు.పి.ఎ-1, యు.పి.ఎ-2 ప్రభుత్వాలు సామ్రాజ్యవాదుల నయావలస దోపిడీని దేశంలో తీవ్రతరం అయ్యేలా ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేసాయి. సోనియాగాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టక పోయినప్పటికీ, సలహామండలి పేరుతో ప్రభుత్వ విధానాలు రూపొందించడంలో కీలక పాత్ర నిర్వహించింది. వీరు ఈ కాలంలో పౌర అణు ఒప్పందం, రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులకు ఆహ్వానం వంటి సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను రూపొందించి అమలు చేసారు. సెజ్‌లు, గనుల రూపంలో లక్షలాది ఎకరాల పంట భూముల్ని, అడవుల్ని బహుళజాతి సంస్థలకు ధారదత్తం చేసారు. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే నయా ఉదారీకరణలో భాగంగా భారత దేశంలోని అన్ని రంగాలను సామ్రాజ్యవాదులకూ, భారత కార్పొరేట్ రంగానికి అనుకూలంగా మలిచారు. ఇక ఈ కాలంలో ప్రభుత్వ పథకాల అమలులోనూ, బహుళజాతి సంస్థలతో కుదుర్చుకొన్న ఒప్పందాల సందర్భంగానూ రాజకీయ నాయకులు, ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు చేసిన అవినీతికి అంతే లేదు. టాట్రో ట్రక్కులు, హెలికాప్టర్ల కొనుగోలు వ్యవహారంలో ముడుపులు, కామన్‌వెల్త్ క్రీడల్లో అవకతవకలు, ముంబయి ఆదర్శ హౌసింగులో అవినీతి, మధ్యాహ్న భోజన పథకంలో అవినీతి, మనరేగాలో అవినీతి, 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం, బొగ్గు గనుల కుంభకోణం ఇలా చెప్పుకొంటూ పోతే ఈ అవినీతి  కుంభకోణాలన్నీ కలిసి పెద్ద దండకమే అవుతుంది. ఈ అవినీతి లక్షల కోట్ల రూపాయలలోనే ఉంటుంది. 2జి స్పెక్ట్రమ్ కుంభకోణంలో 1,76000 కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయితే, బొగ్గు గనుల కుంభకోణంలో 1,86000 కోట్ల రూపాయలు దుర్వినియోగం అయ్యాయి. ఇక ఈ అవినీతి సంపదంతా స్విస్ బ్యాంకులకూ, ఇతర బహుళ జాతి సంస్థల బ్యాంకులకు ప్రవాహమై పారింది. ఇంతే కాకుండా ప్రభుత్వ బ్యాంకుల నుండి కార్పొరేట్ సంస్థలు తీసుకున్న అప్పులలో 2 లక్షల కోట్ల రూపాయలు మొండి బకాయిలుగా మారాయి. ఈ విధంగా చూస్తే మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం అనుసరించిన ఉదారవాద ప్రపంచీకరణ విధానంలో భారత దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు వారి యజమానులైన సామ్రాజ్యవాదులు భారత దేశ పీడిత ప్రజల మూలుగులను పీల్చి పిప్పి చేసారనే చెప్పుకోవాలి. అందుకే భారత దేశంలో మునుపెన్నడూ లేనంతగా ఆర్థిక వ్యత్యాసాలు పెరిగాయి. దేశంలో రోజుకు 20 రూపాయల ఆదాయం మించని వారు 77 శాతం మంది వుంటే, 2000 మంది ప్రపంచ కుబేరులలో మన దేశంకు చెందిన వారే 70 మంది దాకా ఉన్నారు. చైనా రీసెర్చ్ సంస్థ 'హురున్' ఇచ్చిన సమాచారం ప్రకారం ముఖేష్ అంబానీ 18 బిలియన్ డాలర్ల (దాదాపు 1.12లక్షల కోట్ల రూపాయలు) విలువైన ఆస్థితో ప్రపంచ ధనాఢ్యులలో 41వ స్థానాన్ని ఆక్రమిస్తే, లక్ష్మి మిట్టల్ 17 బిలియన్ డాలర్ల సంపదతో 49వ స్థానాన్ని ఆక్రమించాడు. అయితే ఇక్కడ మనం దృష్టిలో వుంచుకోవలసిందేమిటంటే సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో మధ్యతరగతిలోని ఒక చిన్న సెక్షన్ (హైనెట్ వర్త్ ఇండివిడ్యువల్స్) ఐ.టి రంగం వంటి వాటిని వినియోగించుకుని లబ్ధి పొందింది. వీరి అభివృద్ధి గంతులు వేయడమే కాకుండా, వీరు ఎల్.పి.జి విధానాలకు గట్టి మద్ధతు దారులుగా, ప్రజల ప్రయోజనాలను ఆటంకపరిచే అభివృద్ధి నిరోధకులుగా మారారు.

ఇక అభివృద్ధి నమూనా విషయానికి వస్తే ఉదారవాద ప్రపంచీకరణ విధానాల ద్వారా లబ్ధి పొందిన వర్గాలకు సౌకర్యాలు చేకూర్చే విధంగా ఫ్లై ఓవర్లు, ఎక్స్‌ప్రెస్ రోడ్లు, దిగుమతి చేసుకున్న కార్లు, ఫ్లడ్ లైట్లతో నిర్మించిన స్టేడియంలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన విమానాశ్రయాలు, పెద్ద పెద్ద భవనాలతో కూడిన కార్పొరేట్ సంస్థల కార్యాలయాలు నిర్మించారు. మరో వైపు కోట్లాది మంది శ్రామిక ప్రజలకు విద్యా, వైద్యం, రవాణ వంటి కనీస సౌకర్యాలను లేకుండా చేసి ఘోరమైన నిర్లక్ష్యానికి గురిచేసారు.

సమాజంలో పెరిగిన ఈ వ్యత్యాసాలు, అంతరాలు

తీవ్రమైన సామాజిక, రాజకీయ ఘర్షణలకు దారి తీసాయి. పర్యవసానంగా భూమి, నిర్వాసితత్వం వంటి సమస్యలపై దేశ వ్యాపితంగా పోరాటాలు పెద్ద ఎత్తున బద్దలైనాయి. కార్మికులు, రైతాంగం, ఉద్యోగులు, విద్యార్థులు తమ సమస్యలపైనే కాకుండా ప్రభుత్వ దివాళాకోరు విధానాలకు వ్యతిరేకంగా రాజకీయ ఆందోళనలు చేపట్టారు. దళితులు, మహిళలు, మైనారిటీలు బ్రాహ్మణీయ భావజాలంతో కూడిన ఫ్యూడల్ శక్తులకూ, వారి చేతిలో సాధనంగా వున్న రాజ్యాంగ యంత్రానికి వ్యతిరేకంగా తమ నిరసనను సమరశీలతతో వ్యక్తపరిచారు. మరోవైపు సామ్రాజ్యవాదులు చేస్తున్న సాంస్కృతిక దాడి నేపథ్యంలో సమాజంలోని అన్ని మానవీయ విలువలు ధ్వంసమై నిర్భయ అత్యాచారం వంటి అమానవీయమైన సంఘటన వెలుగు చూసినపుడు దేశ వ్యాపితంగా యువత మున్నెన్నడూ వ్యక్తపరచనంతగా తమ తీవ్రమైన ఆగ్రహాన్ని వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టడం ద్వారా వ్యక్తపరిచారు. ఇక విప్లవోద్యమం విశాల గ్రామీణ ప్రాంతంలో పాలక వర్గాల దోపిడీని ఒక రకంగా కట్టడి చేసింది. చత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, బీహార్, ఒడిశా రాష్ట్రాలలో పాలక పార్టీలు బహుళజాతి సంస్థలతో కుదుర్చుకున్న ఎమ్.ఒ.యులు అమలు కాకుండా విప్లవోద్యమం అడ్డుపడింది. మాలి, దేవమాలి, విశాఖ వంటి చోట్ల ఖనిజాల తవ్వకాలకు వ్యతిరేకంగానూ, విస్థాపనకు వ్యతిరేకంగాను ప్రజా పోరాటాలు పెద్ద ఎత్తున బద్దలైనాయి. ఇంతే కాకుండా దండకారణ్యం, ఝార్ఖండ్ విశాల అటవీ ప్రాంతంలో ఆదివాసీలు ప్రత్యామ్నాయ రాజ్యాధికార దిశగానూ, ప్రజా అభివృద్ధి నమూనా దిశగాను అడుగులు వేస్తుంటే కేంద్ర, రాష్ట్ర దోపిడి పాలక ప్రభుత్వాలు విప్లవోద్యమాన్ని అణచివేసేందుకూ, ప్రజా ఉద్యమాలను దెబ్బ తీసేందుకు 2009 సెప్టెంబరులో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో లక్షలాది పారామిలటరీ బలగాలను మోహరించి మొత్తం దేశ శ్రామిక ప్రజానీకంపై యుద్ధాన్ని ప్రకటించాయి.

ప్రపంచీకరణలో భాగంగా మన్‌మోహన్ సింగ్ ప్రభుత్వం అనుసరించిన ఈ నయా ఉదారవవాద విధానాలు దేశాన్ని విపత్కర పరిస్థితులలోకి నెట్టాయి. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగా అన్ని రంగాలలో వ్యవస్థాగత మార్పులు చేపట్టడం వలన అన్ని రంగాలు సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. పర్యావరణం మొదలుకొని, అవినీతి, ఆకలి, అనారోగ్యం, అధిక ధరలు, అత్యాచారాలు, అభద్రత, ఉపాధి లేకపోవటం, విద్యుత్ కొరత, విస్తావన, కాలుష్యం, విద్యా-వైద్యాలు ఖరీదు కావడం, తాగునీరు-సాగునీరు అందకపోవటం...ఇత్యాది పలు సమస్యలు ప్రజలను చుట్టుముట్టాయి. ఇక ఆర్థిక వ్యవస్థ విషయానికి వస్తే వృద్ధి రేటు మందగించింది. ద్రవ్యలోటుతో పాటు కరెంట్ ఎకౌంట్ లోటు పెరిగింది.రిటైల్ టోకు ధరల సూచి పెరిగి ద్రవ్యోల్బణం అదుపు తప్పింది. మొత్తం తయారీ రంగం కునారిల్లి దేశం తీవ్రమైన మాంద్యంలోకి నెట్టబడింది. ఈ పరిస్థితికి ప్రపంచ ద్రవ్య, ఆర్థిక సంక్షోభం జత కావడంతో అగ్నికి ఆజ్యం తోడైనట్లయింది. ఈ అదుపు తప్పిన ఆర్థిక సమస్యల పరిష్కారానికి రిజర్వు బ్యాంకుతో పాటు ఆర్థిక మంత్రి చిదంబరం ఎన్ని సర్కస్‌ఫీట్లు చేసినా అవి ఒక పట్టాన దిగి రాలేదు.

ఈ మొత్తం అల్లకల్లోల పరిస్థితిలో అవినీతి సమస్య మధ్యతరగతిని బాగా కదిలించింది. వారి అసంతృప్తి క్రమంగా మొత్తం దేశ ప్రజల ఆగ్రహంగా మారే ప్రమాదాన్ని పసిగట్టిన పాలక వర్గాలు అన్నా హజారేను రంగంలోకి దించాయి. ప్రజల ఆగ్రహం బద్దలు కాకుండా సేఫ్టీవాల్వ్ వంటి 'అన్నా హజారే నిరాహార దీక్ష పోరాటాన్ని' ప్రజల ముందు వండి వార్చారు. అన్నా హజారే జంతర్ మంతర్ నిరాహార దీక్షకు కార్పొరేట్ సంస్థలు, టాటా, ఇన్ఫోసిస్, ఎస్,ఆర్‌లు భారీగా నిధులు ఖర్చు పెట్టారు. హిందు మతోన్మాది మోడి ఈ 'పోరాటానికి' ఆశీస్సులు అందించాడు. వీరంతా కలిసి కీలెరిగి వాతపెట్టినట్లుగా అవినీతి రోగానికి జనలోక్ పాల్ బిల్లు ఆమోదం సరైన మందని ప్రజలను నమ్మించారు. వాస్తవంగా ఎల్.పి.జి విధానాలలో అవినీతి విడదీయరాని భాగమే. ఎల్.పి.జి విధానాలను ఎదుర్కోకుండా అవినీతిని నివారించలేము. ఈ వాస్తవాలను అర్థం కానీయకుండా ప్రజలను మభ్యపెట్టి, ప్రజలలో ఎల్.పి.జి విధానాలకు వ్యతిరేకత లేకుండా చేసేందుకే దోపిడీ పాలక వర్గాలు అన్నా హజారేతో ఈ ' నిరాహార దీక్షా నాటకాన్ని' ఆడించారు.

ఈ పరిణామాలన్ని ప్రధానమంత్రి మన్‌మోహన్ సింగ్‌ను దేశం ముందు అసమర్థుడిగా నిలబెట్టాయి. మనరేగా, ఆహార భద్రతా పథకం, నగదు బదిలీ పథకం వంటి పథకాలేవి పీడిత ప్రజలను సైతం సంతృప్తి పరచలేక పోయాయి. మన్‌మోహన్ సింగ్ మాత్రం దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ ' చరిత్ర తన ఎడల దయ చూపిస్తుందని' నిర్లిప్తంగా, ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

పై నేపథ్యంలోనే భారత దోపిడీ పాలక వర్గాలలోని ఒక బలమైన ముఠాతో పాటు ఎగువ మధ్య తరగతికి చెందిన ప్రపంచీకరణ లబ్ధిదారులంతా ఏకాభిప్రాయానికి వచ్చారు. ఆ అభిప్రాయం 'నిజాయితి కలిగిన, తెలివైన, సమర్థుడైన నియంత నేతృత్వంలో ఫాసిజాన్ని నెలకొల్పడంగా ఉంది. ఇక్కడ మనం కాIIలెనిన్ చెప్పిన విషయాన్ని దృష్టిలో వుంచుకోవాలి.

"పార్లమెంటు బూర్జువా పరిపాలనకు మేలిముసుగు మాత్రమే. అందువల్ల పార్లమెంటరీ వ్యవస్థను నిలబెట్టడమా లేకా రద్దు చేయడమా, పార్లమెంటుకు ఎక్కువ అధికారాలు ఇవ్వడమా లేక తక్కువ అధికారాలు ఇవ్వడమా ఏ రకమైన ఎన్నికల పద్ధతి అనుసరించాలి. అనే సమస్యల మధ్య దేన్ని బూర్జువా వర్గం ఎన్నుకుంటుందనే దాన్ని ఆ వర్గ పరిపాలనా అవసరాలు, ప్రయోజనాలు నిర్ణయిస్తాయి."

ఇక నిర్దిష్టంగా మన దేశ విషయానికి వస్తే ఇక్కడి దోపిడీ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు ప్రస్తుత నిర్దిష్ట, సంక్లిష్ట పరిస్థితులలో తమ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు పార్లమెంటు ముసుగును తొలగించకుండానే నిజాయితీ కలిగిన, తెలివైన, సమర్థుడైన నియంతను ఎంపిక చేసుకొన్నారు. ఈ మూడు లక్షణాలు మూర్తీభవించిన నియంతే నరేంద్ర భాయ్ దామోదర్ దాస్ మోడి.

ఈ నేపథ్యంలోనే 16వ లోక్‌సభ ఎన్నికలతో పాటు తెలంగాణ, అవశేష ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో శాసనసభలకు ఎన్నికలు ముందుకు వచ్చాయి. ఏప్రిల్ 17 నుంచి మే 12 వరకు 36 రోజుల వ్యవధిలో 9 అంచెలుగా సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ కాలంలోనే ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. కొద్దిగా ముందుగా ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలకూ, కార్పొరేషనకూ, మండల, జిల్లా

ప్రజాపరిషత్‌లకు ఎన్నికలు జరిగాయి. అయితే ఈ ఎన్నికలకు ముందు పాలక వర్గాలను కలవరబరిచిన విషయం ఒకటి ఉంది. అది ఎన్నికల ప్రక్రియపై ప్రజలలో నిర్లిప్తత పెరగడం. ముఖ్యంగా పట్టణ మధ్యతరగతి విద్యావంతులలో ఈ నిర్లిప్తత పెరిగింది. 'ఎవరు గెలిచినా ప్రయోజనమేమి లేదనే భావన' వాళ్ళలో చోటు చేసుకున్నది. వాస్తవంగా గ్రామీణ ప్రాంతంలో ఈ వాతావరణం మరింత ఎక్కువగా ఉంది. ఈ పరిస్థితి క్రమంగా ప్రజలను ప్రత్యామ్నాయ మార్గం (ప్రజాయుద్ధ మార్గం) ఎంచుకునే వైపుకు నెట్టుందనే ఆందోళన పాలక వర్గాలను పట్టి పీడించింది. అందుకే ఈసారి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గురించి ఎన్నికల సంఘం ఎన్నడూ లేనంతగా ప్రచార కార్యక్రమం చేపట్టింది. ప్రముఖ క్రీడాకారులు, రచయితలు, సినీ నటులు అదే పనిగా ఓటు హక్కు 'సమానత్వానికి చిహ్నమనీ', 'భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబందించిన అంశమనీ' దిన పత్రికలలో, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారాన్ని హోరెత్తించారు. ఇక ప్రజలను ఓటర్లుగా పేరు నమోదు చేయించుకొనే దగ్గర నుండి ఓట్లు వేసే దాకా ఆలోచింప చేసేందుకు ఎన్నికల సంఘం పడరాని పాట్లు పడింది. ఎన్నికల సంఘం పనిగట్టుకుని ఇంతా ప్రచారం చేస్తే అర్హులైన వారి పేర్లు గల్లంతు కావడం, బోగస్ ఓటర్ల పేర్లు వచ్చి రికార్డులలో చేరడం అన్ని నియోజక వర్గాలలో సర్వసాధారణంగా మారి ఘర్షణలకు దారి తీసింది. ఒక్క చంద్రబాబు నియోజక వర్గంలోనే 43,000 బోగస్ ఓట్లు చేర్పించినట్లు గత డిసెంబరులో ఎన్నికల కమీషనర్ ప్రకటించాడు. ప్రతిసారి ఎన్నికలు ఒక ఫార్సుగా జరుగుతుంటే, ఈ ఎన్నికల్లో ప్రజాస్వామికం మరింత బలోపేతం చేస్తామంటూ భారత ఎన్నికల కమీషన్ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం మార్గదర్శకాలను ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో చేర్చడంతో పాటు అనేక సంస్కరణలను ముందుకు తెచ్చింది. 'ప్రజాస్వామికాన్ని' బలోపేతం చేయడంలో భాగంగానే అభ్యర్థులను నిరాకరించే హక్కును ఓటర్లకు కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా నోటా బటన్‌ను ఈ.వి.ఎంలలో చేర్చారు. నిజానికి ఈ నోటా హక్కు ప్రజలకు ఉండాల్సిన 'గెలిచిన అభ్యర్థులను వెనక్కు పిలిచే (రీకాల్) హక్కును' తొక్కి పడ్తుంది. నిరాకరించే హక్కును నిజంగా కల్పించే పనైతే, విప్లవోద్యమం కొనసాగుతున్న ప్రాంతాలలో ఎన్నికలను బహిష్కరించిన పీడిత రైతాంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది ప్రభుత్వ సాయుధ బలగాలను మోహరించి దాడులు, సర్చ్ ఆపరేషన్లు, అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు, ప్రజలను ఊచకోత కోయడం వంటి పైశాచిక చర్చలకు పాల్పడాల్సిన అవసరమే లేదు. ఈసారి ఒక్క ఒడిశాలోనే 429 కంపెనీల రాష్ట్ర పోలీసులను, 156 కంపెనీల సి.ఆర్.పి.ఎఫ్ (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్)ను మోహరించారు. మొత్తం దేశ వ్యాపితంగా ఉద్యమ ప్రాంతంలో ఈ బలగాలు లక్షలలోనే వుంటాయి. ఇక ఎన్నికలలో డబ్బు ప్రభావం అంతమొందించడం పేరుతో లోక్‌సభకు పోటీ చేసేవారు 70 లక్షల రూపాయలు మాత్రమే ఖర్చు పెట్టాలనీ, శాసనసభకు పోటీ చేసేవారు 25 లక్షల రూపాయలు మాత్రమే ఖర్చు పెట్టాలనీ నిబంధన విధించింది. ఈ నిబంధన అమలు చేయడం కోసం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నిఘా బృందాలను రంగంలోకి దింపింది. కాని ఆచరణలో ఈ నిబంధన పూర్తిగా ఉల్లంఘించబడింది. ఎన్నికల సంఘానికి తప్పుడు లెక్కలు చూపించి నిబంధనకతీతంగా కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన అభ్యర్థులే అధికంగా ఉన్నారంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఈసారి నల్లధనం ప్రవాహమై పారింది. ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే ఎన్నికల సంఘం నిబంధనను అతిక్రమించి దొంగచాటుగా పంపిణీ అవుతున్న 153 కోట్ల రూపాయలను పోలీసులు జప్తు చేసుకున్నారు. ఇక దేశ వ్యాపితంగా అన్ని పార్టీల అభ్యర్థులు చట్టవిరుద్ధంగా చేసిన ఖర్చు వేలకోట్ల రూపాయలలోనే వుంటుంది. వాస్తవంగా చెప్పుకోవాలంటే ఈ ఎన్నికలలో ఏ నీతినియమాలు లేకుండా "డబ్బుతో అధికారం, అధికారంతో డబ్బు, డబ్బుతో తిరిగి అధికారం" అనే సూత్రం మాత్రమే పని చేసింది. ఈ సూత్రాన్ని అమలు చేయడంలో భాగంగానే ఈ సారి కాంగ్రెస్ మొదలుకొని ఆమ్ ఆద్మీ పార్టీ వరకు ఎక్కువ మంది కుభేరులే ఎన్నికల అభ్యర్థులుగా రంగంలోకి దిగారు. ఒక్క కర్నాటకలోనే కాంగ్రెస్ నుండి పార్లమెంటుకు పోటీ చేసిన 28 మంది అభ్యర్థులలో 27 మంది కుభేరులే. వీరిలో ఐటి బెల్ లెదర్ ఇన్‌ఫోసిస్ లిమిటెడ్ కో. ఫౌండర్ నీలేకని ఆస్తులు రూ॥ 7,7000 కోట్ల రూపాయలు. ఇలా కుభేరుల సంఖ్యను లెక్కిస్తే, ప్రధాన జాతీయ, ప్రాంతీయ పార్టీలలో వారి సంఖ్య సగంకు పైనే వుంటుందని పత్రికలు వెల్లడించాయి. ఈ కుభేరులు ప్రజా 'ప్రతినిధులుగా' లోక్‌సభలోనూ, శాసనసభలోనూ పదవులనలంకరిస్తే ఏ వర్గ ప్రయోజనాల కోసం పని చేస్తారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీరిలో నేరచరితులు, అవినీతిపరులు, కుంభకోణాలలో ప్రమేయం వున్నవారి సంఖ్య కూడా తక్కువేమి కాదు. వీరి పదవుల ఆరాటం చూస్తే ఏ పార్టీలో వుంటే తమకు విజయం లభిస్తుందో అర్థం కాని అయోమయంలో పడి పార్టీలు మార్చే విషయంలో నిర్ణయాలు తీసుకోలేక గుండె జబ్బులు తెచ్చుకొన్న వారు సైతం వున్నారని బూర్జువా పత్రికలు సైతం 'జంప్ జిలానీల' పేరుతో వ్యంగ్య వాఖ్యానాలు చేసాయి. ఈ సారి ఎన్నికలు ఇంతగా భ్రష్టు పట్టి పోయి, వారు చెప్తున్న ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైతే కూడా ఎన్నికల సంఘం మాత్రం ఈసారి ప్రజలు ప్రజాస్వామిక ప్రక్రియలో చురుకుగా పాల్గొన్నారనీ, లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల శాతం పెరిగిందనీ, 66.38 శాతం ఓట్లు పోలయ్యాయనీ తప్పుడు లెక్కలు చూపుతూ అబద్దపు ప్రచారానికి పూనుకుంది. వాస్తవంగా ఎన్నికల సంఘం చూపుతున్న కాకి లెక్కలలో ఏ మాత్రం పసలేదు. వాస్తవంగా ఇంతకు ముందు జరిగిన ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా గణనీయమైన సంఖ్యలోనే ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా వున్నారు. విప్లవోద్యమ ప్రాంతాలుగా వున్న దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బెంగాల్ రాష్ట్రాలలోని విశాల గ్రామీణ ప్రాంతాలలోని విప్లవ ప్రజానీకం ప్రభుత్వ సాయుధ బలగాలను వీరోచితంగా ఎదుర్కొంటూ ఎన్నికలను బహిష్కరించారు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికారాన్ని నిర్మించుకొంటామని నినదించారు. ఒక్క ఒడిశాలోనే మల్కనగిరి, కొరాపుట్ జిల్లాల ఉద్యమ ప్రాంతాలలోని ప్రజలు ఎన్నికల బహిష్కరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని 14 కేంద్రాలలో ఈవిఎంలు తగులబెట్టారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మల్కనగిరి జిల్లాలో 49 శాతం, కొరాపుట్ జిల్లాలో 51 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. విప్లవోద్యమం బలంగా వున్న దండకారణ్యం, ఝార్ఖండ్ ప్రాంతాలలో ప్రజలు మరింత సమరశీలతతో ఎన్నికలను బహిష్కరించారు. ఉద్యమ ప్రాంతాలే

కాకుండా ఇతర ప్రాంతాలలో కూడా రకరకాల సమస్యల పరిష్కారానికి ప్రజలు ఎన్నికల బహిష్కరణని ఒక పోరాట రూపంగా చేపట్టారు. మొత్తంగా ఈ ఎన్నికల ద్వారా ఎవరు గెలిచినా తమ బతుకు మారుతుందని గానీ, ఈ వ్యవస్థలో మౌలిక మార్పు వస్తుందని గాని పీడిత ప్రజలెవ్వరూ విశ్వసించడం లేదు. అయితే ఎన్నికల సంఘం ప్రకటించిన 66.38 శాతం పోలింగు బండారాన్ని చూసినపుడు వాస్తవాలు ఈ విధంగా వున్నాయి. పార్టీలు ఎవరికి బలముంటే వారు తమ గూండా బలంతో పోలింగు కేంద్రాలను ఆక్రమించుకుని రిగ్గింగ్ చేసారు. ఓట్లు వేస్తున్న వాళ్ళలో కూడా ఎక్కువ మంది ఎన్నికలు తమకేదో ఒరగబెడతాయనే నమ్మకంతో కాక కేవలం స్థానిక అవసరాల కోసమో, కులం, మతం, ప్రాంతీయత, డబ్బు, మద్యం, గూండాయిజం తదితర వత్తిళ్ళతోనో, లేదా ప్రభావాలతోనో ఓట్లు వేసారు. కొద్దిమంది అధికారంలో వున్న పార్టీపై వ్యతిరేకతతో మరో పార్టీకి ఓటు వేసారు. ఈసారి మాత్రం కార్పొరేట్ మీడియా ఒక పథకం ప్రకారం మోసపూరితంగా ప్రజలను మోడి వైపు తిప్పటంలో విజయం సాధించింది.

ఇక నిర్దుష్టంగా చూసినపుడు ఈసారి ఎన్నికల పార్టీలన్నీ అవినీతిపై యుద్ధాన్ని ప్రకటిస్తూ అభివృద్ధి మంత్రాన్ని జపించాయి. అయితే వాస్తవంగా ఎన్నికలలో పోటీ చేసిన ప్రధాన పార్టీలన్నీ సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తూ భారత దోపిడి పాలక వర్గాలకు ప్రాతినిధ్యం వహించేవే. ఈ పార్టీలన్నీ అభివృద్ధి నిరోధక, అవినీతికర, ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు స్వభావం కలిగినవే. అన్ని ప్రజాస్వామిక విప్లవ పోరాటాలను అణచివేయడమే వీటి లక్ష్యం.ఈ విషయాలలో వీటి మధ్య ఈ సారూప్యత ఉన్నప్పటికీ దోపిడీ సంపదలో అధికవాటా చేజిక్కించు కొనేందుకూ, ప్రజలపై అధికారం చెలాయించేందుకు కుమ్ములాడుకుంటుంటాయి. ఈ కుమ్ములాటలు ఎన్నికల సందర్భంగా మరింత నగ్నంగా బహిర్గతమవుతుంటాయి. ఈసారి ఎన్నికల సందర్భంగా ఈ కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి.

ఈసారి ఎన్నికలలో బిజెపి ప్రధానంగా తన దాడిని కాంగ్రెస్ అవినీతి పాలనపై, అసమర్థ పాలనపై ఎక్కుపెట్టింది. ముఖ్యంగా గుజరాత్ అభివృద్ధి నమూనాను ఆకాశానికి ఎత్తి దేశం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించే నాయకుడిగా మోడిని ప్రచారం చేస్తూ అతడిని తన ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. వాస్తవంగా 'గుజరాత్ వికాస్ నమూనా' అంటే ముస్లిం మత మైనారిటీల ఊచకోత, వారిని టెర్రరైజ్ చేయడం, వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, వారిని తమ మూల వాసాల నుండి తరిమివేయడం లేక లొంగదీసుకోవడం, బహుళజాతి కంపెనీల, బడా బూర్జువాల మదుపులకు హబ్‌గా రాష్ట్రం మొత్తాన్ని మార్చివేసి వారి అంతులేని దోపిడీ పీడనలకు తలుపులు బోర్లా తెరవడమే. అయితే ఈ వాస్తవాన్ని మరుగుపరిచి 'గుజరాత్ వికాస్ నమూనా'కు నగిషీలు చెక్కి దానిని దేశాభివృద్ధికి ఏకైక పరిష్కారంగా చూపుతూ ప్రజలను తప్పుదోవ పట్టించారు. ఈ ప్రచారంలో కార్పొరేట్ మీడియా ప్రధాన పాత్ర పోషించింది. ఇంతే కాకుండా మోడి 'వ్యక్తిత్వాన్ని' 'సామర్థ్యాన్ని' 'దేశభక్తి'ని ఊదరగొడ్తూ శ్రామిక ప్రజలను ప్రభావితం చేసేందుకు మోడిని 'చాయ్‌వాలా'గానూ, 'బి.సి'గానూ ప్రచారం చేసారు. మనం పైన చెప్పుకొన్నట్లుగా దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలలోని ఒక బలమైన ముఠా తమ ప్రయోజనాలను నెరవేర్చే ఫాసిస్టుగా మోడిని ఎంపిక చేసుకోవడం వల్ల ప్రారంభం నుండి బిజెపి కృషి ఒక పథకం ప్రకారం కొనసాగుతూ వచ్చింది. ఈ కృషిని శక్తివంతంగా కొనసాగించేందుకు తమకున్న వనరులను, శక్తి సమర్థతలను పూర్తిగా వెలికి తీసారు. బి.జె.పి అధికారం కైవసం చేసుకునేందుకు పని ప్రారంభించినప్పటి నుండి దానికి తెరముందు, తెరవెనుక హిందూ మతోన్మాద సంస్థలైన ఆర్.ఎస్.ఎస్, వి.ఎచ్.పిలు వుంటూ పద నిర్దేశం చేస్తూ వచ్చాయి. ఈ మత సంస్థల మార్గదర్శకత్వంలోనే ఒక పథకం ప్రకారం ముజఫర్‌నగర్‌లో ముస్లింలపై ఊచకోత నిర్వహించి హిందువుల ఓట్లను దండుకొనేందుకు ప్రయత్నించారు. మోడిని ప్రధానిగా చేసే విషయంలోనూ, వారణాసి సీటును మోడికి కేటాయించే విషయంలోను అద్వాని, మురళి మనోహర్ జోషి వంటి సీనియర్ నాయకులకు కొంత అసంతృప్తి వున్నప్పటికీ ఈ తగవులను ఆర్.ఎస్.ఎస్, వి.ఎచ్.పిలతో పాటు దోపిడీ వర్గ ముఠా కలిసి సఖ్యపరిచాయి. మోడిని ప్రధాని చేసే విషయంలో ఆటంకాలు రాకుండా చూసుకొన్నాయి. ఎన్నికలకు ముందే బిజెడి, జెడియు లాంటి పార్టీలు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎని వదిలి వెళ్ళిపోయినప్పటికీ, బీహార్‌లో రాంవిలాస్ పాశ్వాన్ నాయకత్వంలోని ఆర్.ఎల్.డినీ, ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీని ఎన్‌డిఎలో భాగస్వామ్య పార్టీలుగా చేర్చుకున్నారు. మొత్తంగా ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుండి భారత పాలక వర్గాలు, సామ్రాజ్యవాదులు ఒక పథకం ప్రకారం మోసపూరితమైన ప్రచారంతో, మతమైనారిటీలను భయోత్పాతానికి గురిచేసి, వేల కోట్ల రూపాయలు వెదజల్లి ఎన్నికల తీర్పును తమకనుకూలంగా మార్చుకున్నారు. మోడి నేతృత్వంలోని బిజెపికి 283 సీట్లు రాగా మొత్తం ఎన్‌డిఎ కూటమికి 336 సీట్లు వచ్చాయి.

మరోవైపు కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీని ఫోకస్ చేస్తూ ఎన్నికల ప్రచారానికి పూనుకుంది. ముఖ్యంగా తమ 10 ఏళ్ళ పాలనలో తాము సాధించిన అభివృద్ధినీ, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రచారం చేసింది. తాము సాధించిన అభివృద్ధి వల్ల దారిద్ర్యరేఖ కింద ఉన్న కొంత శాతం ప్రజానీకం మధ్యతరగతిలోకి ప్రమోట్ అయ్యారని రాహుల్ తన ఎన్నికల ప్రచారంలో పేర్కొన్నాడు. ముఖ్యంగా మనరేగా, ఆహార భద్రతా పథకం, భూ అధిగ్రహణ చట్టం, నగదు బదిలీ పథకం, నిర్భయ చట్టం వంటి వాటిని ప్రచారం చేస్తూ 'భారత నిర్మాణ్' అనే ప్రధాన నినాదాన్ని ముందుకు తెచ్చింది. అయితే 10 ఏళ్ళ పాలనలో కాంగ్రెస్ పొందిన ఘోర వైఫల్యాలు ప్రజల కళ్ళముందు కదలాడుతుండటంతో, కాంగ్రెస్ ప్రజలను మభ్య పెట్టలేక పోయింది. చివరికి భారత పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలలోని ఒక బలమైన ముఠా, అమెరికన్ సామ్రాజ్యవాదులు సైతం కాంగ్రెస్ తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్ళలేదనే అభిప్రాయానికి వచ్చి మోడి అభ్యర్థిత్వాన్ని బాహటంగా బలపరచడంతో కాంగ్రెస్‌కు ఘోరపరాజయం తప్పలేదు. కేవలం 44 సీట్లు మాత్రమే సంపాదించి, మునుపెన్నడూ లేనంత పరాభవాన్ని పొందింది.

వామపక్షాలు కాంగ్రెస్, బిజెపి ఫ్రంట్‌లకు వ్యతిరేకంగా మూడవ ఫ్రంటును ఏర్పరిచే నిర్వాహక భారాన్ని నెత్తినేసుకున్నాయి. ఇందులో సమాజ్‌వాది పార్టీ, అన్నా డి.ఎమ్.కె, జె.డి.యు, బి.జె.డి వంటి 11 పార్టీలున్నాయని చెప్పుకున్నప్పటికీ, ఢిల్లీలో జరిగిన

ప్రారంభ సభకి బి.జె.డి, అస్సాం గణసంగ్రామ్ పరిషత్‌ల నుండి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. హాజరైన వారిలో కూడా సీట్ల సర్దుబాట్లు మొదలుకొని అనేక విషయాలలో భావసమైక్యత లేకపోవటం వలన ఎన్నికల తదనంతరం ఈ ఫ్రంట్ ఉనికిలోకి వస్తుందని ప్రకటించారు. వామపక్షాలతో వున్న వైరుధ్యం రీత్యా తృణమూల్ ఈ ఫ్రంట్‌కు దూరంగానే వుండిపోయింది. ఇక్కడ వామపక్షాల పాత్రను మనం ప్రత్యేకంగానే పేర్కొనాలి. ఈ రివిజనిస్టు పార్టీలు ప్రారంభం నుండి శ్రామిక ప్రజలను పార్లమెంటరీ పంథాకు కట్టిపడవేసి దోపిడీ పాలక వర్గాలకు ఎనలేని సేవ చేస్తూ వస్తున్నారు. ఈసారి కూడా బి.జె.పి, కాంగ్రెస్‌లకు సమాన దూరమంటూ, హిందూమతోన్మాదానికీ, సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకమంటూ ప్రజలను మోసం చేసేందుకు మూడవ ఫ్రంట్‌కు తెరతీసారు. వాస్తవంగా ఈ పార్టీలన్నీ హిందూమతోన్మాదానికీ, సామ్రాజ్యవాదానికి అనుకూలమైనవే తప్ప వ్యతిరేకమైనవి కావు. ఇంతా చేసి ఈ ఫ్రంట్ ఉనికి లోకి రాకుండానే వామపక్షాలతో పాటు ప్రముఖ ప్రాంతీయ పార్టీలైన సమాజ్‌వాదీ, జెడియు లాంటి పార్టీలు మోడి ప్రభంజనంలో ఘోరంగా దెబ్బతిన్నాయి. తమిళనాడులో అన్నా డి.ఎమ్.కె, ఒడిశాలో బిజెడి, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లు మాత్రం తమ స్థానాల్ని నిలబెట్టుకున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎలో భాగస్వాములుగా వున్న ఆర్.జె.డి, డి.ఎమ్.కె లాంటి పార్టీలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయి.

పై మూడు ఫ్రంట్‌లతో సంబంధం లేకుండానే కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ దేశ వ్యాపితంగా లోక్‌సభ ఎన్నికలకు తన పార్టీ సభ్యులను స్వతంత్ర్యంగా పోటీకి నిలబెట్టుకుంది. కేజ్రీవాల్ ప్రారంభంలో అన్నాహజారేతో కలిసి అవినీతికి వ్యతిరేకంగా పోరాడాడు. కానీ ఎన్నికల విషయంలో ఇద్దరి మధ్య వచ్చిన విభేధాల వలన కేజ్రీవాల్,అన్నాహజారే నుండి విడిపోయి ఆమ్ ఆద్మీ అనే నూతన పార్టీని ఏర్పాటు చేసాడు. ఈ పార్టీ గ్లోబలైజేషన్‌లో పుట్టి పెరుగుతున్న నయా సంపన్న వర్గాల పార్టీ, ఈ పార్టీ వెనుక ఎన్.జి.ఓ అధిపతులు, కార్పొరేట్ వ్యాపార వర్గాలు, మేనేజర్లు, బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగ నిపుణులు, సమాచార రంగ నిపుణులు వంటి నయా సంపన్న కూటమి వుంది. వీరు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చేందుకు పథకాలు రూపొందించుకున్నారు. ఈ పథకంలో భాగంగానే కాంగ్రెస్‌తో పాటు బిజెపి, ఇతర పార్టీల అవినీతిపై తమ దాడిని ఎక్కుపెట్టారు. అనిల్ అంబాని వంటి కార్పొరేట్ అధిపతులతో కాంగ్రెస్, బిజెపి, ఇతర పార్టీలకున్న సంబంధాలను బహిర్గతపరుస్తూ, క్రోని కాపిటలిజంకు తాము వ్యతిరేకమని ప్రచారం చేసుకున్నారు. వీరు చెబుతున్నది సోషలిజం అని ప్రజలు భ్రమించేలా ప్రకటనలు చేసారు. వీరు తమ ప్రచారానికి సోషల్ మీడియాను శక్తివంతంగా ఉపయోగించుకొన్నారు. ఇటువంటి జిమ్మిక్కులతోనే ఢిల్లీ రాష్ట్ర ఎన్నికలలో అధికారం కైవశం చేసుకొన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సమస్యలేవీ పరిష్కరించలేక పోగా, తమ అసమర్థతను కప్పిపుచ్చుకొనేందుకు ప్రతిపక్షాలు (కాంగ్రెస్, బిజెపి) తమకు సహకరించడం లేదని ప్రకటించి తమ ప్రభుత్వాన్ని రద్దు చేసుకున్నారు. ఈ నిర్ణయానికి ఢిల్లీ ప్రజల ఆమోదం వుందని ప్రకటించారు. ఈ క్రమంలో తాము తీసుకున్న నిర్ణయాలన్నీ ప్రజలను తమవైపు ఆకర్షింపచేస్తాయనీ, రానున్న పార్లమెంటు ఎన్నికలలో అధిక సీట్లు సంపాదించి పెట్టి, దేశ అధికారాన్ని కట్టబెడ్తాయని భ్రమించారు. కానీ పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ఆప్‌కు ఆశాభంగాన్ని మిగిల్చాయి. తమకు బలమైన కేంద్రంగా భావించిన ఢిల్లీలో సైతం 7 పార్లమెంటు నియోజక వర్గాలలో ఒక్క దానిని కూడా గెలుచుకోలేక పోయారు. చివరికి చావుతప్పి కన్నులొట్ట పోయినట్లు పంజాబ్‌లో మాత్రం 4 సీట్లు సంపాదించుకున్నారు.

ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విషయానికి వస్తే రెండు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ ఘోరంగా దెబ్బతిన్నది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంపై కాంగ్రెస్ అనుసరించిన అవకాశవాద పద్ధతే కాంగ్రెసును ఈ దుస్థితికి నెట్టింది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభం నుండి వ్యతిరేకిస్తూ, ఆ ఉద్యమంపై తీవ్ర నిర్బంధాన్ని అమలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఉద్యమ ఉధృతిని చూసి అనివార్య పరిస్థితులలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర బిల్లును ఉభయ సభలలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. కాంగ్రెస్ అనుసరించిన ఈ అవకాశవాద పద్ధతి వలన ఇటు ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నిరసన వెల్లువెత్తితే, తెలంగాణలో ప్రజల మద్ధతును పొందలేక పోయింది. చివరికి దాని పరిస్థితి రెంటికి చెడిన రేవడిలా అయింది.

ఆంధ్రప్రదేశ్‌లో ధరావత్తులు కోల్పోతే, తెలంగాణలో కేవలం తన ఉనికిని మాత్రం కాపాడుకొన్నది. చంద్రబాబు ప్రారంభం నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు నాకు రెండు కళ్ళు అంటూ 'రెండు కళ్ళ సిద్ధాంతాన్ని' మాట్లాడుతున్నప్పటికీ సీమాంధ్ర పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసమే పని చేస్తూ వచ్చాడు. ఎన్నికల సందర్భంగా మోడి ప్రభంజనం తన గెలుపుకు ఉపయోగపడుతుందని భావించి వచ్చి అవకాశవాదంతో తెలుగుదేశాన్ని ఎన్.డి.ఎలో చేర్చాడు. గతంలో బి.జె.పిని మత పార్టీ అంటూ దూషించిన చంద్రబాబు ఈసారి 'చారిత్రక అవసరం' అంటూ బి.జె.పి నేతృత్వంలోని ఎన్.డి.ఎతో జట్టు కట్టాడు. మరోవైపు సీమాంధ్రలోని స్థానిక దళారీ నిరంకుశ పెట్టుబడిదారి వర్గంలోని ప్రధాన శక్తులు తమ ప్రయోజనాలు నెరవేర్చగలిగే నాయకుడిగా చంద్రబాబునే ఎంచుకున్నారు. ఎన్.డి.ఎ గెలుపు ఖాయం అవుతుండటాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని జగన్ నేతృత్వంలోని వై.ఎస్.ఆర్ పార్టీ నుండి కొంతమంది క్రమంగా టి.డి.పి వైపు జరిగారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం 102 సీట్లను, భాగస్వామ్య పార్టీ అయిన బి.జె.పి 4 సీట్లను గెలుచుకొని అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. తెలంగాణలో మొదటి నుండి ఉద్యమానికి నేతృత్వం వహించిన టి.ఆర్.ఎస్ 63 స్థానాలను గెలుచుకొని అధికారం చేజిక్కించుకోగా, కాంగ్రెస్ 20 సీట్ల దాకా గెలుచుకొని చావు తప్పి కన్నులొట్ట పోయినట్లుగా తన ఉనికిని కాపాడుకుంది. తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో ఉన్న కోస్తా జిల్లాల ప్రజల ఓట్లతో పాటు బి.సి సామాజిక వర్గానికి చెందిన వారిని ముఖ్యమంత్రిని చేస్తాననే హామి ఇవ్వడం వల్ల మరికొన్ని ఓట్లు పోలైనాయి. దీంతో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కూడా కొంత వరకు తన ఉనికిని నిలబెట్టుకుంది. ఒడిశాలో బి.జె.డి, అరుణాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ, సిక్కింలో సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ శాసనసభ ఎన్నికలలో విజయం సాధించాయి.

ఈ ఫలితాలన్ని తెలియజేసేదేమిటంటే దోపిడీ పాలక

వర్గాలు మరోసారి ప్రజలను విజయవంతంగా వంచనకు గురి చేసాయనేదే. ఈ రాజకీయ ఘటనల క్రమాన్ని వాటి పూర్తి ప్రభావాన్ని మనం త్వరలోనే చూడబోతాము. అంటే కేంద్రంలోని బి.జె.పి, రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీలు తమ అసలు ఎజెండాను అమలు చేయబోతున్నారనేదే. ముఖ్యంగా గత కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడి పోయిన అన్ని రంగాలలో సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వాముల ప్రయోజనాల కోసం ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయబోతున్నారు. ప్రజలు వీటిని వ్యతిరేకిస్తారు కనుక ఈ ప్రభుత్వాలకు బలప్రయోగం చాలా అవసరం. ఈ పనిని చక్కగా నిర్వహిస్తాడనే దోపిడీ వర్గాలు మోడిని అధికారంలోకి తెచ్చిపెట్టుకున్నాయి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు కూడా దోపిడీ వర్గాలకు అత్యంత ప్రీతిపాత్రుడే. మిగిలిన రాష్ట్రాలలో కూడా కాస్త ముందూ వెనుక ఇదే పరిస్థితి ఏర్పడబోతున్నది. ఇప్పటికే కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాలలోనూ సాయుధ బలగాల వ్యవస్థను పటిష్టం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం (బ్యూరాక్రాట్స్)లో నమ్మకస్తులను, విశ్వాసపాత్రులను, వర్గ ప్రయోజనాలను దృఢంగా నెరవేర్చే వారిని సమీకరించి తగిన బాధ్యతలు, అధికారాలు ఇస్తున్నారు. మరోవైపు దేశ అభివృద్ధి, సమైక్యత వంటి నినాదాలతో ప్రజలను మత్తులో ముంచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ చర్యలన్నీ రానున్న ఫాసిజానికి సంకేతాలే. వాస్తవంగా ఈ దేశ శరీరంపై పరాన్న భుక్కులా ఉండి ప్రజల రక్తాన్ని, దేశ సంపదను పీల్చి పిప్పి చేస్తున్న దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు ఉన్నంతకాలం దేశ అభివృద్ధి, దేశ సమైఖ్యతలకు అర్థమే లేదు. దోపిడీ వర్గాల దృష్టిలో దేశ అభివృద్ధి అంటే దోపిడీ వర్గాల అభివృద్ధి అనే, దేశ సమైఖ్యత అంటే దేశాన్ని జాతుల బంధీఖాన చేయడమనే. కనుక ఈ దోపిడీ వర్గాలను వాటి రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేసేదాక దేశ అభివృద్ధి కానీ, దేశ సమైఖ్యత గానీ సాధ్యం కాదు. ఇకపోతే రానున్న ఫాసిజం ఎంతో దూరం ఉందని భావించడం పొరపాటే అవుతుంది. ఇప్పటికే ఆ సంకేతాలు కనిపిస్తున్నాయి. కేరళలో కాలేజి మ్యాగ్‌జైన్‌లో మోడిని హిట్లర్‌తో పోల్చి బొమ్మలు వేసినందుకు 9మంది కాలేజీ విద్యార్థులను అరెస్టు చేసారు. ఆ పత్రికను ఉపసంహరింప జేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమలలో చంద్రబాబు ఆదేశం ప్రకారం ముగ్గురు కామ్రేడ్స్ పోలీసులు పట్టుకొని కాల్చి చంపారు. ఈ సంఘటనలు రానున్న ఫాసిస్టు పాలనకు ప్రారంభ సూచికలుగా గుర్తించాలి. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఫాసిస్టు దాడిని మొదటగా విప్లవోద్యమం పైనే ఎక్కుపెట్టి తీవ్రతరం చేస్తాయి. విప్లవోద్యమ ప్రాంతాలపై ఆకాశ దాడులకు నిర్ణయాలు తీసుకోబోతున్నారనే విషయాన్ని కూడా మనం దృష్టిలో ఉంచుకోవాలి.

ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు మన ముందు ఒకే ఒక్క మార్గం ఉంది. అది ప్రజలను, ముఖ్యంగా ప్రజలలోని పురోగామి శక్తులను చైతన్యవంతం చేసి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా సంఘటిత పరచాలి. పాలకుల, మాటలకూ, ప్రకటనలకూ, వాగ్దానాలకూ, చర్యలకు వెనుక వారి ప్రయోజనాలు దాగి ఉంటాయనే విషయాన్ని ప్రజలు గ్రహించేలా చేయాలి. ప్రజలను, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలలోకి సమీకరించాలి. ఈ బూటకపు పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికల ద్వారా దోపిడీ వర్గాలలోని ముఠాలు మాత్రమే అధికారంలో మారుతుంటారనీ, ప్రజలకు అధికారం దక్కాలంటే దున్నేవారికే భూమి ప్రాతిపదికన, వ్యవసాయ విప్లవమే ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో ముందుకు సాగాలనీ, అప్పుడే ప్రజల ప్రజాస్వామిక రిపబ్లిక్కుల సమాఖ్యను నిర్మించుకోగలమనీ ప్రజలకు అర్థం చేయించాలి.

---

**(13 వ పేజీ తరువాయి భాగం)**

మరింత మేలైనవైన ఫలితాలను సాధించాలి. విమర్శ, ఆత్మవిమర్శ సాగించడానికీ, యధాతథవాదాన్ని అధిగమించడానికీ, మరిన్ని గొప్ప విజయాలు సాధించడానికీ మనం ప్రజారాశులను సమీకరించాలి. యావత్తు పార్టీని సంసిద్ధం చేయాలి, యావత్తు దేశాన్ని సంసిద్ధం చేయాలి.

1.గ్రామీణ పనుల డిపార్టుమెంటుపై విమర్శకై, మావో రచనలు ఐదవ సంపుటిలోని "వ్యవసాయపు సోషలిస్టు రూపాంతరీకరణ గురించి, వర్తమాన వర్గపోరాటాన్ని గురించి చర్చ" అనే వ్యాసాన్ని చూడండి. పేజీలు 269-300.

2.వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికై పార్టీ అంతటా విస్తృతమైన చర్చలు జరిపిన పిదప, కామ్రేడ్ మావో ఒక 17 అంశాల కార్యక్రమాన్ని రూపొందించారు. (మావో రచనలు ఐదవ సంపుటి, పేజీలు 355-360 చూడండి). అటు తర్వాత ఇది 40 అంశాల కార్యక్రమంగా రూపుదిద్దుకుంది.

చైనా పారిశ్రామికీకరణకు అవసరమైన నిధుల్ని చేకూర్చి పెట్టడానికి అవసరమైన ప్రాథమిక సంచయనాన్ని సమకూర్చుకోవడానికై విదేశీ మార్కెట్లపై ఆధారపడడానికి బదులు వ్యవసాయ ఉత్పత్తిపైన స్వదేశీ వ్యవసాయ మార్కెట్‌పైన ఆధారపడాలని 40 అంశాల కార్యక్రమం చెప్పింది. ఉత్పత్తి శక్తుల్ని మరింత అభివృద్ధి చేయడానికి, సహకార ఉద్యమాన్ని మరింత వృద్ధి చేయడానికి ఉత్పత్తి సంబంధాలను మార్చడం ఒక షరతు అని కూడా 40 అంశాలు ఉద్ఘాటించాయి. విస్తృత మెజారిటీ రైతాంగ ప్రజా బాహుళ్యం తమ ఆదాయాన్ని ఈ క్రమం ద్వారా పెంపొందించుకోవాలి. ఈ 40 అంశాల్ని 1956లోనూ, 1957లోనూ పక్కన పెట్టినప్పటికీ అవి గొప్ప ముందంజలో అంతర్భాగమయ్యాయి.

3. ప్రాథమిక సహకార సంఘం, భూమిని వాటాలుగా జమచేయడం, ఏకీకృత మేనేజ్‌మెంట్ అనే లక్షణాలు వుండే. ఈ సహకార సంఘం, అర్థ సోషలిస్టు స్వభావం కలది. భూమి, పశువులు, పెద్ద పెద్ద వ్యవసాయ పనిముట్ల వంటి ఉత్పత్తి సాధనాలపై సహకార సంఘ సభ్యుల వ్యక్తిగత యాజమాన్యాన్ని అది కొనసాగిస్తుంది. వాటిని వాడినందుకుగానూ సహకార సంఘం తన సభ్యులకు "డివిడెండ్" చెల్లించాలి. అందువల్ల ప్రాథమిక సహకార సంఘం అర్ధ-వ్యక్తిగత యాజమాన్యం కలిగి ఉన్నది. అని చెప్తాము.

**సిద్ధాంత వ్యాసం**

# మితవాద పెడధోరణినీ, యధాతథవాదాన్నీ వ్యతిరేకించండి

**డిసెంబరు 6, 1955** **– కా॥ మావో**

మితవాదం కంటే అతివాదమే మేలు అని అనడం సరికాదు. అతివాదం కంటే, మితవాదమే మేలు అనడమూ సరికాదు. కొందరు వాస్తవాలకు వెనకబడి ఆలోచిస్తున్నారు. వారి తలలపై కొమ్ములు లేవు. వారికి చైతన్యం లోపించింది. రెండు పంథాల మధ్య పోరాటంలో వారు విమర్శకు పూనుకోరు. ఒకవేళ విమర్శ చేసినా, అందులో పస ఉండదు. వారికి విమర్శ అంటే భయం, ఓట్లు పడవని భయపడతారు. ఇవన్నీ మితవాద పెడధోరణి తాలూకూ అభివ్యక్తీకరణలే. పార్టీ లోపల వారిని వ్యతిరేకించాలి. కేంద్ర కమిటీ ఆరవ ప్లీనం, గ్రామీణ పనుల డిపార్టుమెంటులో నెలకొని ఉన్న మితవాద పెడధోరణితో కూడుకుని ఉన్న అనుభవవాదాన్ని విమర్శించింది.[1] నాయకత్వపు ఆలోచనలు వాస్తవానికి వెనకబడి ఉంటున్నాయి. ఇది అతి తీవ్ర సమస్యే. పెట్టుబడిదారీ విధానాన్ని పరివర్తన చెందించడంలోనూ, విప్లవ ప్రతిఘాతుకుల అణచివేత ఉద్యమంలోనూ, సహకార సంఘోద్యమంలోనూ, అంతటా ఇలానే ఉంది. మన స్వంత శక్తి సామర్థ్యాలను మనం తక్కువగా అంచనా వేసుకున్నాం. గతంలో వ్యవసాయరంగం పరిశ్రమారంగం కంటే వెనకబడి ఉండేది. 17 అంశాల కార్యక్రమం[2] వెలువడిన తరువాత, వ్యవసాయం పరిశ్రమారంగానికి దీటుగా ఎదిగి, పురోగతిని సాధించక తప్పని స్థితికి పరిశ్రమా రంగాన్ని నెట్టింది. ఉదాహరణకు ప్రాథమిక స్థాయి వ్యవసాయోత్పత్తిదారుల సహకార సంఘాలను[3], ఉన్నత దశకు పురోగమించకుండా మరో మూడు నాలుగేళ్ళపాటు వాటిని యధాతథ స్థితిలో కొనసాగేటట్లుగా మనం చేసి ఉండివుంటే, అది మనకు నష్టదాయకంగా పరిణమించి ఉండేది. 1959లో సోషలిజాన్ని సాధించే అవకాశం ఉంది. యధాతథవాదాన్ని వ్యతిరేకించడమే, 17 అంశాల కార్యక్రమపు మూలాభిప్రాయం. అందుకు సమగ్రమైన ప్లానింగ్, నాయకత్వాన్ని దృఢపర్చుకోవడం, మౌలిక చర్యలు, పురోగామి అనుభవం, ఇవి అవసరమవుతాయి. ఆరు నెలల క్రితం ఇవి మన దృష్టిలో లేవు. మనం ఇపుడు మారాం. ఒక కొత్త ఖండాన్ని కనుగొన్నామా అనే తీరులో పెనుమార్పులు, ఉత్పాదక శక్తి ఆవిర్భవించాయి. ఈ కొత్త ఖండం ఎప్పటి నుంచో ఉనికిలో ఉంది. మనం దాన్ని చూడలేకపోయాం, అంతే. పరిశ్రమ వాణిజ్యరంగాల సోషలిస్టు పరివర్తన 1957 నాటికి 90 శాతం వరకూ పూర్తవుతుంది. చేతివృత్తుల రంగ పరివర్తనను కూడా తప్పనిసరిగా ఉదృతం చేయాలి. మన ప్రస్తుత ప్రణాళిక అతి సాదా లక్ష్యాలను పెట్టుకుంది. 1957 నాటికి 70 నుండి 80 శాతపు పరివర్తనను పూర్తి చేయడం మన ధ్యేయం. పరిశ్రమ, వాణిజ్యరంగాల జాతీయీకరణను 1962లో చేపట్టాలనీ మొదట్లో అనుకున్నాం. బహుశా దీన్ని అనుకున్న వ్యవధికి ముందుగానే సాధించగలమేమో? ప్రభుత్వ ప్రైవేటు ఉమ్మడి యాజమాన్య దశకు చేరుకున్న తరువాత, దాన్ని ప్రభుత్వ యాజమాన్యంగా పరివర్తన చెందించడం కష్టం కాబోదు. సహకార సంఘోద్యమాన్ని 18 ఏళ్ళలో పూర్తి చేయాలని తొలి ప్రణాళిక పిలుపునిచ్చింది. అయితే, అది పది ఏళ్ళలోనే పూర్తయింది. మనం వాస్తవానికి వెనకబడి ఉన్నాం అనే విషయాన్ని ఈ అంశం రుజువు చేస్తుంది. ప్రజారాశులలో అపార శక్తి సామర్థ్యాలు నిబిడీకృతమై వున్నాయి. వారు పలు కార్యాలను సమర్ధవంతంగా చేపట్టగలరు. పరివర్తనను అనుకున్న వ్యవధి కంటే ముందుగానే సాధించడానికిగాను మనం మితవాద పెడధోరణిని, యధాతథవాదాన్ని వ్యతిరేకించాల్సి వుంటుంది. మనం 15 ఏళ్ళ లోపల్నే పెట్టుకున్న లక్ష్యాలను మీరుతూ మన ధ్యేయాలను సాధించాలనీ, "ఇంచుమించుగా", "ప్రాథమికంగా", "దాదాపు పదిహేనేళ్ళలో" వంటి అనిశ్చితార్థ పదాలను విసర్జించాలనీ నేను ప్రతిపాదిస్తున్నాను. కృషి చేయడం ద్వారా సాధించగలిగేదాన్ని సాధించడానికి మనం పాటుపడాలి. ఉదాహరణకు, వస్తువుల కోసం ఆర్డర్లు ఇస్తున్నప్పుడు, వాటిని బహు త్వరగా అందజేయాలని మనం డిమాండ్ చేయవచ్చు. అమెరికాతో యుద్ధ చర్యలు నిలిచిపోయిన ఈ కాలాన్ని (కొరియాలో యుద్ధ విరమణ) ఊపును ఉదృతం చేసి, మన కర్తవ్యాలను సాధించుకోడానికై సద్వినియోగ పెట్టుకోవాలి. "పార్టీ 8వ జాతీయ మహాసభ" ఉద్దేశం ఇదే. పరివర్తనా కాలానికి సంబంధించిన సాధారణ కర్తవ్యాలను మరింత తేలిగ్గా నిర్వహించవచ్చు. పనులను వేగిరంగా పూర్తి చేయడం వల్ల చాలా మేలే జరుగుతుంది. ఏమంటే, అపుడు ఒకవేళ తైవాన్‌తో పోరాడవలసి వస్తే, మనం అంతకు ముందుకన్నా మేలైన స్థితిలో ఉంటాం. కానీ, మనం మన నిర్మాణ కృషి కర్తవ్యాలను పరిపూర్తిచేయలేకపోతే, అప్పుడది మరింత కష్టమవుతుంది. మనం మరింత ఉధృతంగా పని చేయాలి, మన పని తాలూకు అన్ని అంశాలలోనూ, మరింత సత్వరంగా లంభించేవీ, మరింత గొప్పవీ, మరింత మేలైనవీ అయిన ఫలితాలను తప్పక సాధించాలి. తగు పరిస్థితులున్న పనులను–ప్రజా రాశుల కోరికల నుండి ఉత్పన్నమైన పనులను చేపడితే, మనం మరింత మేలైన ఫలితాలను మరిన్నింటిని సాధిస్తే, దాని అర్థం మనం నిలకడగా పురోగమిస్తున్నాం అని. గుడ్డిగా, దుస్సాహసికంగా పురోగమించడాన్ని వ్యతిరేకించే ఉద్యమంలో గతంలో మనం కొన్ని తప్పులు చేశాం. మనం కేడర్ల, ప్రజా రాశుల క్రియాశీలతను, ఉత్సాహన్ని నీరుగార్చాం. ఇది తప్పు. దుస్సాహసిక పురోగమన వ్యతిరేక ఉద్యమం, నిరక్ష్యరాస్యతా ఉద్యమాన్ని ఊడ్చి పారేసింది. చిత్తశుద్ధితో నడుచుకోవడం అనే ఉధృత చైతన్యం అణచివేయబడింది. దుష్ట కుటిల విషవాతావరణ ప్రభావం విజృంభించింది. కేడర్లూ, ప్రజారాశులూ ఇరువురు తమ ఊపును కోల్పోయారు. అటువంటి సమస్యను త్వరితంగా గుర్తించకపోవడం మూలంగా కేంద్రం (కమిటీ) తన బాధ్యతను విస్మరించింది. "కమ్యూనిస్టు పార్టీని అనుసరిస్తే చాలు, ఇక అడుసులో కాలు పెట్టబోము" అని ప్రజలు అంటున్నారు. సాధారణ వైఖరితో చూసినపుడు మనం తప్పు చేయలేదు కానీ, కొన్ని నిర్దిష్ట వ్యవహారాల్లో మనం తప్పులు చేశాం. మనల్ని అనుసరించి ప్రజలూ తప్పు చేశారు. ముందుకెళ్ళడానికి పలు బాటలున్నాయి. అత్యుత్తమమైనది,

సాధారణమైనది, అంత మంచిది కానిది. ప్రజలకు ముందుపీటిన నిలబడి, వారిని ముందుకు కదలండని ప్రోత్సహించడమే సరైన, సహేతుకమైన పంథా. అంతేకాని, వారి వెనక జేరి వారిని నీరుగార్చడం కాదు. సాపేక్షికంగా స్వల్పమైన వ్యవధిలోనే మనం సాపేక్షికంగా గొప్పవైన విజయాలను సాధిస్తే, అప్పుడు మనం నిలకడగా పురోగమిస్తాం. కాగా, మనం రొడ్డకొట్టుడు పద్ధతిలోనే పనుల్ని చేపట్టి చిన్న ఫలితాల సాధనకు ఎంతో కాలాన్ని వెచ్చిస్తుంటే, అపుడు మనం యథాతథవాద పంథాను అనుసరిస్తున్నట్టే. దీన్ని అధిగమించడానికి రెండు పద్ధతులున్నాయి. సమగ్రమైన ప్లానింగ్, ప్రజారాశులకు చేరువ కావడం. అది ఆఫీసుల్లో బైటాయించే పద్ధతి కాదు. కాగా, కొత్త విషయాలను, కొత్త అనుభవాలను కనుగొనడానికి, పురోగామి అనుభవాలను సేకరించడానికి, వాటిని ప్రాచుర్యంలోకి తేవడానికి ప్రజారాశులకు చేరువగా వెళ్ళడం. ఒక పిచ్చుక దేహ భాగాలను గురించి తెలుసుకోవడానికి చాలా పిచ్చుకల్ని పట్టాల్సిన పని లేదు. చెకియాంగ్, అన్హ్వీ రాష్ట్రాలు సహకార సంఘోద్యమాన్ని త్వరితంగా ముగించగల్గాయి అని మీకు తెలిసినపుడు, అదే పనిని దేశవ్యాప్త స్థాయిలో కూడా చేయవచ్చు అని మీకు తెలిసివస్తుంది. యథాతథవాదం ఒక వ్యక్తి సమస్య కాదు. వెనకబాటు తనాన్ని విమర్శించడానికి పురోగామి అనుభవాన్ని వినియోగించండి. కొత్త ఉత్పాదక శక్తులనూ, ప్రజలలో నిబిడీకృతంగా వున్న శక్తి సామర్థ్యాలనూ కనుగొనండి. ఇది నాయకత్వం తాలూకు ఒక సూత్రం. ఒక నాయకత్వ పద్ధతి. కేవలం దీని ద్వారా మాత్రమే ప్రజలకు విశ్వాసం కలిగించగలం. ఆఫీసుల్లో బైటాయించి ప్రజలకు చేరువగా వెళ్ళకపోవడం, పురోగామి అనుభవాలను సేకరించకపోవడం-ఇలా చేయకూడదు. అధికారిక వ్యవహారాల పనిని చూడాల్సే ఉంటుంది. అయితే, కేవలం అధికారిక వ్యవహారాల పనిని చూడడానికే నిన్ను నీవు పరిమితం చేసుకుంటే మాత్రం అది కూడదు. మీరు తనిఖీకి వెళ్ళినప్పుడు కూడా మీరు ఏవో కొన్ని వెనకబడిన పథకాలను చూసి, వాటిని చంకబెట్టుకవస్తే కుదరదు. మీరు పురోగామి విషయాలను గ్రహించాలి. బాధ్యతాయుత స్థానాల్లో వున్నవారు, సంవత్సరంలో ఏడు నుండి పది వారాలను ప్రజలకు చేరువగా వెళ్ళే కాలంగా వెచ్చించాలి. ఆఫీసుల్లో బైటాయించే పనిశైలిని, రివాజుగా వుండే పనులు చూడడానికి వాడుకోవచ్చు. పురోగామి అనుభవాల్ని, రివాజుల్ని ఛేదించుకు వెళ్ళడం ద్వారా మాత్రమే పొందగల్గుతాం. భౌతిక వాస్తవిక విషయాల్లో కొత్త ఆవిష్కారాలు అనునిత్యమూ అవిర్భవిస్తూనే వుంటాయి. అసమతౌల్యం, శాశ్వతమైనది, కాగా సమతౌల్యం తాత్కాలికమైనది మాత్రమే. ఇది ప్రగతి నియమం. సమతౌల్యాన్ని సాధించిన తర్వాత ఇక ఆ పైన ఏ మార్పులు వుండజాలవు అనే దృక్పథం తప్పుడిది. దానికి మారుగా అసమతౌల్యంలోని పురోగామి అంశాలను గ్రహించి, మిగిలిన అంశాలను ముందుకు తేవడానికి వాటిని వాడుకున్నప్పుడే పురోగతి వుండగలదు. కొత్త పుంతలు తొక్కడం గురించిగానీ, వైరుధ్యాలు ఉత్పన్నమవడం గురించిగానీ, వెరపుండకూడదు. శాశ్వత శాంతి, ప్రశాంతతలు విధిగా తప్పుల్ని ఉత్పన్నం చేస్తాయి. కొత్త పుంతలు తొక్కడం, సమతౌల్యాన్ని సాధించనెత్నించడం, ఈ రెండూ వుంటేనే గతితర్కం వుంటుంది. కేవలం ఈ విధంగా మాత్రమే మనం ప్రజారాశుల క్రియాశీలతను వికసింపజేయగల్గుతాం, సోషలిజాన్ని నిర్మించే కృషిని వేగిరపరచగల్గతాం. మనం మరింత వేగిరంగా లభించేవీ, మరింత మెరుగైనవిగా వుండేవీ, మరింత మేలైనవీ అయిన ఫలితాలతో సోషలిజాన్ని నిర్మించాలి. పదిహేను సంవత్సరాల లోపునే ఈ కర్తవ్యాల్ని, లక్ష్యాలను మీరుతూ పరిపూర్తి చేయాలి.

మన దేశాన్నీ సోవియట్ యూనియన్‌ను పోల్చిచూస్తే: 1. మనం స్థావర ప్రాంతాల్లో ఇరవై ఏళ్ళకు మించిన అనుభవాన్ని గడించివున్నాం. మూడు విప్లవ యుద్ధాల ఆచరణ మనకు వుండింది. అనుభవంలో మనం అత్యంత సుసంపన్నులం. విజయం నాటికే (1949) మనం ప్రతి రంగంలోనూ అనుభవాన్ని పోగుచేసుకొని వున్నాం. మితవాద, అతివాద పెడధోరణులను చాలాసార్లే చవిచూశాం. మనం త్వరితంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, మన విప్లవ కర్తవ్యాలను నెరవేర్చాం. కాగా, సోవియట్ యూనియన్ విషయంలో వారికది కొత్తగా మొదలెట్టిన వ్యవహారం. అక్టోబరు విప్లవం నాటికి వారికి ఏ సైన్యమూ లేదు, ప్రభుత్వమూ లేదు. ఇక పార్టీ సభ్యులా బహు కొద్దిమంది. 2. మనకు సోవియట్ యూనియన్ తోడ్పాటు, ఇతర ప్రజాస్వామిక దేశాల తోడ్పాటు అందుతోంది. 3. మన జనాభా పెద్దది, మన దేశం భౌగోళికంగా చాలా అనువైన స్థానంలో ఉంది. మన రైతాంగం శ్రద్ధాసక్తులతో పని చేస్తారు. కష్టాలను ఓర్చుకుంటారు. అయినప్పటికీ, సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోకపోతే వారికి భవిష్యత్తే ఉండదు. చీనీ రైతులు, బ్రిటిష, అమెరికన్ కార్మికులకంటే దిట్టలే. అందుచేత మనం సోషలిజంలోకి గొప్పవి, మెరుగైనవి అయిన ఫలితాలతో మరింత వేగిరంగా అడుగెట్టగలం. మనం సదా సోవియట్ యూనియన్‌తో మనల్ని పోల్చి చూసుకుంటూనే వుండకూడదు. మూడు పంచవర్ష ప్రణాళికల తర్వాత మనం రెండు కోట్ల 40 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయగల్గుతాం. అంటే, సోవియట్ యూనియన్‌ను మించిన వేగంతో సాధించనట్టే. నేడు రెండు పార్శ్వాలు (ఫ్లాంక్స్) ఉరుకులు పరుగులతో పురోగమిస్తుండగా ప్రధాన అంగం బహుశా వెనకబడినట్టుగా వుంది. ఈ రెండు పార్శ్వాలు మిడిసిపడే అవకాశం వుంది. అయితే, ఈ రెంటిలో పారిశ్రామిక రంగానికే, అందులోనూ ప్రత్యేకించి భారీ పరిశ్రమల రంగానికే మిడిసిపడడానికి అవకాశం అతి ఎక్కువగా ఉంది. అన్‌షాన్ ఇనుము ఉక్కు కర్మాగారం ఇప్పటికే మిడిసిపడుతుంది. ఒక దేశం పారిశ్రామికీకరింపబడకుండానే సోషలిస్టు దేశంగా అవడం సుసాధ్యమే (పరిశ్రమల రంగం పాలు 60 శాతానికి తక్కువగా వుంటే, ఆ దేశం అప్పటికింకా సువ్యవస్థితమైనట్టు కాదు). వేచివుండమని రైతుల్ని కోరగలమా? ఇది అసాధ్యం. రైతులు సోషలిజంలోకి ప్రవేశించడం పారిశ్రామికీకరణకు అడ్డంకి కాబోదు. వారు వేచివుండేట్లు చేయలేం. రెండు పార్శ్వాల్లోనూ సాగుతున్న పనిని శ్రద్ధగా పరీక్షించడం జరిగింది. పరిశ్రమల రంగ సమస్యను మనం తీవ్రంగా పరిశోధించాలి. ఒక పథకానికి అనుగుణంగా పెద్ద ఉద్యమాలను నిర్వహించమని దాన్ని కోరాలి. ఆర్థిక ద్రవ్య వ్యవహారాలను కూడా మనం పరిశోధించాలి. పార్టీ 8వ జాతీయ మహాసభ ఒక సమీక్షా పరిశోధనను చేపట్టాలి. ఇది కేంద్రానికి (కమిటీకి) సంబంధించిన సమస్య. యథాతథవాదాన్ని, మితవాద పెడధోరణిని, క్రియాశూన్యతను, మిడిసిపడేతత్వాన్ని మనంవ్యతిరేకించాలి. పురోగామి అనుభవాన్ని కనుగొనాలి, నాయకత్వ పద్ధతిని మార్చాలి, మరింత వేగంగా లభించే,

**(తరువాయి భాగం 11వ పేజీలో)**

వ్యాసం

# తక్కువ తీవ్రత కలిగిన ఘర్షణ (ఎల్.ఐ.సి)

## సైనిక చర్యలు-ప్రత్యేక బలగాల పాత్ర

ప్రతిఘాతుక విప్లవ సిద్ధాంతంగా ఉనికిలోకి వచ్చిన ఎల్.ఐ.సి (లో ఇన్‌టెన్‌సిటీ కాన్‌ఫ్లిక్ట్) వ్యూహం పై మనకి ఇప్పటికే ఒక స్పష్టత వచ్చింది. కౌంటర్ ఎత్తుగడల్ని కూడా రూపొందించుకోవడం జరిగింది. అయినా ఎల్.ఐ.సి యుద్ధ వ్యూహాన్ని ఎదుర్కోవడంలో ఇప్పటికీ మనం అనేక పరిమితుల్ని, బలహీనతల్ని ఎదుర్కొంటున్నాము. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా రెండు సైన్యాల మధ్య యుద్ధం జరుగుతుంది. ఒకటి ఎల్.ఐ.సి వ్యూహాన్ని అనుసరించి పని చేస్తున్న దోపిడీ వర్గాల సైన్యం, రెండు ఎమ్.ఎల్.ఎమ్ సిద్ధాంతాన్ని అనుసరించి పని చేస్తున్న విప్లవ సైన్యం. ఈ రెండు సైన్యాల మధ్య సుదీర్ఘకాలం పాటు యుద్ధం జరుగుతూనే ఉంది. ఎడతెగని ఈ ఘర్షణ ద్వారా ఎల్.ఐ.సి వ్యూహ కర్తలు ఎంతో అనుభవం పొందారు. వాళ్ళు గుర్తించింది ఏమనగా "ఉద్యామాలకీ, తిరుగుబాట్లకీ కారణాలు సైనిక పరమైనవి కావనీ, వాటిని సైన్యంతో పరిష్కరించలేమని"

ఎల్.ఐ.సిని "పునాది స్థాయిలో సంపూర్ణ యుద్ధంగా" చెప్పవచ్చు. అంటే సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక పరమైన అన్ని అంశాల్లో యుద్ధాన్ని నిర్వహించడం. ఈ అన్ని రంగాల్లో యుద్ధాన్ని నిర్వహించడానికి వాళ్ళు సైన్యం మీద ఆధారపడతారు. అందుకే ఎల్.ఐ.సి సైనికులు సంక్లిష్టమైన కర్తవ్యాలతో వైవిధ్య పూరితమైన పరిస్థితుల్లో పని చేయాల్సి ఉంటుంది. వాళ్ళు నిర్వహించే ప్రతి చర్యని రాజకీయ అంశాలు ఆజమాయిషీ చేస్తుంటాయి.

సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారుల, భూస్వాముల ఆధిపత్యాన్ని నియంత్రణని కొనసాగడానికి రూపొందించిన ఎల్.ఐ.సి వ్యూహాన్ని బద్దలు కొట్టడానికి మన దగ్గర మూడూ అద్భుత ఆయుధాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించడంలో నైపుణాన్ని సంపాదించడం అవసరం. విప్లవం బలమైన సమైఖ్య విప్లవ ప్రతిఘాతాన్ని ఉత్పన్నం చేస్తూ పురోగమిస్తుంది. కాబట్టి "ఒక్కసారి సాయుధ పోరాటం ప్రారంభించిన తరువాత ఒక్క నిమిషం కూడా ఆపకూడదని" కామ్రేడ్ మార్క్స్ హెచ్చరికను గుర్తుంచుకోవాలి. ఒక విప్లవ పార్టీలోని ప్రతి సభ్యుడు, ప్రతి గెరిల్లా యూనిట్ ఈ ప్రతిఘాతుక విప్లవ సిద్ధాంతం వైపు దృష్టి సారించాల్సిన అవసరం పెరిగింది. పార్టీకి చెందిన అన్నీ విభాగాలను సమన్వయ పరుస్తూ ఎల్.ఐ.సిని ఎదుర్కోవడంలో కేంద్రీకరణ పెంచాలి. అందుకోసం క్రింది స్థాయి నుండే ఎల్.ఐ.సి మీద అవగాహన కల్పించే విధంగా వివిధ పద్ధతుల్లో విద్యను గరుపుతూనే చర్చ-ప్రయోగం-అనుభవాలు పంచుకోవడం అనేది నిరంతరం జరిగేలా చూడాలి. ఈ ప్రక్రియ మనం సమర్థవంతమైన కౌంటర్ ఎల్.ఐ.సి ఎత్తుగడల్ని రూపొందించుకోవడానికి ఉపయోగపడుతుంది.

**ఎల్.ఐ.సిలో సైనిక చర్యలు :**

సామ్రాజ్యవాదానికి ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి అత్యంత ప్రమాదకరమైన శక్తి ఏమంటే ఎర్రసైన్యం, ఇది వాళ్ళు గుర్తించారు. ఎర్రసైన్యాన్ని ఎదుర్కోవడం కోసం వాళ్ళు ఎల్.ఐ.సిని రూపొందించుకున్నారు. ఎల్.ఐ.సి వాతావరణంలో యుద్ధాన్ని వేగంగా, సులభంగా గెలవడం కుదరదని ఎల్.ఐ.సి వ్యూహకర్తల అభిప్రాయం. అందుకోసం ఒక దీర్ఘకాల వ్యూహం అవసరం. అది ఎర్రసైన్యాన్ని పునాదులతో సహా నిర్మూలించాలి. ఇందుకు అనుగుణంగానే ఎల్.ఐ.సిలో సైనిక చర్యలు నిర్దేశించబడతాయి. సైన్యం సాధారణంగా అవలంబించే సాంప్రదాయక యుద్ధ ఎత్తుగడల స్థానంలో సాంప్రదాయేతర యుద్ధ ఎత్తుగడల్ని అవలంబిస్తాయి. విప్లవ గెరిల్లా బలగాలతో పోరాడటానికి ఎల్.ఐ.సి వ్యూహకర్తలు సైన్యానికి "గెరిల్లాతో గెరిల్లా వలె పోరాడు" అనే పిలుపునిచ్చారు. (అయితే కిరాయి మనస్తత్వం కలిగిన వాళ్ళు ఓటమిలో కూడా చెక్కుచెదరని దృఢ సంకల్పాన్ని, వర్గ కసిని కలిగి ఉండే విప్లవ యోధుల్లా పోరాడటం ఊహించడానికే సాధ్యపడని విషయం.)

ఎల్.ఐ.సిలో సైనిక చర్యల్ని సైనికేతర అంశాలు ఆజమాయిషీ చేస్తాయనేది ముందే చెప్పుకున్నాం. తక్కువ తీవ్రత కలిగిన ఘర్షణ (ఎల్.ఐ.సి)ల లక్ష్యం సైనిక పోరాటరూపంగా మిలటరీ సాధనాన్ని ఉపయోగించుకుంటారు. అయితే ఎల్.ఐ.సిలో సైనిక ఆపరేషన్ల యొక్క ప్రాధాన్యత ఎంత? అనే దాని మీద ఇప్పటికీ చర్చ కొనసాగుతున్నది. ఎందుకంటే 4 అవినాభావ సంబంధం కలిగిన అంశాల (సామాజిక, ఆర్థిక, రాజకీయ, సైనిక) సమన్వయంతో సాగే ఈ యుద్ధం, అమెరికా యుద్ధ వ్యూహకర్తల దృష్టిలో ఒక ప్రత్యేక సాయుధ ఘర్షణ కంటే ఎక్కువ తీవ్రత కలిగింది.

సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు అవలంబించే ఆర్థిక విధానాల వల్ల సామాన్య జనసామ్యపు జీవన స్థితిగతులు తీవ్ర సంక్షోభంలో పడుతుంటాయి. ఇది విప్లవోద్యమాన్ని మరింత బలపరుస్తూ సమాజ సమూల ప్రక్షాళన కొరకు ప్రజలకు యుద్ధాన్నే పరిష్కార మార్గంగా ఎంచుకునేలా చేస్తాయి. ఉద్యమ ప్రారంభ దశలలో ఎల్.ఐ.సి కొంత విజయం సాధించినప్పటికీ ప్రజా సైన్యపు బలం పెరుగుతున్న కొలది దోపిడీ వర్గాలు అనివార్యంగా సైనిక పరిష్కారానికే మొగ్గు చూపడం జరుగుతుంది. దీనితో పరిస్థితులు మరింత జటిలమౌతుంటాయి. అందుకనే ఎల్.ఐ.సి వాతావరణంలో సైనిక చర్యలకు చాలా ప్రాధాన్యత ఉంది. ఈ సైనిక చర్యల్ని అనేక రకాలుగా పేర్కొంటారు. (స్పెషల్ ఆపరేషన్ కౌంటర్ ఇన్‌సర్జన్సీ / ఇన్‌సర్జన్సీ ఆపరేషన్స్, సాంప్రదాయేతర యుద్ధం) అనేక రకాలుగా విభజిస్తారు. ఎల్.ఐ.సిలో సైన్యం చేపట్టే చర్యలు ముఖ్యంగా ఈ క్రింది విధంగా ఉంటుంటాయి.

**1. ప్రత్యర్థి వ్యూహాత్మక స్థానాల మీద అకస్మాత్తుగా దాడి చేయడం :-** ఇందులో ఉద్యమానికి కేంద్రంగా ఉండే ప్రాంతాల్లో అకస్మాత్తుగా భారీ స్థాయిలో బలగాలను మోహరించి ఒక పరిమిత లక్ష్యంతో దాడిని నిర్వహిస్తాయి. "ఆపరేషన్ అనకొండ", "ఆపరేషన్ హోకా" (మాడ్‌లో)లని ఉదాహరణలుగా చెప్పవచ్చు.

**2. పోరాట సంస్థల నాయకత్వాన్ని నిర్మూలించడం :-** తద్వారా ఉద్యమానికి నాయకత్వం లేకుండా చేయడం. వాళ్ళు దీని కోసం

కోవర్టు చర్యల మీద ఆధారపడతారు.

**3. ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించే చర్యలు :-** ప్రజలు ఉద్యమానికి సహకరించకుండా ఉండేందుకు సాధారణ ప్రజల్ని కాల్చి చంపడం, స్థానిక నాయకత్వాన్ని లేదా ఆర్గనైజర్లని పట్టుకుని బహిరంగంగా చిత్రహింసలు పెట్టి చంపడం లాంటివి చేస్తారు. సర్కిన్‌గూడ, తాడిమెట్లలను ఉదాహరణగా చెప్పవచ్చు.

**4. బలప్రదర్శన :-** భారీ ఎత్తున బలగాలని మోహరించి అనేక విన్యాసాలు నిర్వహిస్తూ కొత్త కొత్త క్యాంపులని ఏర్పరుస్తూ తమ బలాన్ని ప్రదర్శించడం ద్వారా తమ సంసిద్ధతను తెలియజేస్తారు.

**5. కోవర్టు చర్యలు :-** ఉద్యమంలో ఉన్న వాళ్ళని మార్చుకోవడం ద్వారా గానీ, బయటనుండి చొప్పించడం ద్వారా (ఇన్‌ఫిల్‌ట్రేట్) గానీ, పోరాటకారులని నిర్మూలిస్తారు. అమెరికా నిర్వహించే కోవర్టు చర్యలన్నీ సి.ఐ.ఎ కనుసన్నల్లోనే జరుగుతుంటాయి. "ఆపరేషన్ మంగూస్'' (మాంగూస్) క్యూబాలో కాస్ట్రో ప్రభుత్వాన్ని కూలదోయడానికి జరిగిన ప్రధాన కోవర్టు ఆపరేషన్. ఎ.పిలో మనకు అనేక అనుభవాలు ఉన్నాయి.

**6. ముందస్తు దాడి నిర్వహించడం :-** మన పథకాలనీ, కార్యక్రమాలనీ ముందుగానే పసిగట్టడం ద్వారా మన కంటే ముందే దాడిని ప్రారంభిస్తారు.

**7. తిరిగి ప్రవేశించకుండా ఉండే చర్యలు :-** ఒక ప్రాంతం నుండి మనల్ని తిరోగమింప జేసి మళ్ళీ అక్కడికి ప్రవేశించకుండా నిరంతరం బలగాలని అప్రమత్తం చేయడం, మన శక్తులు వెళ్ళిన వెంటనే వాటిని నిర్మూలించే చర్యలు చేపడతారు.

**8. సైకాలాజికల్ ఆపరేషన్స్ :-** దీనికోసం మీడియాని విస్తృతంగా ఉపయోగిస్తారు. దీని లక్ష్యం పోరాటకారుల్లో, ప్రజల్లో మన సిద్ధాంతాల పట్ల అవిశ్వాసం ఏర్పడేలా చేయడం, పోరాడకుండా నిరుత్సాహపరచడం మానసిక సంసిద్ధతను నిర్వీర్యం చేస్తారు. ఇలాంటి చర్యల్ని నిర్వహించడానికి సాంప్రదాయక బలగాల స్థానంలో ప్రత్యేకమైన నిర్మాణాల అవసరం ఉంటుంది. అందుకే ఎల్.ఐ.సిలోని సైనిక అంశంలో నిర్మాణపరమైన ఎత్తుగడలు కీలకమైనవి.త్రివిధ బలగాల నిర్మాణం కోసం కేంద్రీకృత కమాండ్, కంట్రోల్ (సి2) ముఖ్యమైనవి.

లక్షలాది సైనిక, అర్ధసైనిక బలగాలు ఉన్నప్పటికీ ఎల్.ఐ.సి వాతావరణంలో పోరాడటానికి స్పెషల్ ఆపరేషన్ బలగాలని (ఎస్.ఒ.ఎఫ్) నిర్మిస్తున్నారు. 1987 నుండి అమెరికా ప్రతి యుద్ధరంగ కమాండ్‌లలో విడిగా స్పెషల్ ఆపరేషన్ కమాండ్స్‌ని (యు.ఎస్.ఎస్.ఒ.సి) ఏర్పాటు చేయడం ప్రారంభించింది. రాను రాను ఈ ప్రత్యేక బలగాలు పూర్తిగా ఇంటలిజెన్స్ సంస్థల ఆజమాయిషీలోకి వెళ్ళాయి. రాజ్యం యొక్క భద్రత విషయంలో ఇంటలిజెన్స్ పాత్ర ఎంతో పురాతనమైనప్పటికీ ఎల్.ఐ.సి వాతావరణంలో జరిగే యుద్ధాల్లో వీటిదే నిర్ణయాత్మక పాత్ర అయింది. అందుకే ఈ సంస్థలకి అడ్డూ అదుపు లేకుండా విచ్చలవిడి అధికారాలు కట్టబెడుతూ, భారీ బడ్జెట్‌లను కేటాయిస్తున్నారు. వీటిలో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన గూడాచార సంస్థగా అమెరికన్ సి.ఐ.ఎ(స్పెషల్ ఇంటలిజెన్సీ ఏజెన్సీ) ఉందనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అదే విధంగా విప్లవోద్యమాలని దెబ్బతీసే లక్ష్యంతోనే కొన్ని ప్రత్యేక సంస్థలు ఉంటాయి. (కౌంటర్ ఇన్సర్‌జెన్సీ ఆర్గనైజేషన్) వీటి నిర్దేశంలోనే ఎస్.ఒ.ఎఫ్‌లు ఆపరేషన్స్‌ని చేపడతాయి. ఇంటెలిజెన్సీతో పాటు ఎల్.ఐ.సిలో సైనిక చర్చల్ని మరికొన్ని విషయాలు ప్రభావితం చేస్తుంటాయి.

ఎ. మిలటరీ / పారామిలటరీ మరియు పోలీసు శాఖ కలిసి సమన్వయంతో పని చేయడం.

బి. తగినన్ని మొబైల్ రిజర్వు బలగాలు ఉండటం :- వీటివల్ల ప్రత్యేక చర్యల్లో పాల్గొనే బలగాలు అలసిపోకుండా ఉంటాయి.

సి. సముచితమైన శిక్షణ :- వాస్తవ పరిస్థితుల మీద ఆధారపడి తర్ఫీదు నివ్వడం.

డి. కమ్యూనికేషన్స్, లాజిస్టిక్ సప్లైలు :- బలగాలని సమన్వయించు కోవడానికి ఇవి ముఖ్యమైనవి.

ఇ. ప్రజలలో ప్రభుత్వ అనుకూల నిర్మాణాలు :- ఏ యుద్ధానికైనా కీలకమైన అంశం ప్రజా సంబంధాలు. ఇవి పటిష్టంగా ఉంటే అనేక పరిస్థితుల్ని అధిగమించవచ్చు.

ఎఫ్. బాధ్యత వహించే ప్రాంతాలు అంటే అడ్మినిస్ట్రేషన్ లాంటిది, ఇక్కడి నుండే ఆపరేషన్స్‌కి పథకాలు రూపొందించి బలగాలని నిర్దేశిస్తుంటారు.

జి. అత్యాధునిక ఆయుధ వ్యవస్థ :- గెరిల్లా యుద్ధానికి అనుగుణంగా ఉపయోగించగలిగే తేలికపాటి ఆయుధాలు కలిగి వుండటం.

హెచ్. ఆత్మరక్షణ :- బలగాల భద్రతని దృష్టిలో పెట్టుకొని కూడా కొన్నిసార్లు సైనిక ఆపరేషన్స్ ప్రభావితమవుతుంటాయి.

ఐ. వివరమైన వెసులుబాటుతో కూడిన పథకం :- ఆపరేషన్‌లో పాల్గొనే బలగాలన్నింటికీ సులభంగా అర్థమయ్యే విధంగా పరిస్థితులకి తగినట్లు మార్చుకోగలిగేట్టుగా పథకం రూపొందించడం.

జె. యూనిట్‌లో మొత్తం సిబ్బందికి ఆపరేషన్ ప్రాముఖ్యత గురించి, ఇందులో ఉన్న సున్నితమైన విషయం గురించి తెలిసి వుండటం. ఏ ఒక్కరు చిన్న తప్పు చేసినా ఆ చర్య ప్రభావితం అవుతుంది.

**ప్రత్యేక బలగాల పాత్ర (స్పెషల్ ఆపరేషన్ ఫోర్సు) ఎస్.ఒ.ఎఫ్ :**

ప్రతీ సైన్యం వెనకతట్టులో (బిహైండ్ ది ఎనిమి లైన్స్) చర్యల్ని నిర్వహించడానికి ప్రత్యేక కమాండోలని కలిగి ఉండాలి. కోట్ల రూపాయల ఖర్చుతో కూడిన వేల వైమానిక దాడుల కంటే ఒక చిన్న కమాండో యూనిట్ నిర్వహించే చర్య అత్యంత ప్రభావవంతంగా (ఎఫెక్టివ్) ఖచ్చితంగా (అక్యూరేట్) ఉంటుంది.

లక్షలాది సైనిక, అర్ధసైనిక బలగాలు ఉన్నప్పటికీ కమాండో బలగాల అవసరం ఎందుకొచ్చింది? అవన్నీ సాంప్రదాయక బలగాలు, వాటి కర్తవ్యాలు, లక్ష్యాలు వేరు. వీటి ద్వారా ఒక ప్రత్యేకమైన రాజకీయ స్వభావం, లక్ష్యం కలిగి సాయుధులైన విప్లవకారులని ఎదుర్కొనుటకు అవి అనేక పరిమితులకు గురౌతుంటాయి. సాంప్రదాయ యుద్ధ చట్రంలో తయారైన సాధారణ బలగాలు గెరిల్లా చర్యల్లో గణనీయంగానే దెబ్బతిన్నాయి. ఇలాంటి సమస్యలకి పరిష్కారంగా కమాండో బలగాలు ఉనికిలోకి వచ్చాయి. కేవలం గెరిల్లాలతో పోరాడటమే వీటి లక్ష్యంగా ఉంటుంది. అత్యంత కఠినమైన, సంక్లిష్టమైన గెరిల్లా యుద్ధ పద్ధతిని, గెరిల్లాలతో పోరాడటానికి అవలంబిస్తారు.

ప్రాథమికంగా గెరిల్లా స్వభావం కలిగి ఉండే ఈ బలగాలు అవసరమైతే సాంప్రదాయక యుద్ధాన్ని కూడా చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. యుద్ధరంగంలో ఎదురయ్యే సమస్యల్ని, ప్రమాదాల్ని ఎదుర్కొనేందుకు మొదటి నుండి మానసికంగా, శారీరకంగా వీటిని సుశిక్షితం చేస్తారు. అలా తయారైన వాళ్ళతోనే

వీటి నిర్మాణం చేస్తారు. ఇవి దాడి పూర్వక పద్ధతుల్ని అవలంబించినప్పటికీ ఆత్మరక్షణకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి. ఒక లక్ష్యం గురించి ఖచ్చితమైన సమాచారం ఉన్నప్పటికీ భద్రతకీ గ్యారంటీ లేనప్పుడు మరికొన్ని రోజులు దాడిని వాయిదా వేసుకుంటాయి. తద్వారా తక్కువ నష్టాలతో ఎక్కువ విజయాలు పొందడానికి ప్రయత్నిస్తాయి.

వీటి శక్తియుక్తులన్నింటినీ గెరిల్లా వ్యతిరేక చర్యలకే వినియోగించడం ద్వారా రాజకీయ, ఆర్థిక, సామాజిక, పరిస్థితులు ఎలాంటి స్థితిలో ఉన్నా అవసరమైన చోట (హాట్ స్పాట్స్) వీటిని మోహరించగలిగే సౌలభ్యత ఉంటుంది. గెరిల్లా యుద్ధ తంత్రంలో కమాండో యుద్ధ బలగాలని విజయవంతంగా ఉపయోగించడం అత్యంత లాభదాయకంగా ఉండటంతో ప్రతి దేశం, ప్రతి సైన్యం కమాండో బలగాల నిర్మాణాలకి ప్రాధాన్యతనిస్తున్నాయి. 1970-80ల నుండి ఈ కమాండోస్ అనేవి ప్రాచుర్యం పొందినప్పటికీ గ్రీకు పురాణాల్లోని కొన్ని కథలు వింటే అప్పటి యుద్ధ వ్యూహకర్తలు కూడా వీటిని ఉపయోగించినట్లు అర్థమవుతుంది. (ఒక చిన్న రాజ్యం తన మీద దాడికి వచ్చిన బలమైన శత్రువుతో యుద్ధానికి సిద్ధపడినప్పుడు అక్కడ అధికార వర్గం లొంగిపోతే మంచిదని రాజుకు సలహా ఇస్తుంది. కాని రాజు తన సైన్యంలో కొద్దిమందిని ఎంచుకుని గెరిల్లా యుద్ధ పద్ధతుల్ని అవలంభించి కొన్ని వేల శత్రు బలగాలను మట్టి కరిపిస్తాడు.)

**ప్రాచుర్యంలో ఉన్న కొన్ని కమాండో నిర్మాణాలు :**

అంతర్జాతీయంగా శక్తివంతమైన సైన్యంగా ఉన్న అమెరికా సైన్యంలో "గ్రీన్ బెరెట్స్" "ఆర్మీ రేంజర్స్" అనేవి ఉన్నాయి. నావికా దళాల్లో "సీల్స్" (SEALS) ఉన్నాయి. వీటికి ఆకాశం, భూమి, నీటి మీద పోరాడగలిగే సామర్థ్యం ఉన్నది. ఆ మధ్య కాలంలో ఆల్‌ఖైదా చీఫ్ బిన్‌లాడెన్‌ని హత్య చేయడానికి వీటిని ఉపయోగించారు. దాంతో ఎక్కువ పాపులారిటీ వచ్చింది.

- CIA నియంత్రణలో ఉన్న "డెల్టాఫోర్స్"
- పాకిస్తాన్‌లో పాకిస్తానీ గెరిల్లాలు (Commandos)
- భారత్‌లో కేంద్రస్థాయిలో ఎన్.ఎస్.జి (నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్)ని ముంబయి దాడుల సందర్భంగా ఉపయోగించారు.
- ఏటిఎస్ (ATS) -యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్స్
- ఆక్టోపస్ (OCTOPUS) -వీటిని కూడా ఉగ్రవాద వ్యతిరేక చర్యలలో ఉపయోగిస్తున్నారు.
- కోబ్రా (cobra) -కంబాట్ బెటాలియన్ ఫర్ రెజల్యూట్ యాక్షన్. (నక్సల్స్ వ్యతిరేక చర్యల కోసం నిర్మించారు. 2009 ప్రారంభంలోనే పి.ఎల్.జి.ఎ బలగాల చేతిలో దెబ్బతిన్నవి).

ఇక రాష్ట్రాల వారిగా చూస్తే ప్రతి రాష్ట్రం ఏదో ఒక పేరుతో ఈ కమాండో బలగాలను కలిగి ఉన్నాయి.

- ఆంధ్రప్రదేశ్ - గ్రేహౌండ్స్. (మన ఉద్యమాన్ని దెబ్బ తీయడంలో ఈ బలగాలను పాలక వర్గాలు ఒక నమూనాగా చూపిస్తున్నాయి.)
- మహారాష్ట్ర - సి..60 కమాండోస్
- తమిళనాడు - ఎస్.టి.ఎఫ్ (స్పెషల్ టాస్క్ ఫోర్స్)
- బెంగాల్ - ఫోర్స్ 1
- మధ్యప్రదేశ్ - హాక్ ఫోర్స్
- పంజాబ్ - పంజాబ్ కమాండోస్
- చత్తీస్‌గఢ్ - కోయ కమాండోస్ (ప్రస్తుతం యాక్టివ్‌గా లేవు.)
- ఒడిశా - ఎస్.ఒ.జి (స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్) నయాగఢ్ ఆపరేషన్ సందర్భంగా మన బలగాలు వీటిని 3 కి.మీ.ల మేర తరిమాయి.
- భారత సైన్యం - రాష్ట్రీయ రైఫిల్స్‌ని ఏర్పాటు చేసారు. వీటిని కమాండోస్‌గా పేర్కొనక పోయినా బాధ్యతలు మాత్రం అవే ఉంటాయి.

**ఎంపిక :-** రాష్ట్రాలలో నిర్మిస్తున్న ప్రత్యేక బలగాలలోకి అక్కడి స్థానిక పోలీసు బలగాల నుండి, కేంద్రస్థాయిలోనైతే అర్థసైనిక బలగాలలో నుండి చురుకైన వాళ్ళను ఎంపిక చేస్తున్నారు. సాధారణంగా 20 నుండి 35 ఏళ్ళలోపు వాళ్ళనే ఇందులో ఉంచుతున్నారు. అంతే కాకుండా మనం చంపిన వాళ్ళ కుటుంబాల నుండి, విప్లవ ద్రోహులుగా మారిన వాళ్ళని, లంపెన్స్‌ని, డబ్బు కోసం ఏమైనా చేసే వాళ్ళనీ, క్రూర ప్రవృత్తి కలిగిన వాళ్ళనీ, కమ్యూనిస్టు వ్యతిరేక భావజాలం కలిగిన వాళ్ళని ఇందులో రిక్రూట్ చేసుకుంటారు. విపరీతంగా డబ్బులు, మద్యం ఇచ్చి ఏ నీతి, విలువలు లేకుండా వీటిని తయారు చేస్తున్నారు. ఎంత మందిని చంపితే అంత డబ్బు ప్రమోషన్స్ వస్తాయనడంతో అనేక క్రూర చర్యలకి పాల్పడుతుంటారు.

**తర్ఫీదు :-** సాధారణ ట్రైనింగ్ పొంది ఉన్న బలగాలకి ప్రత్యేకంగా జంగల్ వార్‌ఫేర్‌లో శిక్షణనిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక ట్రైనింగ్ స్కూల్స్‌ని నిర్మిస్తున్నారు. చత్తీస్‌ఘడ్‌లోని కాంకేర్ జిల్లాలో కౌంటర్ గెరిల్లా అండ్ జంగల్ వార్‌ఫేర్ ట్రైనింగ్ స్కూల్ వుంది. ఈ సెంటర్స్‌లో అటవీ ప్రాంతాలలో గెరిల్లాలతో పోరాడేటప్పుడు ఎదురయ్యే సమస్యల్ని అధిగమించడానికి కృత్రిమంగా ఏర్పాటు చేసిన రేంజస్‌లలో శిక్షణ ఇస్తారు. గెరిల్లా యుద్ధతంత్రపు సూత్రాలనీ, నియమాలని క్లాసుల రూపంలో అనుభవజ్ఞులైన సైనిక నిపుణులు బోధిస్తారు. ఒక మాటలో చెప్పాలంటే "ట్రైన్ హార్డ్-ఫైట్ ఈజీ" (కఠిన తర్ఫీదు-సులభమైన పోరాటం) అనేది వాళ్ళ నినాదం.

ఉదాహరణకి ఎన్.ఎస్.జి 90 రోజుల శిక్షణా కాలంలో ఎంపికైన వాళ్ళలో 30% మంది వెనక్కి వెలుతుంటారు.

**బలాలు :**

1. స్వయం సంపూర్ణ బలగాలు
2. నిర్ణయాత్మకంగా ఉండటం
3. సంయుక్త ఆయుధాలు
4. కేంద్రీకృత-వికేంద్రీకృత కమాండ్ కంట్రోల్
5. వేగంగా కార్యసాధకంగా లక్ష్యాన్ని పూర్తి చేయడం

అయితే ఇప్పటి వరకు మనం నష్టపోయిన ఏ ఘటనని చూసినా వాడి బలం కన్నా మన బలహీనతల వల్లనే అనేది స్పష్టంగా కనబడుతుంది. ఎందుకంటే గెరిల్లా యుద్ధ సూత్రమే అది కాబట్టి. (బలహీనమైన స్థానం మీద బలమైన దాడి చేయడం)

ప్రతి దాంట్లో బలంతో పాటు బలహీనతలు కూడా ఉంటాయనేది అందరికీ తెలిసిందే. ఎక్కువ సార్లు ఈ రెండింటిలో ఒకదాన్నే మనం చూస్తుంటాం. మనది పైచేయిగా ఉన్న దగ్గర బలాన్నే చూసి ఎక్కువ అంచనా వేస్తాం. మీడియా కూడా అనేక అతిశయోక్తులతో వీటి గురించి ఎక్కువగా చూపెట్టి మానసిక యుద్ధతంత్రంలో తన వంతు బాధ్యతని కూడా నిర్వర్తిస్తుంది.

ముంబై దాడుల సందర్భంగా 10 మంది మిలిటెంట్లని క్లియర్ చేయడానికి ఎన్.ఎస్.జి కమాండోలకే 48 గంటలు పట్టిందంటే, అది కూడా అనేక నష్టాలతో దాని బలమెంత?

కమాండోలు కూడా సాధారణ మనుషులే అనేది గుర్తుంచుకోవాలి. డి.కె, బి.జె, ఎ.ఒ.బి, ఎ.పిలలో జరిగిన అనేక దాడుల్లో, ఎన్‌కౌంటర్‌లలో ఈ కమాండో బలగాలనే తరిమి కొట్టడం జరిగింది. వీటికి కూడా రాజకీయంగా, సైనికంగా అనేక బలహీనతలు ఉన్నాయి.

1. వీటి క్రూరమైన చర్యల వల్ల సహజంగానే ప్రజలలో వీటిపట్ల తీవ్రమైన అసహ్యత, వ్యతిరేకత ఉంటుంది. ఒడిశాలో చిన్న పిల్లాడు కూడా "కోబ్రా కుక్కుర్" అని పోలీసుల పట్ల తమ వ్యతిరేకతని వ్యక్తం చేస్తుంటారు.

2. సాధారణ పోలీసులకీ, కమాండో బలగాలకి మధ్య వైరుధ్యాలు.

3. చిన్న దెబ్బ కూడా తగలకూడదనే దాంతో దృఢంగా కొట్లాడలేకపోవడం.

4. ఫీల్డ్‌లోకి వచ్చినప్పుడు చిన్నచిన్న ముక్కలుగా విడిపోయి తిరగడం.

5. మన నుండి తీవ్రమైన ప్రతిఘటన ఉన్న దగ్గర కాళ్ళకి బుద్ధి చెప్పడం.

**ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో ఎల్.ఐ.సి సవాళ్ళు :**

ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమాన్ని అణచివేయడంలో అక్కడి పాలక వర్గాలు ఎల్.ఐ.సిని ఉపయోగించడంలో ఎంతో అనుభవాన్ని పొందాయి. ఆంధ్రాలో మనం కొద్ది ప్రాంతానికే పరిమితం కావడంతో ప్రస్తుతం అక్కడ శత్రువు కేంద్రీకరణ బాగా పెరిగింది. ఆంధ్రాను మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేయడం, వాళ్ళు లక్ష్యంగా పెట్టుకున్నారు. 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడి ప్రారంభమైనప్పటి నుండి ఒడిశా భూభాగంలో కూడా బహుముఖ దాడి తీవ్రత పెరిగింది. ఎ.పిలో కౌంటర్ ఇన్‌సర్జన్సీని ప్రయోగించడం ద్వారా వచ్చిన అనుభవాలను దేశవ్యాప్త విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు ఉపయోగించుకుంటున్నారు.

**సైనిక పరమైన అంశాలుగా చూస్తే :**

- ఆంధ్ర, ఒడిశా బలగాలు సంయుక్తంగా దాడులు నిర్వహించడం.
- పక్కా సమాచారం ఉంటే ఆంధ్రా గ్రేహౌండ్స్, లేదా ఎస్.ఒ.జి వాళ్ళని ఉపయోగించడం.
- ఏరియా డామినేషన్స్ నిర్వహించి గెరిల్లాల మీద తీవ్రమైన వత్తిడి తీసుకురావడం, ప్రజా సంబంధాలు తెగగొట్టడం చేస్తున్నాడు.
- స్థానికంగా ఎదుగుతున్న మిలీషియా, సంఘ నాయకత్వాన్ని నిర్మూలించే చర్యలు.
- ఇంటలిజెన్స్ ఆధారిత దాడుల మీద పెరిగిన కేంద్రీకరణ (స్ట్రైక్ ఆపరేషన్స్)
- క్రింది నుండే ఇంటలిజెన్స్ వ్యవస్థని పటిష్టవంతం చేసుకోవడం, ఫలానా దగ్గర శత్రువు ఏజెంట్ లేడని చెప్పడం ప్రస్తుత పరిస్థితులలో చాలా కష్టం.
- కార్పెట్ సెక్యూరిటీని విస్తృత పరచడం. ఒకమాటలో చెప్పాలంటే క్లియర్-హోల్డ్-కన్సాలిడేట్ అనే సైనిక వ్యూహాన్ని అవలంబిస్తున్నాడు.

వీటితో పాటు సంక్షేమ పథకాలను గుప్పిస్తున్నారు. సాంస్కృతిక, మానసిక దాడి తీవ్రంగా ఉంది. మతం అనేది మనం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాలు. సామ్రాజ్యవాద విష సంస్కృతి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అన్ని జోన్‌లలో ఎదుర్కొంటున్న సమస్యనే కాబట్టి. మానసిక దాడిని ఎదుర్కోవడంలో కూడా మన వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కె.పిలో ఒక క్యాంపెయిన్ మాదిరిగానే సరెండర్స్ చేపట్టడంలో శత్రువు భారీ రాజకీయ సఫలతని పొందాడు. ఈస్ట్, విశాఖలలో మన మీద ప్రచార దాడి నిర్వహించడంలో శత్రువు ఆరితేరాడు.

మరోపక్క ఉద్యమ ప్రాంతాల్లోని (కె.పి) పిల్లలని తీసుకెళ్ళి చదివించే పేరుతో చిన్నతనం నుండే విప్లవ వ్యతిరేక భావాలను నూరిపోస్తూ ఒక తరాన్ని విప్లవానికి దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

మీడియా కూడా తనదైన పాత్రని నిర్వహిస్తూ మానసిక యుద్ధానికి దోహదం చేస్తున్నది. ఒడిశా మీడియా మాత్రం రాజ్యం యొక్క పెంపుడు కుక్కలాగే వ్యవహరిస్తున్నది. మన గురించి వ్యతిరేక కథనాలు సృష్టించడం, పోలీసులు చెప్పింది రాయడం, మనం ఇచ్చే ప్రచురణలని ప్రకటించక పోవడమో, లేక ఎడిట్ చేసి ప్రచురించడమో చేస్తుంటారు.

భారత పాలక వర్గాలు విప్లవోద్యమాన్ని సంపూర్ణంగా నిర్మూలించేందుకు అమలు జరుపుతున్న ఎల్.ఐ.సి వ్యూహానికి సరైన సమాధానం దీర్ఘకాలిక ప్రజా యుద్ధమే. ఈ వ్యూహాన్ని మారుతున్న పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయింపు చేయడం ద్వారానే మనం ఓటములను అధిగమించి విజయాలను సాధించగలుగుతాము. శత్రువు ఎన్ని సంక్షేమ పథకాలను గుప్పించినప్పటికీ, భారత దేశంలోని అత్యధిక మెజారిటీ రైతాంగం ఎదుర్కొంటున్న భూమి సమస్యను పరిష్కరించలేదు, పరిష్కరించదు కూడా. భూమి భూస్వాముల చేతుల్లో కేంద్రీకరించబడి ఉండటం ఈ వ్యవస్థ తాలూకు స్వభావం. అంటే భారతదేశ పీడిత రైతాంగ విముక్తికి సాయుధ వ్యవసాయక విప్లవం ఇప్పటికీ జరూరైనదిగానే ఉంది. అందుకే మనం శత్రుదాడిని తిప్పికొట్టేందుకు సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని సృజనాత్మకంగా అమలు జరపాలి. అంతే కాకుండా వ్యవసాయక విప్లవ పోరాటంలో పాల్గొనే అశేష పీడిత రైతాంగాన్ని సాయుధం చేయాలి. పార్టీలోకి, పి.ఎల్.జి.ఎలోకి భర్తీ చేసుకోవాలి. మరోవైపు ప్రజలపై ఆధారపడి గెరిల్లా యుద్ధాన్ని నిర్వహించాలి. గెరిల్లా యుద్ధంలో సాహసాన్ని, సరైన ఎత్తుగడలను అమలు జరపగలిగితే తప్పనిసరిగా మనం విజయాలు సాధించగలుగుతాము. శత్రువు బలహీనతలను కనిపెట్టి సాహసంగా దాడి చేసిన దగ్గర మనం విజయాలు సాధించాము. బలిమెల సంఘటన దీనికి చక్కటి ఉదాహరణ. ఈ దాడి ఫలితంగా శత్రువు నీటిపై చొరవను కోల్పోయాడు. ప్రజల ఆత్మస్థైర్యం ఇనుమడించి, వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కదిలి కాఫీ ప్లాంటేషన్ పోరాటం చేపట్టారు. ఈ క్రమం మనకు ఒక విషయాన్ని తెలియజేస్తున్నది. అదేమిటంటే గెరిల్లా యుద్ధంలో మన పురోగమనం ప్రజలను ప్రజాయుద్ధంలోకి సమీకరించి సాయుధుల్ని చేస్తుందనీ, ప్రజలు సాయుధులు కావడం ద్వారా తిరిగి గెరిల్లా యుద్ధం పురోగమిస్తుందని. కనుక శత్రువు ప్రత్యేక కమాండో బలగాలను ఏర్పాటు చేసుకొన్నప్పటికీ మనం ప్రజలపై ఆధారపడి గెరిల్లా యుద్ధం చేపట్టినప్పుడు, వాళ్ళ ఆయుధాలు ప్రత్యేక తర్ఫీదు దేనికి కొరగాకుండా పోతాయి. వాళ్ళ దుర్బలత్వం బయట పడుతుంది. ఈ మధ్య కాలంలో డి.కె, ఝార్ఖండ్, ఎ.ఒ.బిలలో మనం నిర్వహించే సైనిక దాడులన్నీ కేంద్ర బలగాలతో పాటు కమాండో బలగాల పైనే. మన పి.ఎల్.జి.ఎ చేతిలో నిర్మూలించబడింది కూడా వీరే.

**(తరువాయి భాగం 5వ పేజీలో)**

కరపత్రం

# 16వ బూటకపు పార్లమెంటరీ ఎన్నికలతో పాటు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా విధానసభ ఎన్నికలను, ఆంధ్రప్రదేశ్‌లోని మండల ప్రజా పరిషత్, జిల్లాప్రజా పరిషత్, నగరపాలక, పురపాలక ఎన్నికలను సైతం బహిష్కరించండి ! దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా భారత దేశాన్ని విముక్తి చేయండి !!

రానున్న ఏప్రిల్, మే నెలల్లో దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల విధానసభలకు కూడా ఎన్నికలు జరగబోతున్నాయి. వీటితో పాటు అదనంగా సీమాంధ్ర, తెలంగాణలలో మండల, జిల్లా పరిషత్తులకు, నగర పాలక, పురపాలక సంస్థలకు కూడా ఎన్నికలు జరగబోతున్నాయి. వందల కోట్ల రూపాయల భారీ ఖర్చుతో ఈ 'ఎన్నికల జాతర' ను దోపిడి పాలకులు దేశ ప్రజలపై మరోసారి రుద్దబోతున్నారు. ఈ సందర్భంగా దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య దోపిడి పాలక వర్గాల ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బి.జె.పిలు కేంద్రంలో అధికారకోసం తీవ్రంగా పోటిపడుతూ ఉండగా మరోవైపు రివిజనిస్టు పార్టీలైన సి.పి.ఐ, సి.పి.ఎమ్‌లతో పాటు జె.డి.యు, ఎస్.పి, ఎ.ఐ.డి.ఎమ్.కె, బి.జె.డి, అస్సాం గణపరిషత్ తదితర 11 ఎన్నికల పార్టీలు పొత్తులు కుదుర్చుకుని మూడో ఫ్రంట్ పేరుతో బరిలోకి దిగుతున్నాయి. ప్రజలను వంచించడానికి పడరాని పాట్లు పడుతున్నాయి. సామ్రాజ్యవాదులు నిర్దేశిస్తున్న విధానాలను తూచతప్పకుండా అమలు చేయడంలో, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలకు సేవచేయడంలో తలమునకలవుతున్న ఈ పాలకపార్టీలు పరస్పర నిందారోపణలతో తమ అసలు స్వభావాన్ని బాహటంగా బహిర్గతపరచుకుంటున్నాయి. ఈ పరస్పర ఖండన మండనలలో కాంగ్రెస్, బి.జె.పి పార్టీలు ముందుపీఠిన నిలిచాయి. **ఇక కొత్తగా కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మి పార్టీ ప్రజలను మోసం చేసేందుకు 'సగటు మానవుడి' పార్టీగా ఎన్నికల బరిలోకి దిగింది. ఈ పార్టీ గ్లోబలైజేషన్ యుగంలో పుట్టి, పెరుగుతున్న నయా సంపన్నవర్గాల పార్టీ. ఈ పార్టీ వెనుక ఎన్.జి.ఒ అధిపతులు, కార్పోరేట్ వ్యాపార వర్గాలు, మేనేజర్లు, బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగ నిపుణులు, సమాచార రంగ నిపుణులు వంటి నయా సంపన్నవర్గాల కూటమి ఉంది.** వీరు ప్రస్తుత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పై ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తినీ, అగ్రహాన్ని పక్కదారి పట్టించి తాము ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చేందుకు కొత్త ముఖాలతో కొత్త నినాదాలు (జనలోక్ పాల్), కొత్త పద్ధతులు (సోషల్ మీడియా) చేపట్టారు. ఈ పథకంలో భాగంగానే అవినీతి, అధిక ధరలకు వ్యతిరేకంగా గొంతెత్తి ఢిల్లీ నగర అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. కాని అది మూణ్ణాళ్ళ ముచ్చటగా మిగిలింది. ఇప్పుడు పార్లమెంటులో తిష్టవేసేందుకు పావులు కదుపుతున్నారు. వీరు పైకి ఏమి మాట్లాడుతున్నప్పటికీ ప్రస్తుత రుగ్మతలకు కారణమైన అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థకు గట్టి మద్దతుదారులుగానే ఉన్నారు. సామ్రాజ్యవాద గ్లోబలీకరణలో పుట్టి పెరిగిన వీరు తమ యజమానులైన సామ్రాజ్యవాదులకు సేవ చేయటంలో ఏమాత్రం తీసిపోరు. వీరిలో ఉన్న ఈ అసలు స్వభావాన్ని గుర్తిస్తూ, వీరు చేస్తున్న అవినీతి నిర్మూలన, ధరల నియంత్రణ వంటి వాగ్దానాలు వట్టి బూటకమనీ, ఆ వాగ్ధానాలు ప్రస్తుత దోపిడి వ్యవస్థలో పరిష్కారం కావని గుర్తించాలి. ఈ మధ్య కేజ్రివాల్ ఒక ఇంటర్వ్యూలో తాము కాపిటలిజానికి వ్యతిరేకం కాదనీ, క్రోని కాపిటలిజానికి (అశ్రిత పెట్టుబడిదారి విధానం) మాత్రమే వ్యతిరేకమని మాట్లాడటం ద్వారా తమ అసలు స్వభావాన్ని బహిర్గతం చేసుకొన్నాడు. ఎందుకంటే ఆయన వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న అవినీతి, అధికధరలు, ఆశ్రిత సంబంధాలు వంటి రుగ్మతలన్ని పెట్టుబడికి పుట్టిన పిలకలే. కనుక వాళ్ళ వాదనలో ఏమాత్రం పసలేదని తేలిపోయింది. ఇక వామపక్షాల విషయానికి వస్తే ఇవి ప్రారంభం నుండి ఈ దోపిడి వ్యవస్థను కాపాడేందుకు పంచమాంగ దళం లాగా వ్యవహరిస్తున్నాయి. ఈ రివిజనిస్టులు ఏ స్థాయికి దిగజారారంటే ప్రజలను దోపిడి వర్గాల కబంధ హస్తాలలో ఇరికించడమే కాకుండా, ఈ బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసాన్ని కల్పించేందుకు తీవ్రస్థాయిలో వంచనకు పాల్పడుతున్నారు. చివరికి ఈ సోషల్ ఫాసిస్టులు ఎక్కడైనా అధికారంలోకి వస్తే ప్రజల హక్కులను కాలరాచివేస్తూ తీవ్రమైన దమనకాండను అమలుచేస్తున్నారు.

ఇక ఇక్కడికి వస్తే ఆంధ్రప్రదేశ్ విభజన ఖరారైంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలలో ఆమోదం పొందింది. చివరిగా రాష్ట్రపతి ఆమోదం పొంది అధికారికంగా తెలంగాణ రాష్ట్రం దేశంలో 29వ రాష్ట్రంగా జూన్ 2 నుండి ఉనికిలోకి రానుంది. దీంతో ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశం, బి.జె.పి, వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలు ఇరురాష్ట్రాల్లో అధికారం కోసం వెంపర్లాడుతుండగా, కాంగ్రెస్‌లో విలీనం అవుతుందనుకున్న

టి.ఆర్.ఎస్ విభజనానంతరం విలీనానికి అంగీకరించకపోవడంతో కాంగ్రెస్‌కి చుక్కెదురైంది. తెలంగాణలో ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగుతామని కాంగ్రెస్ – టిఆర్ఎస్‌లు ప్రకటించాయి. అదే సమయంలో పొత్తులకు కూడా ద్వారాలు తెరిచే వుంటాయని కూడా మాట్లాడుతున్నాయి. సీమాంధ్రలో తెలుగుదేశం, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్‌లు నువ్వా నేనా అనేంతగా పోటా పోటీ కొనసాగుతుండగా, విభజన ప్రక్రియతో సీమాంధ్రలో కాంగ్రెస్‌కు వ్యతిరేక పవనాలు వీస్తుండడంతో కాంగ్రెస్ నాయకులు తెలుగుదేశం, వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీల తీర్థం పుచ్చుకుంటున్నారు. మరో పక్క మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తెలుగుజాతి ఆత్మగౌరవం కాపాడే పేరుతో 'జై సమైక్యాంధ్ర' పార్టీపెట్టి బరిలోకి దిగాడు. దీంతో సీమాంధ్ర కాంగ్రెస్ పార్టీ అయోమయ స్థితిలోకి నెట్టివేయబడగా, వరుసగా రెండుసార్లు ఓడిపోయిన తెలుగుదేశం ఈసారైనా అధికారం దక్కించుకోవాలని తాపత్రయపడుతున్నది. ఈ ప్రయత్నంలో భాగంగానే ప్రజాగర్జన పేరుతో ఎన్నికల క్యాంపెయిన్ చేపట్టింది. చంద్రబాబు తన రెండు కళ్ళ సిద్ధాంతాన్ని అనుసరించి సీమాంధ్ర – తెలంగాణకు సమాన న్యాయం అంటు ప్రగల్భాలు పలుకుతున్నాడు. తెలంగాణ పునర్నిర్మాణం, సీమాంధ్ర అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమని, తెలంగాణకు బి.సి. అభ్యర్థిని ముఖ్య మంత్రిని చేస్తామని ప్రకటిస్తున్నాడు. మరో వైపు వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సమైక్యాంధ్ర కోసం తమ పార్టీ మాత్రమే గట్టిగా పోరాడిందని, తెలుగుదేశం, కాంగ్రెస్, బి.జె.పి పార్టీలు ద్రోహం చేసాయనీ వాటివల్లే రాష్ట్రం నిలువునా చీలిపోయిందని, నిందారోపణలతో ప్రచారం లంకించుకున్నది. అంతే కాకుండా వై.ఎస్ రాజశేకర రెడ్డి హయాంలో చేపట్టిన జనాకర్షక పథకాల ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, ప్రచారంచేస్తూ 'ఓదార్పు యాత్ర' 'జనభేరి' ల పేరుతో ప్రజల 'సానుభూతి' ని ఓట్లుగా మలుచుకోవాలని చూస్తున్నది. ఇక బి.జె.పి పార్టీ తెలంగాణ ప్రజలకు ప్రత్యేక తెలంగాణానూ, సీమాంధ్ర ప్రజలకు ప్రత్యేక హోదాను సాధించి పెట్టిన చాంపియన్‌లా ఫోజు పెడుతూ, ఎన్నికలలో ఒక బలమైన శక్తిగా ఆవిర్భవించేందుకు ప్రయత్నిస్తున్నది. ప్రస్తుత ఎన్నికల సందర్భంగా పైన చెప్పినట్లు, రకరకాల అబద్ధాలతో, బూటకపు వాగ్దానాలతో ఎన్నికల బరిలోకి దిగిన ఈ పాలక పార్టీలన్ని సామ్రాజ్యవాద అనుకూల సంస్కరణలను అమలు చేయడంలోను, సంస్కరణలను వ్యతిరేకించిన ప్రజలపై ఫాసిస్టు నిర్భంధాన్ని రుద్దటంలోను ఒకే గూటి పక్షులుగా మెలిగాయి. అయితే వారి మధ్య నేడు కొనసాగుతున్న వైరుధ్యాలు, అవకాశవాద కలయికలు కేవలం అధికారం దక్కించుకొని తమ ముఠా దోపిడి ప్రయోజనాలను సాధించుకోవడం కోసమే గత పాలక వర్గాల చరిత్రంతా ఈ వాస్తవాన్నే రుజువు చేస్తూ వచ్చింది.

పై నేపథ్యంలోనే గత పదేళ్ళుగా కేంద్రంలో యూ.పి.ఎ పాలనకు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర రాష్ట్రాన్ని, దేశాన్ని అన్ని రంగాల్లోనూ మరింతగా దిగజార్చింది. కేంద్రంలో యూ.పి.ఎ, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక, నూతన ఉదారవాద, ఆర్థిక విధానాలను క్రూరంగా అమలు చేసాయి. యూ.పి.ఎ ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో 2 జి స్పెక్ట్రమ్, కామన్‌వెల్త్ క్రీడలు, ఆదర్శ్ హౌజింగ్ సొసైటీ, బొగ్గు కుంభకోణం, ఆగస్టా హెలికాఫ్టర్ కొనుగోలు కుంభకోణం వంటి లక్షల, కోట్ల రూపాయల కుంభకోణాల సహా మరెన్నో కుంభకోణాలకు పాల్పడి ప్రజాధనాన్ని కొల్లగొట్టింది. దేశసార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టి సామ్రాజ్యవాదులతో ఎన్నో ఒప్పందాలను చేసుకున్నది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్.డి.ఐ) లకు తలుపులు బార్లా తెరుస్తూ దేశంలో రెండవ దశ ఆర్థిక సంస్కరణలను దూకుడుగా అమలుచేస్తున్నది. కోట్లాది చిల్లరవర్తకుల ప్రయోజనాలను దెబ్బతీస్తూ రిటైల్‌రంగాన్ని పూర్తిగా సామ్రాజ్యవాద కంపెనీలకు అప్పజెప్పే విధానాల అమలుకు పూనుకుంది. దేశ ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టి దేశాన్ని గుల్లచేస్తున్నది, ప్రజలను నిర్వాసితులను చేస్తున్నది.

ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే రాజశేఖరరెడ్డి మొదలు కిరణ్‌కూమార్ రెడ్డి వరకు మైనింగు మాఫియాలుగా మారి రాష్ట్ర సంపదను కొల్లగొట్టారు. బహుళజాతిసంస్థల, దేశ కార్పొరేట్‌సంస్థల ప్రయోజనాలకోసం రాష్ట్రంలో ప్రజల రక్తాన్ని పారించారు. కార్పొరేట్‌సంస్థల థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల కోసం సోంపేట, కాకారాలపల్లిలలో రైతాంగాన్ని హత్యగావించారు. విశాఖ బాక్సైట్, పోలవరండ్యాం, ఓపెన్‌కాస్ట్ గనులు, కోస్టల్ కారిడార్ వంటి అనేక ప్రజావ్యతిరేక నిర్మాణాల కోసం ప్రభుత్వ కిరాయి పోలీసులు ప్రజలపై తీవ్రమైన నిర్భంధాన్ని అమలు జరుపుతున్నారు. ఒక వైపున ప్రజల జీవనాధారమైన భూమిని గుంజుకుని వారిని దిక్కులేని వారిగా చేస్తూ, మరోవైపు సంక్షేమ పథకాల పేరుతో మనరేగా, ఆహారభద్రతా పథకం వంటి వాటిని ముందుకు తెస్తున్నారు. రాష్ట్రంలోనైతే బంగారుతల్లి, ఆపద్బంధులాంటి అనేక పథకాలను గుప్పిస్తున్నారు. ఈ పథకాలన్నీ ప్రజలను దోపిడీవర్గాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే దీనస్థితికి నెడుతున్నాయి. వారిని అస్వతంత్రుల్ని చేస్తున్నాయి.

మరోవైపు కంటితుడుపుగా చేపట్టిన ఈ పథకాలన్ని తీవ్రమైన జాప్యం, అవినీతి వంటి లక్షణాలతో ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడకుండా పోతున్నాయి. మనరేగా పథకం కింద ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల పని కల్పించామని కాంగ్రెసు ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటున్నది. మనరేగా పనుల్లో మంత్రులు, కలెక్టర్లనుండి మొదలుకొని గ్రామసర్పంచ్‌లు, సచివ్‌ల దాకా పాల్పడుతున్న అవినీతికి అంతేలేదు. పనులు కాకపోయినా కాగితాల మీద తప్పుడు హాజరు చూపించి, పాస్‌బుక్కులలో నకిలీ ఎంట్రీలు చేసి కూలీలకు చెల్లించాల్సిన కోట్లరూపాయల ప్రజాధనాన్ని దోచుకుంటున్న వుదంతాలు ఎన్నో వెలుగుచూస్తున్నాయి. ఆహారభద్రతా పథకం పేరుతో ప్రతి పేదకుటుంబానికి ఒకరూపాయికి కిలో బియ్యం చొప్పున 35 కిలోల బియ్యం ఇస్తున్నామని కాంగ్రెసు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. నిజానికి గోదాములలో మూలుగుతున్న ఆహారధాన్యాలను ప్రజలకు ఉచితంగా పంచాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నది ఇక్కడ గమనార్హం. ఒక వైపు భూములను గుంజుకుంటూ రైతును వ్యవసాయానికి దూరం చేసే వినాశకర విధానాలను అమలుచేస్తూ మరోవైపు చౌకగా బియ్యం ఇస్తామని చెప్పడం ఒక కుట్ర. ఇక విద్యా, వైద్య రంగాల దుస్థితి తెలిసిందే. ఈ రంగాలను కార్పొరేట్ వర్గాలకు అప్పచెప్పి క్రమంగా పీడిత ప్రజలకు ఈ సదుపాయాలు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను పంచనపెట్టేసి, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో కుమ్మక్కై భారీ మోసానికి, అవినీతికి పాల్పడుతున్నారు. ఫలితంగా రాష్ట్రంలో ముఖ్యంగా ఆదివాసి ప్రాంతాలలో విద్యా, వైద్యం అందని ద్రాక్షగా మారాయి.

ఒడిశాలో నవీన్‌పట్నాయక్ నాయకత్వంలో బి.జె.డి

ప్రభుత్వం గత పదిహేనేండ్లుగా రాష్ట్రంలో అధికారం వెలగబెట్టింది. ఒక పదేండ్లు బి.జె.పితో కలసి అధికారం పంచుకున్నది. ఈ మొత్తం కాలంలో బి.జె.డి ప్రభుత్వం సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు పెద్దపీట వేసింది. సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల ప్రయోజనాల కోసం ఇక్కడి సహజ సంపదలను, భూములను కట్టబెట్టడానికి పోస్కో, వేదాంత, టాటా, జిందాల్, సెయిల్ వంటి బహుళజాతి కంపెనీలతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నది. ఆదివాసి చట్టాలు, రాజ్యాంగ పరిధులను దాటి వారికి భూములను కేటాయించింది. దక్షిణకొరియా కంపెనీ పోస్కో ప్రభుత్వ నియమ నిబంధనలను ఘోరంగా ఉల్లంగించి అనేక అవకతవకలకు పాల్పడినప్పటికి, దాని అనుమతిని రద్దుచేయకుండా నవీన్‌పట్నాయక్, మన్‌మోహన్‌సింగ్‌లు పోస్కో ప్రయోజనాలను కాపాడి సామ్రాజ్యవాదుల పట్ల తమ స్వామి భక్తిని ప్రదర్శించుకున్నారు. బి.జె.డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ దిగజార్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసుల వనరులు కాజేయడంలో ముందున్న ప్రభుత్వం రాజకీయార్థిక, సామాజికంగా వెనుకబడిన తెగలు కొండరెడ్డి, నూకదొర, జొడియా తదితర ఆదివాసి తెగలను గుర్తించడంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యదోరణిని ప్రదర్శిస్తున్నది. నారాయణపట్నాలో ఆదివాసి రైతాంగ పోరాటాన్ని రక్తపుటేరుల్లో ముంచి ఆదివాసేతరులకు భూములు కట్టబెట్టాలని చూస్తున్నది. మాలి, దేవమాలి పర్వతాలలో బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాపోరాటాలపై ఉక్కుపాదం మోపుతున్నది. రాష్ట్రంలో ప్రాథమిక విద్య మొదలు ఉన్నత విద్య వరకు ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురయినాయి. విద్య, వైద్యం, వ్యవసాయం, నీరు, రోడ్ల నిర్మాణం, పరిశ్రమలు నెలకొల్పడంలో అనేక అవకతవకలకు పాల్పడుతూ నల్లధనాన్ని పోగేసుకోవడం పరిపాటయ్యింది. రాష్ట్రంలో అవినీతి మంత్రుల నుండి మొదలుకుని సాధారణ పోలీసుల వరకు వేళ్ళూనుకుంది. ఈ క్రమంలో కొంతమంది మంత్రులు పదవులు కోల్పోవలసి వచ్చింది. అదే విధంగా నవీన్ ప్రభుత్వం రాష్ట్రంలో 750 కోట్ల డల్లీ (పప్పు) కుంభకోణం, 56 వేలకోట్ల అక్రమ గనుల లీజు కుంభకోణాలతో సహ మరెన్నో కుంభకోణాలకు పాల్పడి ప్రజాధనాన్ని కొల్లగొట్టింది. ఈ విషయంలో నవీన్ ప్రభుత్వం సుప్రీంకోర్టు అభిశంసనకు గురికావలసి వచ్చింది. అత్యధిక శాతం ప్రజలు ఆధారపడుతున్న వ్యవసాయరంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నది. బహుళజాతి కంపెనీల ప్రయోజనాలను ఈడేరుస్తూ రైతుల బతుకుల్ని దిగజారుస్తున్నది. ఎల్.పి.జి విధానాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని క్రమంగా కార్పొరేట్ పరం చేయడమే దాని లక్ష్యం. రైతాంగం సాగునీటి కోసం ఉద్యమిస్తున్నా పెడచెవిన పెట్టి అతితక్కువ శాతం భూములకు సాగునీరు అందిస్తూ మిగిలిన నీటిని బడా పెట్టుబడి దారుల పరిశ్రమలకు ఉపయోగపడే విద్యుత్ కోసం కేటాయిస్తున్నారు. దీంతో రైతుకు బతుకే బరువైన పరిస్థితి నెలకొన్నది.

ఇక మతోన్మాద బి.జె.పితో కలసి అధికారం కొనసాగించిన 10 ఏళ్ళకాలంలో రాష్ట్రాన్ని హిందూ రాజ్యంగా మార్చాలనే దుష్టపథకాన్ని అమలు చేయడంలో బి.జె.పి కి తోడ్పడింది. ఫలితంగా రాష్ట్రంలో అనేక చోట్ల మతమైనారిటీలపైన హిందూత్వ ఫాసిస్టు శక్తులు దాడులు చేయడానికి ఊతమిచ్చింది. అందులో భాగంగానే కొంథమాల్‌లో క్రిష్టియన్లపై దాడులు జరిగాయి. ఆస్ట్రేలియాకు చెందిన క్రిష్టియన్ ఫాదర్, వారిద్దరు పిల్లలు సజీవ దహనానికి గురయ్యారు. అనేకమంది స్త్రీలు అత్యాచారాలకు గురయ్యారు. మొన్నటి పిప్పిలి అత్యాచార ఘటన నుండి నేటి రాయగడ ఇతిశ్రీ వరకు అత్యాచారాల పరంపర కొనసాగుతూనే వుంది. గత పదిహేనేండ్లలో ఇవి వెలుగు చూడగా మరెన్నో మరుగున పడిపోయాయి. వీటి దుష్ప్రభావం ఎన్నికలలో పడి అధికార పీఠానికి ఎసరువస్తుందనే భయంతో బి.జె.పికి నవీన్ పట్నాయక్ దూరమయ్యాడు. ఇక ఇక్కడి ప్రతిపక్ష పార్టీలకు కూడా ప్రత్యామ్నాయ కార్యక్రమం లేదు. కాంగ్రెస్, బి.జె.పిల నుండి, కొత్తగా బి.జె.డి నుండి చీలిపోయిన ప్యారీమోహన్ "జనమోర్చ" పార్టీ వరకు సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలు నెరవేర్చేవిగానే వున్నాయి.

ఈ కాలంలో కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షంగాను, కొన్ని రాష్ట్రాలలో అధికార పక్షంగాను కొనసాగిన బి.జె.పి పార్టీ తనను తాను పచ్చి మతోన్మాద, ఫాసిస్టుగా ఏనాడో రుజువు చేసుకుంది. మరింత ఫాసీజికరణ వైపు ప్రయాణించే లక్ష్యంలో భాగంగా బి.జె.పి ప్రస్తుతం నరేంద్రమోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించుకుంది. అది అమలు చేసిన సామ్రాజ్యవాద అనుకూల నయా ఉదార విధాన గుజరాత్ నమూనాను దేశమంతటా అమలుచేయాలనీ ఉత్సాహపడుతున్నది. దేశాన్ని హిందు రాజ్యంగా మార్చాలనే తన దుష్ట తలంపును అమలు చేయడంలో అందరికంటే దూకుడుగా వ్యవహరించే మోడీ ప్రాబల్యం బి.జె.పిలో పెరిగిన నేపథ్యంలో బి.జె.పి అధికారంలోకి వస్తే ఇక్కడ హిందూ మతోన్మాదం మరింతగా పెట్రేగిపోయే ప్రమాదం ఉంది. ఇది రాష్ట్రంలోని మైనార్టీ మతాలకే కాదు, ఆదివాసీ ప్రజల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి తీవ్రముప్పుగా ఉంటుంది.

**ప్రియమైన ప్రజలారా**

భారత బూటకపు స్వాతంత్ర్యం తర్వాత దాదాపు 67 సం॥ గడిచిపోయాయి. ఈకాలంలో అనేక ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి, వెళ్ళాయి. దోపిడి పాలక వర్గాలు పోరాడే ప్రజల చైతన్యాన్ని మొద్దుబరిచి భ్రమలలో తెలియాడే విధంగా చేసేందుకు పార్లమెంటరీ ఎన్నికలను, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని శక్తివంతమైన ఆయుధాలుగా ఉపయోగించుకుంటున్నారు. అయితే భారత పాలక వర్గాలైన నిరంకుశ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలు అనుసరించిన సామ్రాజ్యవాద అనుకూల, దోపిడి విధానాల వలన పార్లమెంటరీ సంస్థలు, వ్యవస్థ ప్రజల దృష్టిలో చాలా వరకు అప్రదిష్ట పాలైనాయి. అందుకే ఈ ఎన్నికల ద్వారా ఎవరు గెలిచినా తమ బతుకు మారుతుందని గానీ, ఈ వ్యవస్థలో మౌలిక మార్పు వస్తుందని గానీ పీడిత ప్రజలెవ్వరు నమ్మడంలేదు. దేశంలో ఎక్కడైనా, ఏ ఎన్నికలైనా గణనీయమైన సంఖ్యలలోనే ప్రజలు వోటింగ్‌కు దూరంగా ఉండిపోతున్నారు. వోట్లు వేస్తున్న వాళ్ళలో కూడా ఎక్కువ మంది ప్రజలు తమకేదో ఒరగబెడతాయనే నమ్మకంతో కాక, కేవలం స్థానిక అవసరాలకోసమో, కులం, మతం, డబ్బు, గూండాయిజం, తదితర వత్తిళ్ళతోనో లేదా ప్రలోభాలతోనో ఓట్లు వేస్తున్నారు. గత 67 ఏళ్ళ స్వతంత్ర పాలనలో అనేకసార్లు ఎన్నికలు జరిగి, అనేక ప్రభుత్వాలు మారి పోయినప్పటికి ఈనాటికి కూడు, గుడ్డ, గూడు వంటి ప్రజల కనీస అవసరాలు కూడా నెరవేరలేదనేది నిజం. నూటికి

95% వున్న పీడిత ప్రజలు ఆకలి, పేదరికం, నిరుద్యోగం, అధికధరలు, అనారోగ్యం, అవినీతి వంటి సమస్యలతో నిత్యం సతమతమవుతున్నారు. **దేశంలో 77% మంది ప్రజలు రోజుకు 20 రూపాయలైనా దొరకని దుస్థితిలో జీవిస్తున్నారు. మరోవైపు బడాపెట్టుబడిదార్లు, భూస్వాములు అంతులేని ఐశ్వర్యాలు అనుభవిస్తున్నారు. అంబానీ, టాటా, బిర్లా, మిత్తల్, జిందాల్ తదితర వంద కార్పొరేట్ రాబందుల సంపదలు దేశ జి.డి.పి లో పావు భాగంగా ఎదిగాయి. పేదలకు, ధనికులకు అంతరాలు ఈ వ్యవస్థలో చెప్పనలవి కాని స్థాయికి పెరిగిపోయాయి. ఈ ఆర్థిక వ్యత్యాసాలు బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు వర్గపీడన స్వభావాన్ని బహిర్గతపరుస్తున్నాయి.**

అయితే సామ్రాజ్యవాదం తీవ్రమైన ఆర్థిక, ద్రవ్య సంక్షోభంలో కూరుకు పోయిన నేటి పరిస్థితుల్లో దాని నుండి బయటపడటానికి సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలైన భారత పాలక వర్గాలు ఎల్.పి.జి విధానాలను అమలు చేస్తూ దేశ పీడిత ప్రజలను మరింత దోపిడి పీడనలకు గురిచేస్తున్నారు. వాటికి వ్యతిరేకంగా పీడిత ప్రజలు, జాతులు తీవ్రంగా పోరాడుతున్నాయి. మనదేశ పాలక వర్గాలు సామ్రాజ్యవాదంతో కుమ్మక్కై అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి ప్రయోజనాల కోసం, తమ సొంత లాభాలకోసం ఆంధ్ర – ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని భౌతిక సహజ వనరులను పెద్ద ఎత్తున లూటీ చేయడానికి బహుళజాతి కంపెనీలతో ఎం.ఒ.యు లను కుదుర్చుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన ఈ సామ్రాజ్యవాద అనూకూల విధానాలకు వ్యతిరేకంగా అడవిపై హక్కు ఆదివాసీలది, పీడిత ప్రజలదేనని ఎలుగెత్తి చాటుతూ ప్రజలు పెద్దయెత్తున ఉద్యమిస్తున్నారు. దీనితో దోపిడి పాలక వర్గాలు తమ ప్రయోజనాలకు అడ్డుగా ఉన్న పార్టీని, పి.ఎల్.జి.ఎను తొలగించుకునేందుకు గ్రీన్‌హంట్ బహుముఖ దాడిని ఎక్కుపెట్టాయి. ఈ దాడి అత్యంత పాశవికంగా కొనసాగుతున్నది. ముఖ్యంగా ప్రజా విప్లవానికి నాయకత్వం లేకుండా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మా పార్టీపైన, పి.యల్.జి.ఎ పైన తీవ్రమైన దాడిని కొనసాగిస్తున్నాయి. దీంట్లో భాగంగా ఆంధ్ర – ఒడిశా సరిహద్దు ప్రాంత పరిధిలో కార్పెట్ సెక్యూరిటీని విస్తరిస్తూ అర్ధసైనిక / పోలీసు క్యాంపులను నెలకొల్పుతూ మొత్తం ఎ.ఒ.బి ప్రాంతానంతా సైనిక శిభిరంగా మార్చుతున్నాయి. వేల సంఖ్యలో అర్ధ సైనిక బలగాలను, పోలీసు కమాండో బలగాలను మోహరిస్తూ వాటి సంఖ్యను రోజు రోజుకు పెంచుతున్నాయి.

విప్లవ ప్రతిఘాతుక ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఒక వైపు నిర్బంధకాండను కొనసాగిస్తూనే సంస్కరణలను కూడా ఒక ప్రధాన ఆయుధంగా ప్రయోగిస్తున్నది. పోలీసులు సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ పేరుతో బట్టలు, సైకిళ్ళు, వంటపాత్రలు, టీ.విలు, క్రీడాసామాగ్రి వగైరా పంచుతూ ప్రజల మనస్సులను, హృదయాలను దోచుకోవడం కోసం విఫల ప్రయత్నం చేస్తున్నారు. వందల కోట్ల రూపాయలతో పక్కారోడ్లు, వంతెనలు వంటి నిర్మాణాలు పెద్దఎత్తున చేపడుతున్నారు. సరెండర్ పథకాలు, సద్భావన యాత్రలు, జనసంపర్క్ శిభిరాలు, విప్లవకారుల కుటుంబాలతో కౌన్సిలింగ్, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్, దుష్ప్రచారం వంటివి తీవ్రతరం చేశారు. ఇంకా అనేక కొత్త కొత్త రూపాల్లో ప్రభుత్వ దాడి కొనసాగుతున్నది. గ్రామాల్లో దాడుల సందర్భంగా ప్రజలను తీవ్రంగా హింసించడం, మాయం చేయడం, హత్యలు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం, దొరికిన వాళ్ళను అరెస్ట్‌చేసి తీవ్రచిత్రహింసలకు గురిచేసి తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడం పెద్దఎత్తున కొనసాగుతున్నది. ఈ మధ్య పొడియాలో 13 మంది నిరాయుధ సంఘసభ్యులను, మిలిషియా సభ్యులను పట్టుకొని అమానుషంగా హత్య చేసారు. అందులో గంగిసోడి అనే 10 సంవత్సరాల బాలిక కూడా వుంది. విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో గత నాలుగేళ్ళుగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను కొనసాగిస్తున్న దోపిడీ పాలకవర్గాలు ఈ ఎన్నికల దృష్ట్యా తమదాడిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. గ్రామాలపై దాడులు, కూంబింగ్ ఆపరేషన్స్, అరెస్టులు, బూటకపు ఎన్‌కౌంటర్లు కొనసాగిస్తున్నాయి. మా పార్టీ నాయకత్వంలో జరిగే 'ఎన్నికల బహిష్కరణ' క్యాంపెయిన్‌ను ఎలాగైనా అడ్డుకోవాలని మరిన్ని అర్ధసైనిక బెటాలియన్లను, అదనపు పోలీసు బలగాలను, కమెండో బలగాలను మెహరించే సన్నాహాలు జరుగుతున్నాయి. ఎన్నికలను 'నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా' నిర్వహించే పేరుతో నిర్భంధకాండను తీవ్రతరం చేస్తుండడం గమనార్హం. అంటే ప్రతిసారిలాగే ఈ ఎన్నికలు కూడా ప్రత్యేకించి విప్లవోద్యమ ప్రాంతాల్లో తుపాకుల పహరాలోనే జరగబోతున్నాయి. కనుక దోపిడి పాలక వర్గాలు సాగిస్తున్న ఫాసిస్టు దాడిని ప్రతిఘటిస్తూనే ప్రజలు ఎన్నికలు బహిష్కరించాలని పిలుపునిస్తున్నాం.

**ఈ సందర్భంగా బూటకపు పార్లమెంటు ఎన్నికలతో పాటు ఆంధ్ర ఒడిశా విధానసభ ఎన్నికలను, ఆంధ్రలో మండల, జిల్లా పరిషత్, నగరపాలక, పురపాలక సంస్థల ఎన్నికలను సైతం బహిష్కరించాలనీ, భారతదేశ విముక్తి కోసం ప్రస్థుత అర్ధవలస, అర్థభూస్వామ్య వ్యవస్థను సమూలంగా, సాయుధంగా కూలదోయాలని సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.ఒ.బి స్పెషల్‌జోన్ కమిటీ ప్రజలందరికీ మరోమారు పిలుపునిస్తోంది.** సి.పి.ఐ (మావోయిస్టు) నాయకత్వంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి బలమైన ప్రజాసైన్యాన్ని, ఐక్యసంఘటనను ఏర్పరచుకుంటూ శత్రువుకు వ్యతిరేకంగా పోరాడి కార్మిక – కర్షక మైత్రి పునాదిగా విప్లవకర నాలుగువర్గాల ప్రజల ప్రజాస్వామ్యాన్ని ఫెడరల్ ప్రజాస్వామిక రిపబ్లిక్‌ని స్థాపించడం ద్వారా మాత్రమే దేశప్రజలు ఎదుర్కొనే అన్ని మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయి. అప్పుడే బడా దళారి నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల నియంతృత్వానికి ముసుగుగా గల పార్లమెంటరీ ప్రజాస్వామ్యన్ని కూలదోసి, దేశంలో ప్రజల నిజమైన ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పగలం. దేశాన్ని సామ్రాజ్యవాదుల ఆధిపత్యం నుండి విముక్తి చేసి నిజమైన స్వాతంత్ర్యంతో పాటు నిజమైన సార్వభౌమత్వాన్ని సాధించగలం. దేశాన్ని విశాల ప్రజారాసుల ప్రయోజనాలకు అనుగుణంగా నిజమైన ప్రగతిశీల, శాంతియుత మార్గంలో పురోగమింప చేయగలం.

**విప్లవాభివందనాలతో**

**సి.పి.ఐ (మావోయిస్టు)**

**ఆంధ్ర – ఒడిశా సరిహద్దు ప్రాంత కమిటీ.**

అమరుల చరిత్ర

# రివిజనిస్టు రాజకీయాలపై, శత్రువుపై అలుపెరగని పోరాటం చేసి ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టిన కార్మికవర్గ యోధుడు కా॥ఈపే స్వామి (నరేందర్)కు జోహార్లు !!

2014 ఏప్రిల్ 4న కొరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్ మునగవలస గ్రామంలోని ఒక ఇంటిలో కా॥నరేందర్, కా॥దుంబ్రిలు వున్నపుడు నమ్మకద్రోహం మూలంగా ఎలాంటి హెచ్చరికలు లేకుండా పోలీసులు కురిపించిన తూటాల వర్షంలో పీడిత ప్రజల ప్రియతమ పుత్రులు నేలకొరిగి ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించారు.

కా॥నరేందర్ అసలు పేరు ఈడే స్వామి. కానీ ప్రజలలో గుర్తింపు ఉన్న పేరు మంగన్న. ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలం మెట్టుపల్లి గ్రామంలో 'దొర' అనే ఆదివాసి కుటుంబంలో జన్మించాడు. కా॥మంగన్న అన్నదమ్ములు ఇల్లెందులోని సింగరేణి గనులలో కార్మికులుగా పనిచేస్తూ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు నిర్వహించేవారు. 1977లో ఎమర్జెన్సీ ఎత్తివేత తరువాత 13 ఏళ్ళ వయస్సులో ఆ ప్రాంతంలో ఆనాటికి ఉన్న చంద్రపుల్లారెడ్డి నాయకత్వంలోని విమోచన పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. 1984లో పుల్లారెడ్డికీ, పైలా వాసుదేవరావుకి నడుమ తలెత్తిన పంథా విభేదాల వల్ల పార్టీలో సంక్షోభం తలెత్తి ప్లీనం జరపాల్సి వచ్చింది. ఆ ప్లీనంకు హాజరైన ప్రతినిధులలో అందరికంటే కా॥మంగన్నే వయస్సులో చిన్నవాడు. ఆ ప్లీనంలో కా॥మంగన్న పార్టీలో సంక్షోభానికి గల కారణాలనూ, నాయకత్వ మితవాద అవకాశవాద పద్ధతులనూ, కుట్రలనూ, కుహకాలను చాలా సూటిగా విమర్శించాడు. తదుపరి పార్టీ రెండుగా చీలిపోయినప్పుడు కా॥మంగన్న విమోచన పార్టీలోనే కొనసాగి అతి చిన్న వయస్సులోనే కమాండర్ బాధ్యతలు స్వీకరించాడు. న్యూడెమోక్రసీ పార్టీ చీలిపోయిన మరునాటి నుండే విమోచన పార్టీపై దాడులకు పాల్పడినప్పుడు వాటన్నిటిని తిప్పికొట్టి ప్రజలను నిలబెట్టుకోవడానికి కృషి చేసాడు. మరల 1988లో విమోచన పార్టీలో సంక్షోభం తలెత్తి (పంజాబ్‌లో టెర్రరిస్టులను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆయుధాలు తీసుకున్నారన్న కారణంగా) పార్టీ రెండుగా చీలిపోగా కా॥మంగన్న కొత్తగా ఏర్పడ్డ ప్రతిఘటన పార్టీలో చేరాడు. అప్పుడు ప్రతిఘటన పార్టీ ఇల్లెందు నుండి మణుగూరు వరకు ఒక ప్రత్యేక దళాన్ని వేసి దానికి కా॥మంగన్నను కమాండర్‌గా నియమించింది. ఆనాటికి ఈ పార్టీలపై పోలీసు దాడులు లేనప్పటికీ ఈ పార్టీలే ఒకదానిపై మరోకటి చేసుకున్న దాడులలో సాధారణ ప్రజలు, కార్యకర్తలు హత్యలకు గురయ్యారు. ఈ హత్యలను నివారించడానికి కా॥మంగన్న నేతృత్వంలో దాడులకు కారణమైన కొద్దిమంది నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని నిర్మూలించారు. దాంతో తాత్కాలికంగా దాడులు ఆగిపోయాయి. అయితే 1988 నాటికి ఆ పార్టీలలో జరిగిన సంక్షోభాలకు తీవ్రంగా మధనపడ్డ కా॥మంగన్న తన దృష్టిని పీపుల్స్ వార్ పార్టీ వైపుకు మరల్చాడు. పీపుల్స్‌వార్ పార్టీకి చెందిన డాక్యుమెంట్లను, క్రాంతిని తను శ్రద్ధగా చదవడమే కాకుండా దళంలోని కార్యకర్తలకూ, ప్రజలకు చదివి వినిపించి పంథాలపై చర్చించేవాడు.

ప్రతిఘటన పార్టీ ఎత్తుగడల పేరుతో ఎన్నికలలో పాల్గొన్నప్పుడు



కా॥మంగన్న తను పనిచేస్తున్న ఉద్యమ ప్రాంతమంతటా ఎన్నికల బహిష్కరణ కొరకు కృషి చేసాడు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం ఆదేశించినా వినని ''పార్లమెంటు పంథాపై ఎవరికి నమ్మకం ఉంది? ప్రజలకా? పార్టీ నాయకత్వానికా?" అంటూ మితవాద అవకాశవాద రాజకీయాలను ఎండగడ్తూ ప్రజలను చైతన్యవంతం చేయడానికి కృషి చేసాడు. ఖమ్మం జిల్లా బయ్యారంలోని జానంపేటకు చెందిన పెద్దాబ్బాయి అనే భూస్వామి ఆదివాసీలకు చెందిన వందల ఎకరాల భూముల్ని ఆక్రమించాడు. ఇతను చంద్రపుల్లారెడ్డి సహచరి రాధక్కకు సమీప బంధువు, సి.పి.ఐ పార్టీకి చెందిన రైతుకూలి సంఘానికి అధ్యక్షుడు. పెద్దబ్బాయికి చెందిన భూముల స్వాధీనంకై ప్రజలను సంఘటితం చేసి పోరాటం ప్రారంభించగానే పార్టీ నాయకత్వం, రాధక్క కా॥మంగన్నకు నచ్చచెప్పడంతో పాటు ఆయనపై అనేక వత్తిళ్ళు తీసుకొచ్చారు. అయినప్పటికీ భూస్వామ్య వ్యతిరేక పోరాటం వదులుకోనని చెప్పి 250 ఎకరాల భూముల్ని ఆక్రమించి ప్రజలకు పంచిపెట్టాడు. ఈ సంఘటనల తరువాత అటువంటి పార్టీలలో ఉండి పనిచేస్తూ పంథాలో మార్పు తీసుకురావడం సాధ్యం కాదని గ్రహించి వారితో రాజకీయంగా తెగతెంపులు చేసుకుని 1991లో తను, తనతో పాటు పనిచేస్తున్న 13 మంది కామ్రేడ్స్‌తో, ఆయుధాలతో సహా వచ్చి పీపుల్స్ వార్ పార్టీలో చేరాడు. 1990లలో ఖమ్మంకు విస్తరించాలని ఎపి రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఆ ప్రాంతానికి పోయిన ఆర్గనైజర్లు, కార్యకర్తలు తీవ్రమైన శత్రు నిర్బంధానికి గురవడంతో పాటు ఆ ప్రాంతంలో

పని చేస్తున్న విమోచన, ప్రతిఘటన, న్యూడెమొక్రసీ, సి.పి.ఐ, సి.పి.ఎమ్ పార్టీల చేతుల్లో కొద్దిమంది హత్య చేయబడ్డారు. దాంతో అక్కడ మనం నిలదొక్కుకోలేని పరిస్థితి ఏర్పడింది. అటువంటి పరిస్థితులలో కా॥మంగన్న రాక అక్కడి ఉద్యమ నిర్మాణానికి ఎంతగానో తోడ్పడింది. కా॥మంగన్న అక్కడ పనిచేస్తున్న కాలంలో పోలీసులు, విప్లవ పార్టీలు ఇతనిని లక్ష్యంగా చేసుకొని అనేక దాడులు చేసారు. ప్రజల అండదండలతో తీవ్ర నిర్బంధాన్ని, కఠిన పరిస్థితుల్ని చాలా నిబ్బరంగా ఎదుర్కొన్నాడు. 1991లో పార్టీలోకి చేరిన కా॥మంగన్నను డివిజనల్ కమిటీలోకి తీసుకోవాలని నిర్ణయించి ఆ విషయాన్ని అతనికి తెలియచేసింది. పార్టీ పంథాపై సరియైన అవగాహన ఏర్పడకుండా ఉద్యమాన్ని ఆ స్థాయిలో గైడ్ చేయలేననీ, నేర్చుకోవడానికి కొంత సమయం కావాలని నిజాయితీగా, వినయంగా చెప్తూ పార్టీ ప్రతిపాదనను తిరస్కరించాడు. 1993 నాటికి డివిసిలోకి ప్రమోట్ అయ్యాడు.

శతృవు పట్ల తీవ్ర ఆగ్రహాన్ని కలిగి ఉంటూ అనేక దాడులలో ఎంతో సాహసోపేతంగా పాల్గొన్నాడు. 1992లో రాళ్ళవాగు అనే ప్రాంతంలో చేసిన ఆంబుష్‌లో 11 మంది పోలీసుల్ని చంపి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న ఘటనకు కా॥ మంగన్నే కమాండర్‌గా వ్యవహరించాడు. ఈ ఘటనలో కేవలం 15 మంది కామ్రేడ్స్ మాత్రమే పాల్గొన్నారు. 1997లో కర్కగూడెంలోని పోలీస్ స్టేషన్‌పై చేసిన రెయిడ్‌లో 17 మంది పోలీసులను చంపి, 33 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెయిడ్‌లోని అసాల్ట్ టీంకు కా॥మంగన్న కమాండర్‌గా కీలకమైన బాధ్యతను నిర్వర్తించాడు. దామెరతోగు ప్రాంతంలో తాత్కాలికంగా క్యాంపు వేసిన పోలీసు బలగాలపై ఉదయం 6గం॥నుండి సా॥6గం॥వరకు చేసిన ఫైరింగ్‌లో కొద్దిమంది పోలీసులను లొంగదీసుకోవడంతో పాటు కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్న ఘటనకు కూడా తనే కమాండర్‌గా వ్యవహరించాడు. ఇకబోడు అనే పోలీస్ స్టేషన్‌పై జరిగిన దాడిలో కూడా పాల్గొన్నాడు.

2004 చివరిలో ఉద్యమ అవసరాల రీత్యా కొద్దిమందిని ఉత్తర తెలంగాణ నుండి ఏఓబి జోన్‌కు పంపాలని పార్టీ నిర్ణయించింది. పార్టీ ఆదేశాన్ని సంతోషంగా స్వీకరించి కా॥ నరేందర్ పేరుతో ఏఓబి ఉద్యమంలో భాగమయ్యాడు. ఏఓబికి వచ్చిన తరవాత మొదట కోనలోవ ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతల్ని స్వీకరించాడు. 2006లో జరిగిన తృతీయ మహాసభలో ప్రతినిధిగా పాల్గొని, చర్చలలో భాగమవుతూ ఇక్కడి ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేసాడు. 2007 చివరి వరకూ విశాఖ జిల్లా కమిటీ మెంబర్‌గా తరువాత ఉద్యమ అవసరాల రీత్యా తూర్పుగోదావరి జిల్లా కమిటీలోను పనిచేసాడు. 2008లో పార్టీ నూతన ప్రాంతాలకు విస్తరించే లక్ష్యంతో అరకు ప్రాంత బాధ్యతలను తనకు అప్పగించింది. ఇందులో భాగంగానే ఆ ప్రాంతానికి వెళ్ళి పరిచయాల్ని పెంచుకుని ఉద్యమ విస్తరణకు కృషి చేసాడు.

2009 నుండి 2012 డిసెంబరులో జరిగిన ప్లీనం వరకు ఈస్ట్ డివిజన్‌లోని ఏసిని గైడ్ చేసే బాధ్యతను చేపట్టాడు.ఆ కాలంలో ఆ ప్రాంతంలో జరిగిన అనేక రాజకీయ ఉద్యమాలలో, ప్రజా సంఘాలలో పాలుపంచుకున్నాడు. ప్రజలను నిర్వాసితుల్ని చేసే బాక్సైట్ వ్యతిరేక పోరాటంలోనూ, బలపం పంచాయితీలో ఎపిఎఫ్‌డిసి ఆధ్వర్యంలోని 110 హెక్టార్ల కాఫీ తోటల స్వాధీన పోరాటంలోనూ, ప్రభుత్వ పథకాల అమలులో జరిగిన అవినీతి వ్యతిరేక పోరాటాలలోనూ ప్రజలకు ముందు భాగానా నిలబడి నాయకత్వం వహించాడు. తన ఆధ్వర్యంలో పదుల గ్రామాలలో రైతుకూలి సంఘాల నేతృత్వంలో భూపోరాటాలు జరిగి వ్యవసాయకూలీలు, పేద రైతులు భూమిని పొందారు. ఈ క్రమంలోనే కా॥నరేందర్ కోరుకొండ ప్రాంత ప్రజలందరికీ తలలో నాలుకగా మారాడనడం అతిశయోక్తి కాదు. ఈ మొత్తం కాలంలో డివిజన్ కమిటీ సభ్యుడిగా కోనలోవ, గాలికొండ, గుర్తేడు, ప్రాంతాలలో అత్యధిక కాలం తన సేవల్ని అందించాడు.

తను ఏ ప్రాంతంలో పని చేసినా ప్రజా సమస్యల పరిష్కారంపై అత్యంత శ్రద్ధ పెట్టేవాడు. ఐక్య సంఘటనా ఎత్తుగడలలో భాగంగా పంచాయితీ స్థాయిలో విశాల ప్రజల్ని కలుపుకు రావడం కోసం ఐక్య కార్యాచరణ కమిటీలను ఏర్పరిచి అనేక సమస్యలపై వేలాది మంది ప్రజలను కదిలించాడు. సంతలలో షావుకార్ల మోసాన్ని అరికట్టడానికి "సంత కమిటీని" ఏర్పరిచి దాని ద్వారా ప్రజలను సంఘటితం చేసాడు.

విప్లవ కేంద్రకర్తవ్యమైన ప్రజారాజ్యాధికారాన్ని నిర్మించే లక్ష్యంతో బలపం ప్రాంతంలో ఏర్పడిన విప్లవ ప్రజాకమిటీకి అధ్యక్షుడిగా ఉంటూ ఆ ప్రాంత ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసాడు. కమిటీ తీసుకున్న నిర్ణయాలు అమలు జరిగే విధంగా దీక్షతో కృషి చేసేవాడు. తనకు తెలుగు తప్ప ఇతర భాషలు రాకపోయినప్పటికీ కువ్వి, ఒడియా, గదబ ..ప్రజలను ఆర్గనైజ్ చేయడానికి తోటి కామ్రేడ్స్ సహాయ సహకారాలను తీసుకునేవాడు. భాష రాకపోవడాన్ని ఒక బలహీనతగానే గుర్తిస్తూ దాన్ని అధిగమించడం కోసం ఇతర మార్గాలను అన్వేషిస్తూ పనికి ఆటంకం లేకుండా చూసుకునేవాడు. ప్రజలతో మమేకం అయి పని చేయడం వల్ల ప్రజలు అతనిని అమితంగా ప్రేమించేవారు. గ్రామానికి దళం పోయినపుడు కా॥నరేందర్ కోసం వృద్ధులు, వికలాంగులు సైతం అతనిని వెదుక్కొంటూ వచ్చేవారు. ప్రజలకు అతనిపై ఎంతటి విశ్వాసం అంటే పోలీసులు అతనని ఏమి చేయలేరనీ, అతనికి తూటాలు తగలవనీ చెప్పుకునేవారు. 2011లో ఎన్‌టిను చూడడానికి వెళ్తానని పార్టీ ముందు ప్రతిపాదన పెట్టాడు. ఆ ప్రతిపాదనను పార్టీ ఆమోదించి ఎన్‌టికి పంపించింది. 2 నెలల పాటు అక్కడి కామ్రేడ్స్‌తో కలిసి ఉండి ఆ ప్రాంత ఉద్యమ ఆటుపోట్లను అధ్యయనం చేసాడు. తిరిగి వస్తున్న క్రమంలో సమీపంలో ఉన్న తన కుటుంబాన్ని కలిస్తే బాగుంటుందని అక్కడి కామ్రేడ్స్ ప్రతిపాదించగా "నాకు కుటుంబం ఎక్కడుంది ? మీరు తప్ప, నన్ను నా కుటుంబానికి కలపాలని ప్రయత్నించి మీరు నష్టపోయి, ఉద్యమానికి నష్టం చేయవద్దు అని చెప్పిన నిజమైన కార్మికవర్గ పుత్రుడు. ఏనాడు స్థాయి, హోదాల గురించి ఆలోచించేవాడు కాదు. బాధ్యతలను సరిగా నిర్వర్తించలేనపుడు తనకు తానుగా తప్పుకోవటం మేలు అని ఆచరణలో రుజువు చేసిన నిజాయితి కలిగిన కార్యకర్త. వెనుకబడిన ఆదివాసి రైతాంగ నేపథ్యం నుండి వచ్చినా పీడిత ప్రజల పక్షాన చివరి వరకూ నిలబడి పోరాడడానికి అది ఆటంకం కాదని మరొక్కమారు నిరూపించాడు.

**(తరువాయి భాగం 28వ పేజిలో)**

అమరుల చరిత్ర

# దోపిడీ వర్గాలకు దుస్వప్నమై, అణగారిన శ్రామిక వర్గాలకు ఆప్తుడై, నాయకుడై వీరమరణం పొందిన కామ్రేడ్ సంజీవ్(డుంబ్రి)కు జోహార్లు !!

ఏప్రిల్ 4, 2014న కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్, మునగవలస గ్రామంలో కా॥ డుంబ్రి, కా॥ శ్యాంలు ఒక ఇంటిలో ఉన్నప్పుడు, పక్కా సమాచారంతో ఎస్.ఒ.జి పోలీసులు పట్టపగలే వారిపై దాడి చేసారు. ఆ సమయంలో అన్నం తింటున్న కా॥ డుంబ్రి పక్కనే ఉన్న తన స్టెన్‌ను తీసుకొని పోలీసులను వీరోచితంగా ప్రతిఘటించాడు. పిరికిపందలు పోలీసులు కా॥ డుంబ్రిని ఒక్కడిని చేసి చుట్టుముట్టి గంటకు పైగా కాల్పులు జరిపి హత్య చేసారు. పోలీసులు చేసిన అకస్మాత్ దాడి మొదటగా కా॥ శ్యాం పైనే కావడంతో ఆయన తన సహచరుడిని అలర్ట్ చేసి తుపాకీ అందుకునే లోపే, పోలీసులు కాల్చిన మొదటి తూటాకే వీరమరణం పొందాడు. ఈ కార్మిక వర్గ ప్రజాయోధులిద్దరు పీడిత ప్రజల విముక్తి కోసం తను ప్రాణాలను ఫణంగా పెట్టి మన మార్గాన్ని మరింత తేజోవంతం చేసారు.



కా॥ డుంబ్రి అసలు పేరు సంజీవప్ప. కా॥ సంజీవప్ప మూడున్నర పదుల సంవత్సరాల క్రితం అనంతపూర్ జిల్లా, కంబదూర్ మండలం, గూల్యం గ్రామంలో ఒక అత్యంత పేద, దళిత, వ్యవసాయ కూలి కుటుంబంలో జన్మించాడు. సహజంగా గ్రామీణ ప్రాంతంలో ఉండే వ్యవసాయ కూలి కుటుంబాలు ఎదుర్కొనే కటిక దరిద్రం, భూస్వాముల దోపిడీ, పీడనలు సంజీవ్ కుటుంబం కూడా ఎదుర్కోవడంతో సంజీవ్‌కు పెద్దగా చదువుకొనే అవకాశం దొరకలేదు. కొద్దిపాటి చదువు మాత్రమే లభ్యమైంది. కుటుంబ జీవనం కోసం చిన్నప్పటి నుండి కూలి పనులు చేస్తూ వచ్చాడు. తను యువకుడిగా ఎదిగి తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకొంటున్న సమయంలో, జిల్లాలో ఉధృతంగా వస్తున్న వర్గపోరాట గాలులు ఆయనను తాకాయి. అంతే, అప్పటికే ఆయనలో రగులుతున్న వర్గ కసి ఆయనను విప్లవ బాట పట్టించాయి. ఆ సమయంలో వర్గపోరాటం బలంగా జరుగుతున్న రామగిరి ఏరియాకు పార్టీ సంబంధాల కోసం వెతుక్కుంటూ పోయాడు. అక్కడ ఆయనను ఒక దళారీ సంఘ నాయకుడు పార్టీ సంబంధాలు ఇప్పిస్తానని మోసం చేసాడు. పార్టీ సంబంధాలు ఇప్పిస్తానని సంజీవ్‌తో సంవత్సర కాలం పాటు తన ఇంటిలో వ్యవసాయ పనులన్నీ చేయించుకున్నాడు. సంజీవ్ మాత్రం పార్టీ సంబంధాల కోసం కళ్ళలో వత్తులేసుకొని చూస్తూ ఆ దళారీ సంఘ నాయకుడు చెప్పిన పనులన్నీ ఓపికగా చేస్తూ వచ్చాడు. చివరకు ఈ విషయం స్థానిక పార్టీకి తెలిసి సంజీవ్‌ను పిలిపించుకొంది. అది మొదలు తన తుది శ్వాస విడిచే వరకు సంజీవ్ మళ్ళీ ఎప్పుడూ వెనుదిరిగి చూడలేదు. ఏ శ్రామిక వర్గ విముక్తి కోసమైతే ఆయన కంకణం కట్టుకున్నాడో ఆ శ్రామిక వర్గ విముక్తి కోసం అహర్నిశలు పని చేసాడు.

1990ల చివరలో పార్టీలోకి వచ్చిన సంజీవ్ ప్రారంభంలో అనంతపురం జిల్లాలోనే పని చేసాడు. స్థానిక దళాలలో దళ సభ్యుడిగా ఉంటూ గ్రామీణ ప్రాంతంలో జరుగుతున్న సాయుధ వ్యవసాయక విప్లవ పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకు కృషి చేసాడు. 2000 సంవత్సరంలో వ్యూహాత్మక ప్రాంతాలైన తూర్పు కనుమలకు ఇతర ప్రాంతాల నుండి కొద్దిమంది కామ్రేడ్స్‌ను పంపాలని పార్టీ నిర్ణయం తీసుకొన్నది. ఈ నిర్ణయంలో భాగంగా గుంటూరు, అనంతపురం జిల్లాల నుండి కొద్దిమంది కామ్రేడ్స్‌ను పార్టీ ఎంపిక చేసింది. అట్లా ఎంపిక చేసిన వారిలో అనంతపురం జిల్లా నుండి కా॥ సంజీవ్ ఉన్నాడు.

సంజీవ్ మొదటగా అడుగు పెట్టింది వీరోచిత ఆదివాసీ సాయుధ రైతాంగ పోరాటం జరిగిన శ్రీకాకుళం జిల్లాలోనే. ఆ నాటికి శ్రీకాకుళ ఉద్యమం శత్రు సాయుధ దాడిని తీవ్రంగా ఎదుర్కొంటున్నది. ఈ దాడిని గెరిల్లా యుద్ధం ద్వారా తిప్పికొట్టడమనేది జిల్లా పార్టీ ప్రధాన కర్తవ్యంగా మారింది. ఈ పరిస్థితులలో మిలటరీ కర్తవ్యాలు నిర్వహించేందుకు అక్కడ ఏర్పరిచిన స్పెషల్ గెరిల్లా దళంలో సంజీవ్ సభ్యుడైనాడు. అప్పటి నుండి ప్రజావ్యతిరేకులపైనా, శత్రు సాయుధ బలగాల పైన చేసిన దాడులన్నింటిలో చురుగ్గా పాల్గొన్నాడు. లక్ష్మీపురం ఆంబుష్, ఉప్పలాడ రెయిడ్‌లతో పాటు కోపర్‌డంగ్ ఎన్‌కౌంటర్‌కు కారకుడైన నరహంతకుడు సి.ఐ గాంధీని ఖతం చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించాడు. ఆ కాలంలో పార్టీలో పని చేసి శత్రువు ముందు మోకరిల్లిన లోతా తమ్మారావు విప్లవోద్యమానికి పెద్ద పీడగా మారాడు. వాడి పీడను వదిలించుకునేందుకు ఎస్.జడ్.సి నేతృత్వంలో ఒక యాక్షన్ టీంను ఏర్పరిచారు. ఈ యాక్షన్ టీం లోకి మిలటరీ చర్యల్లో చురుగ్గా ఉన్న సంజీవ్ ఎంపికయ్యాడు. ఈ టీం విజయనగరంలో పోలీసుల రక్షణలో ఉంటున్న తమ్మారావుపై దాడి చేసి ఖతం చేసింది. ఈ

చర్య విప్లవ ప్రజానీకంలో గొప్ప ఉత్సాహాన్ని నింపింది. అప్పటి నుండి 2 సంవత్సరాల పాటు యాక్షన్ టీంలో సభ్యుడిగా పని చేసాడు. ఈ కాలంలో అనకాపల్లి-చోడవరం జంట రెయిడ్లు, కోరాపుట్ మల్టీ రెయిడ్, ఇంకా కొన్ని మిలటరీ చర్యలలో పాల్గొన్నాడు. ముఖ్యంగా కోరాపుట్ మల్టీ రెయిడ్‌లో తన కృషి ప్రధానమైందనే చెప్పాలి. ఎందుకంటే ఆ రెయిడ్ నిర్వహణలో భాగంగా సన్నాహాలు చేసేందుకు ముందు నుండే పట్టణంలో తన మకాంను ఏర్పరచుకున్నాడు. ఈ పనికి అవసరమైన సామర్థ్యాలన్నింటిని పట్టుదలతో నేర్చుకున్నాడు. ఒడియా భాష కూడా నేర్చుకున్నాడు. డ్రైవింగ్ నేర్చుకునేందుకు కృషి చేసాడు. ఆయనకు ఆనాడు ఒకటే లక్ష్యం ఉంది. అది శత్రు సాయుధ బలగాలపై దాడి చేసి ఆయుధాలు తెచ్చి మన పి.ఎల్.జి.ఎను సాయుధం చేయడమే. అందుకే ఆపనిలో పూర్తిగా నిమగ్నమై ఆ మల్టీ రెయిడ్ విజయవంతం అయ్యేలా కృషి చేసాడు. ఈ చర్య తరువాత 2005లో కా॥ సంజీవ్‌ను పార్టీ, ఆర్గనైజేషన్ పనిలోకి పంపింది. ఆ నాటికి బాసధార ప్రాంతం ఎ.ఒ.బి జోన్‌లో భాగంగా ఉండటం వలన సంజీవ్‌ను బాసధార పంపింది. అయితే ఆ నాటికి అక్కడ బాధ్యుడిగా ఉన్న సవ్యసాచిపండ ఆలోచనలు, పని విధానం సంజీవ్‌కు గిట్టలేదు. ముఖ్యంగా పండాలో ఉన్న ప్రాంత, భాష దురాభిమానాలు, బ్యూరాక్రటిక్ పని విధానం సంజీవ్‌ను బాగా కలతకు గురి చేసాయి. ఇలాంటి వాడు మన పార్టీలో నాయకత్వ స్థానంలో ఉండటం సంజీవ్‌కు భరింపశక్యంగానిదైంది. ముఖ్యంగా పెట్టిబూర్జువా సంకుచిత, స్వార్థ భావాలను తీవ్రంగా ద్వేషించే సంజీవ్ పండాపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, పార్టీకి ఒక ఉత్తరం పెట్టి అక్కడనుండి వచ్చేసాడు. మళ్ళీ బాసధరకు వెళ్ళేందుకు సిద్ధపడలేదు. దీంతో పార్టీ ఆయనను కోరాపుట్ రెయిడ్‌లో స్వాధీనం చేసుకున్న ఆయుధాలను భద్రపరిచి ఇతర జోన్‌లకు పంపే బాధ్యత అప్పజెప్పింది. ఈ పనితో పాటు అక్కడ ఉద్యమం నిర్మించే బాధ్యత కూడా అప్పచెప్పింది. అప్పటికే సంజీవ్ ఎ.సి స్థాయికి ఎదిగి ఉండటంతో స్థానిక డి.సి.ఎమ్ గైడెన్స్‌లో నారాయణపట్న బ్లాక్‌లో ఉద్యమం నిర్మించే బాధ్యత చేపట్టాడు. ఆనాడు కా॥ సంజీవ్ వేసిన పునాదులే ఆ తరువాత నారాయణపట్న రైతాంగం నిర్వహించిన భూపోరాటానికీ, సాయుధ పోరాటానికి దోహద పడ్డాయి. కా॥ సంజీవ్ కోరాపుట్‌లో పని చేస్తున్నప్పుడే పెరిగిన ఆయన రాజకీయ స్థాయిని పార్టీ గుర్తించి డి.వి.సి.ఎమ్‌గా ప్రమోట్ చేసింది. ఆ తరువాత ఉద్యమ అవసరాల రీత్యా ఈస్ట్ డివిజన్‌కు బదిలీ అయ్యాడు. అక్కడ ఆర్గనైజేషన్ కర్తవ్యాలను నిర్వహిస్తునే తనకున్న మిలటరీ సామర్థ్యాన్ని ఉపయోగిస్తూ శత్రువును దెబ్బ తీసేందుకు తీవ్రంగా కృషి చేసాడు. 2007లో పార్టీ చేపట్టిన టి.సి.ఒ.సిని విజయవంతం చేసేందుకు గునికిరాళ్ళ ఆంబుష్‌లో అనుబంధ పనులను నిర్వహించే బాధ్యతలు చేపట్టాడు. శత్రువును తీవ్రంగా నష్టపరిచి సంచలనం సృష్టించిన బలిమెల ఆంబూష్‌లో ఒక అస్సాల్ట్ టీంకు కమాండర్‌గా ఉన్నాడు. ఈ క్రమంలోనే 2009లో పార్టీ దామన్‌జోడిలోని నాల్కోపై దాడి చేసి ఆయుధాలు, మందుగుండు స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఈ దాడికి సన్నాహాలు చేసేందుకు ఏర్పాటు చేసిన టీంలో మళ్ళీ సంజీవ్ ఎంపిక అయినాడు. ఈ దాడి విజయవంతం చేయడంలో ఆయన పాత్ర, కృషి అమోఘమైందనే చెప్పాలి. ఇట్లా ప్రత్యేక మిలటరీ కర్తావ్యాలు ముందుకొచ్చినప్పుడల్లా, సంజీవ్ పార్టీ మనసులో మెదిలేవాడు. ఈ క్రమంలోనే 2010లో సి.ఆర్.సి మొదటి కంపెనీకి సంజీవ్ బదిలీ అయ్యాడు. అక్కడ ప్లాటూన్ కమాండర్‌గా 2011 చివరిదాకా పని చేసాడు. ఈ కాలంలో శత్రువు చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ఎదుర్కోవడంలో తన కంపెనీ బలగాలను చురుగ్గా కదిలిస్తూ ప్రజలకు అండగా నిలబడ్డాడు. 2012 నుండి తిరిగి కోరాపుట్ జిల్లాలోని నందపూర్ ఏరియాలో ఆర్గనైజేషన్ బాధ్యతలను చేపట్టాడు. ఇక్కడ బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే శ్రామిక ప్రజలకు చేరువయ్యాడు.

సిమెంట్ ఫ్యాక్టరీ కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలను కదిలించి పొగ గొట్టాల నుండి దుమ్ము రాకుండా ఉండేందుకు పెట్టుబడిదారులను వప్పించి కట్టడి చేసాడు. ఇంకా కార్మికుల సమస్యలపైనా, కూరగాయల రైతుల గిట్టుబాటు ధరల సమస్యలపైనా, భూమి సమస్యలపైన పోరాటాలు నిర్వహించి శ్రామిక ప్రజలను వందలాది విప్లవ సంఘాలలో సంఘటిత పరిచాడు. ప్రజలతో ఆయన ఎంతగా కలిసిపోయి తాదాత్మ్యం చెందేవాడో వర్గ శత్రువు ఎడల అంతా కాఠిన్యతను ప్రదర్శించేవాడు. ఆయన ఏ పనిలో ఉన్నా ఆయనకు శత్రువుపై ఒక కన్ను ఉండేది. నందపూర్ ఏరియాలో ఆర్గనైజేషన్ బాధ్యతలు నిర్వహిస్తూనే 43 హైవేలో శత్రువు బలహీనతలు గమనించి రాళ్ళగడ్డ వద్ద ఆంబుష్‌కు ప్రతిపాదన చేసాడు. ఆయన ప్రతిపాదనను దృష్టిలో వుంచుకొని 2013లో మన గెరిల్లా దళం చేసిన యాక్షన్‌లో 4గురు బి.ఎస్.ఎఫ్ పోలీసులు మట్టిగరిచారు.

కామ్రేడ్ సంజీవ్ పునాది వర్గాలకు చెందిన వాడు కావడం వలన ఆయనలో వర్గ కసి కణకణ మండుతుండేది. వర్గ శత్రువుకు వ్యతిరేకంగా చేయాల్సిన సాయుధ పోరాటాన్ని ఏ మాత్రం నీరుగార్చిన సహించేవాడు కాదు. నారాయణపట్నకు చెందిన లింగాలో వ్యక్తమైన మితవాద ఆలోచనలపై తీవ్రంగా స్పందించాడు. కా॥ సంజీవ్ పీడిత ప్రజల విముక్తే తన సర్వస్వంగా భావించాడు. అందుకు సాయుధ పోరాటమే ఏకైక మార్గంగా గుర్తించాడు. కేవలం ఆలోచనలకే పరిమితం కాకుండా ఆచరణలో వర్గ పోరాటానికి అనుగుణంగా తనను తాను మలుచుకునేందుకు అహర్నిశలు కృషి చేసాడు. ఈ కృషిలో భాగంగానే ఆర్గనైజర్‌గా, పోరాట యోధుడుగా, టెక్నిషియన్‌గా, కవిగా తనను తాను తీర్చిదిద్దుకున్నాడు. ఇంకా శ్రమను ప్రేమించడం, శ్రమ చేయడం, కార్మిక వర్గ జీవనశైలి, ప్రజల కష్టాలకు కరిగిపోవడం, శత్రువుకు పిడిగుద్దులు కురిపించే అరివీర భయంకరుడిగా ప్రత్యక్షం కావడం ఈ లక్షణాలన్నీ రంగరించిన వ్యక్తిత్వమే కా॥ సంజీవ్. అయితే గతి తార్కికంగా చూసినప్పుడు ఎంత గొప్ప కమ్యూనిస్టులోనైనా కొన్ని బలహీనతలు, లోపాలు ఉంటాయి. కా॥ సంజీవ్‌లో పైన చెప్పిన కార్మిక వర్గ లక్షణాలు అనేకం ఉన్నప్పటికీ సెక్టేరియనిజం ఆయన శక్తిని బలహీన పరుస్తూ వెంటాడుతూ వచ్చింది.

అమరుల చరిత్ర

# సిక్కోలు పోరుగడ్డ ఉద్యమాల ఉద్దానంలో విరబూసిన పోరుమొగ్గ కామ్రేడ్ శిరీష (అన్నపూర్ణ) కు విప్లవ జోహార్లు !

**"శ్రీకాకుళంరా వీర శ్రీకాకుళంరా**
**వీరయోధులనే కన్న గడ్డ వీర శ్రీకాకుళంరా**
**అదిగదిగో అటుచూడు అదేనంట ఉద్దానం**
**ఉద్దానం కాదరా ఉద్యమాల వనంరా"** అవును అటువంటి ఉద్యమాల పోరుగడ్డ అయిన ఉద్దానం ప్రాంతంలో 30సం॥ల క్రితం వీరయోధులకు జన్మించిన అక్కుపల్లి గ్రామంలో కా॥ శిరీష (అన్నపూర్ణ) పురుడు పోసుకుంది. గత శ్రీకాకుళ సాయుధ పోరాటంలో 11మంది అమరులకు జన్మనిచ్చిన బొడ్డపాడు గ్రామం ఆదర్శంగా నిలువగా నేడు ఆ వారసత్వాన్ని అక్కుపల్లి గ్రామం నిలబెట్టుకుంది. ఇప్పటికే ఆ గ్రామంలో మడ్డు ధనరాజు, శాంతమూర్తి, పిన్నాసి మోహనరావు, రామకృష్ణ (విజయ్) దివ్య (రాజేశ్వరి)లు ఈ నేలతల్లి విముక్తి కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి ఉన్నారు. 1998 సం॥రం ఆగష్టులో కోపర్‌డంగ్ గ్రామం దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ వీరమరణం పొందిన కా॥ కమలక్క స్వయాన కా॥ శిరీషకు జన్మనిచ్చిన మాతృమూర్తి కావడం విశేషం. తన తండ్రి కూడా 25సం॥లకు పైగా విప్లవోద్యమంలో వివిధ స్థాయిలలో పనిచేసి చివరకు వ్యక్తిగత బలహీనతల రీత్యా శత్రుముందు లొంగిపోయాడు. మొత్తంగా చూసినప్పుడు కా॥ శిరీష చిన్నప్పటినుండి విప్లవ భావాలతో పుట్టి పెరిగింది. విశాఖపట్నం టౌన్‌లో తన మేనత్త దగ్గర వుంటూ ఇంటర్మీడియట్ వరకు చదువుకుని బూర్జువా చదువులకు స్వస్తి చెప్పి విప్లవ పాఠాలు నేర్చుకోవడానికి అడవికి పయనమయ్యింది. తనను ఎంతగానో ప్రేమించిన మాతృమూర్తి ఆదర్శాలను గుండెలకద్దుకొని, అప్పటి వరకు విప్లవోద్యమంలో కొన్నసాగుతున్న తన తండ్రిని కూడా స్ఫూర్తిగా తీసుకొని 2000 సం॥లో తను పూర్తికాలం విప్లవ కార్యాచరణలో భాగమవుతూ కఠినమైన గెరిల్లా జీవితాన్ని ఎంచుకొని మల్కనగిరి డివిజన్‌లో పునాదులు వేసుకుంది.

తను పుట్టి పెరిగిన పట్టణ జీవితానికీ, తను ఎంచుకున్న కఠినమైన విప్లవ గెరిల్లా జీవితానికి మధ్య బోలెడంత వత్యాసం ఉన్నప్పటికి ఇక్కడ ప్రజల నిష్కల్మషమైన జీవితాలు, తోటి మనుషులను ప్రేమించే వాళ్ళ మనస్తత్వం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయి. షావుకార్ల దోపిడి, పాలక వర్గాల నిర్లక్ష్యం మూలంగా ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన దారిద్ర్యాన్ని చూసి తన కర్తవ్యానికి మరింత పదును పెట్టుకుంది. అందుకే తన గెరిల్లా జీవితంలో అనేక అటుపోటులు ఎదురైనప్పటికీ రాజకీయ చైతన్యంతో వాటిని అధిగమిస్తూ చివరి రక్తం బొట్టు వరకు తను విప్లవోద్యమంలోనే కొనసాగాలని దృఢంగా నిశ్చయించుకొని ప్రజలే గురువులుగా భావించి వాళ్ళ దగ్గర నుండి జీవిత సత్యాలు నేర్చుకోవడానికి తీవ్రంగా కృషి చేసింది.

విప్లవోద్యమంలో గెరిల్లా జీవితం చాలా కఠినమైనదని



గుర్తిస్తూ నిరంతరం తనకు తానుగా ఆ కఠినమైన పరిస్థితులను ఎదుర్కొనే విధంగా సన్నద్ధం కావడంలో భాగంగా నిరంతరం రాజకీయ అధ్యయనంపై కేంద్రీకరించడంతో పాటు మిలటరీ విషయాలపై దృష్టిపెట్టి నేర్చుకోవడానికి ప్రయత్నం చేసేది. పార్టీ కూడా తనను గెరిల్లా సైనిక యోధరాలుగా తీర్చిదిద్దడం కోసం చేసిన ప్రయత్నాల్లో భాగంగా 2001లో మల్కనగిరి డివిజన్‌లో జరిగిన మిలటరీ క్యాంపులోనూ, 2003లో ఈస్ట్ డివిజన్‌లో జరిగిన మహిళా మిలిటరీ క్యాంపులోనూ, విద్యార్థిగా పాల్గొనే అవకాశం కల్పించింది. ఇలా తనకు దొరికిన అవకాశాలను ఉపయోగించుకొని మిలటరీ టెక్నిక్స్‌ను, జ్ఞానాన్ని పొందుతూ తన పునాదిని మరింత పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నించింది.

'శత్రు ఆయుధాలతో పి.యల్.జి.ఎను సాయుధం చేద్దాం' అనే మన కేంద్రకమిటీ ఇచ్చిన కర్తవ్యాన్ని అమలు చేయడంలో భాగంగా 2001సం॥లో కలిమెల, మోటు జంట పోలీసు క్యాంపులపై జాయింట్ ఆపరేషన్ నిర్వహించాలని మన పార్టీ ప్లాన్ చేసింది. ఈ జంట రెయిడ్స్‌ను విజయవంతం చేయడంలో భాగంగా వచ్చే అదనపు బలగాలను అడ్డుకోవడం కోసం ఏర్పాటు చేసుకున్న అంబుష్ టీంలో తను కూడా సభ్యురాలిగా పాల్గొన్నది. ఈ జంట రెయిడ్స్‌లో ఒకటి విజయవంతం కాగా మరొకటి మన స్వీయ తప్పిదం మూలంగా విఫలమయ్యింది. అయినప్పటికీ ఈ ఘటనలు తనను ఎంతగానో ఉత్సాహపర్చినాయి.

2001 నుండి 2002 సం॥ వరకు పప్పులూరు

ఏరియాలో దళ సభ్యురాలుగా ఉంటూ ఆ ప్రాంతంలో ఉన్న కొండరెడ్డి ప్రజలకు డాక్టర్‌గా సేవలందించింది. అలాగే తనతో ఉంటున్న తనతోటి ఆదివాసీ కామ్రేడ్స్‌కు చదువు చెప్పడంతో పాటు జనరల్ అవేర్‌నెస్ కల్పించడం కోసం తీవ్రంగా ప్రయత్నం చేసేది. విద్యార్థులకు బోధించే పద్ధతులను నేర్చుకోవడం కోసం తను కొద్ది రోజులు టీచర్ ట్రైనింగ్ పొందుతూ నేర్పించడంలో ఉండే మెలకువలను తెలుసుకొని వాళ్ళ మాతృభాష అయిన కోయలో నేర్పించడం కోసం కృషి చేసింది.

2003 సం॥లో పార్టీ అవసరాల రీత్యా కా॥ శిరీషను కలిమెల దళంకు ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ ప్రాంతంలో జరుగుతున్న వర్గపోరాటాన్ని అర్థం చేసుకోవడానికి కృషి చేస్తూనే, ప్రజలు ఎదుర్కొంటున్న దైనందిన సమస్యలపై లోతుగా అధ్యయనం చేస్తూ సమస్యలకు పరిష్కారం సాయుధ పోరాటమే తప్ప మరో మార్గం లేదని తను నేర్చుకున్న వర్గ రాజకీయాలను ప్రజలకు భోదించడంలో నిరంతరం కృషి చేసేది. అప్పటికీ ఈ ప్రాంతంలో పాలక వర్గాల నిర్లక్ష్యం, షావుకార్ల దోపిడితో పాటు ప్రకృతి వైపరీత్యాల మూలంగా ప్రజలు తీవ్రమైన కరువు కొరల్లో చిక్కుకొని ఉన్నారు. పై పరిస్థితికి దోపిడి వర్గాలే కారణమని ఎండగడుతూనే మరోవైపు ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ గొడౌన్స్‌పై కరువు దాడులు చేయాలని పార్టీ నిర్ణయంలో భాగంగా వందలాది ప్రజలను సమీకరించి బెజ్జింగివాడ, గంపకొండ, పప్పులూరూ గ్రామాల్లో ఉన్న గొడౌన్స్‌పై దాడులు చేసి వందలాది బియ్యం బస్తాలను పంపిణీ చేసి తాత్కాలికంగా ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేసింది. అలాగే ఈ ప్రాంతంలో శత్రువు కొనసాగిస్తున్న అణచివేత దాడులను, ప్రజలు ఎదుర్కొంటున్న మౌళిక సమస్యలను ప్రచారం చేయడం కోసం స్క్రీన్ ప్రింటింగ్‌ను నేర్చుకోని వివిధ సమస్యలపై కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేయటానికి పూనుకుంది.

2004 సం॥లో పార్టీ తనను పొట్టేరు దళంకు ట్రాన్స్‌ఫర్ చేసి ఆ దళం డిప్యూటి కమాండర్ బాధ్యతలు అప్పగించింది. పార్టీ తనపై విశ్వాసంతో అప్పజెప్పిన బాధ్యతలను మనస్ఫూర్తిగా స్వీకరించి ఆ ప్రాంతంలో ఉద్యమ నిర్మాణానికి కృషి చేస్తూనే డిప్యూటి కమాండర్‌గా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడానికి తోటి కామ్రేడ్స్ సహకారం తీసుకుంటూ తనకు తెలియని విషయాలను వాళ్ళ ద్వారా నేర్చుకోవడానికి ప్రయత్నం చేసేది. ఈ ప్రాంతంలో ప్రజలపై పెత్తనం చెలాయిస్తున్న బి.జె.పి గుండాలను, పోలీసు ఇన్‌ఫార్మర్స్‌ను కంట్రోల్ చేయడంలో భాగంగా తాడిగూడ గ్రామంపై దాడి చేసి కొద్ది మంది బి.జె.పి గుండాలను దేహశుద్ధి చేసి తీవ్రంగా హెచ్చరించింది. ఇలా ప్రజలతో నిరంతరం కలసి ఉంటూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పార్టీ పంథా వెలుగులో పరిష్కారాలు చూపెట్టేది. మరోవైపు ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం తన సిద్ధాంత అధ్యయానాన్ని మెరుగుపరుచుకుంటూ తన చైతన్యాన్ని, శక్తి సామర్థ్యాలను పెంచుకునేందుకు కృషి చేసింది.

తనలో కొనసాగుతున్న పాజిటివ్ అంశాలను దృష్టిలో పెట్టుకొని 2005 సం॥రం పార్టీ తనను ఎ.సిలోకి ప్రమోట్ చేసింది. పార్టీ తనపై విశ్వాసంతో ఇచ్చిన బాధ్యతను ఆనందంగా స్వీకరించి ఆ ప్రాంత ఉద్యమంలో మరింత మమేకం కావడానికి కృషి చేసింది. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారాల కోసం ప్రజలను సంఘటితం చేసింది. ముఖ్యంగా తునికాకు, వేరుశనగల గిట్టుబాటు ధరల కోసం పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆ పోరాటాలు విజయవంతం కావడానికి కృషి చేసింది. పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించకుండా ఆ ప్రాంత ప్రజలతో ఆటలాడుకుంటున్న షావుకార్లను తీవ్రంగా హెచ్చరిస్తూనే 2007 సం॥లో 72 నెంబర్ క్యాంపు షావుకార్ల ఇండ్లపై సుమారు 1000 మంది ప్రజలను కదిలించి దాడులు చేస్తూ అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచి పెట్టింది.

2008 వ సం॥ కాలంలో శత్రువు తీవ్రమైన నిర్బంధాన్ని డివిజన్‌పై అమలు జరుపుతూ ప్రజలు పోరాడి సాధించుకున్న విజయాలను వమ్ము చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఈ పరిస్థితిలో శత్రువును ఎదుర్కొనకుండా మనం ముందుకు సాగలేని పరిస్థితి ఏర్పడటంతో డివిజన్ కమిటీ నిర్ణయం మేరకు టి.సి.ఓ.సి క్యాంపెయిన్‌ను కొనసాగించారు. ఈ క్యాంపెయిన్‌లో కా॥ శిరీష కూడా భాగస్వామి అవుతూ తెల్లరాయి దగ్గర మనం పెట్టుకున్న ఆంబుష్ సైట్‌కు శత్రువును రప్పించడం కోసం 45 క్యాంపు దగ్గరలోఉన్న బి.జె.పి నాయకుడి ఇంటిపై కరువు దాడి చేయాలని కమిటీ నిర్ణయంలో భాగంగా వందలాది ప్రజలను సమీకరించి ఆ ఇంటిపై దాడి చేసింది. మనం ఊహించిన విధంగానే శత్రువు మన అంబుష్ సైట్‌లో చిక్కుకున్నాడు. మైన్‌ప్రూఫ్ వెహికల్‌ని పేల్చి వేయడంతో దానిలో ఉన్న యస్.ఓ.జి పోలీసులు కుక్కచావు చావగా 6 ఎ.కె47 రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నాం. అలా ఈ క్యాంపెయిన్ విజయవంతం కావడానికి తన వంతు కృషి చాలా ఉంది.

2008వ సం॥ నుండి 2010 వరకు పప్పులూరు ఏరియాలో కమాండర్ బాధ్యతలు చేపట్టింది. ఆ ప్రాంతంలో ఉన్న కొండరెడ్ల సమస్యపై ప్రజలను సంఘటితం చేస్తూ వాళ్ళ అభిమానం చూరగొనే విధంగా కృషి చేసింది. ముఖ్యంగా ఏ.పిలో ఆదివాసులైన కొండరెడ్లను ఒడిశా ప్రభుత్వం యస్.టిలుగా గుర్తించకుండా వెనుకబడిన కులాల జాబితాలో కలపడం మూలంగా ప్రభుత్వ పరంగా వాళ్ళు ఎటువంటి రాయితీలు పొందలేని పరిస్థితి ఉంది. ఈ విషయంలో ప్రజలను చైతన్యవంతం చేస్తూ దోపిడి వ్యవస్థను సమూలంగా నాశనం చేసి సమసమాజం స్థాపించినప్పుడే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయనీ విస్తృతంగా ప్రచారం చేస్తూనే కొండరెడ్ల కులాన్ని యస్.టిలుగా గుర్తించాలనే న్యాయమైన డిమాండ్‌తో వేలాదిమంది ప్రజలను కదిలించి కలిమెల, మల్కనగిరి టౌన్ సెంటర్స్‌లో ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించే విధంగా కృషి చేసింది. ఈ విధంగా ప్రజలను వివిధ సమస్యలపై కదిలిస్తూ చురుకుగా ఉన్న వాళ్ళను

వర్గ సంఘాల్లో సంఘటితం చేస్తూ గ్రామస్థాయి ఆర్.పి.సినిర్మాణం ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల విశ్వాసం చూరగొన్నది.

2004 సం॥లో తన తండ్రి ఉద్యమంకు ద్రోహం చేసి పారిపోవడం తనను ఎంతగానో కలిచి వేసింది. ముఖ్యంగా తండ్రిలో పొడ చూపిన తప్పుడు ధోరణుల మీద తను కూడా ఎంతగానో ఫైట్ చేసింది. ఆయనలో అణువణువునా పొడచూపిన పితృస్వామ్య భావజాలం మూలంగా కా॥ శిరీషను ఏనాడు రాజకీయ కార్యకర్తగా గుర్తించకుండా పితృస్వామ్య భావజాలంతో తన మీద పెత్తనం చెలాయించటానికి ప్రయత్నం చేసేవాడు. ఈ విషయంలో కా॥ శిరీష ఎల్లప్పుడు తండ్రితో ఘర్షణ పడేది. తన తండ్రి ఉద్యమం నుండి పారిపోయినప్పుడు తాత్కాలికంగా కొంత ఇబ్బంది పడినప్పటికీ మరల తొందరలోనే బయట పడుతూ ఉద్యమంలో మరింత క్రియాశీలకంగా భాగస్వామ్యం కావటానికి ప్రయత్నించింది.

కా॥ శిరీషకు ఏ పని అప్పజెప్పిన తొందరలోనే ఆ పనిలో నైపుణ్యం సంపాదించేది. ఈ విషయాన్ని పార్టీ దృష్టిలో పెట్టుకొని యస్.జడ్.సి నాయకత్వం కింద పని చేస్తున్న ప్రొటక్షన్ దళంలోకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ కంప్యూటర్ ఆపరేటింగ్ బాధ్యతలను అప్పగించింది. ఈ పనిలో ఉన్న టెక్నికల్ అంశాలను చాలా తొందరగా నేర్చుకొని జోనల్ కమిటీ నిర్వహించే ప్రెస్ విభాగంలో ఒక ముఖ్యమైన ఆధారపడే వ్యక్తిగా అభివృద్ధి అయ్యింది. నిరంతరం పని చేయడం ఆమె ప్రత్యేకతగా చెప్పుకోవాలి. ఎ.ఒ.బి సమాచార పత్రిక అయిన "బోల్షివిక్" (2013 జనవరి నుండి జూన్ వరకు) మొదటి బులిటెన్ ఆమె సహకారంతో తీసుకొని రాగలిగాం. ఈ పత్రికను బయటకు తేవడంకోసం ఆమె కృషి చాలా ప్రధానంగా చెప్పుకోవాలి. రెండవ బులిటెన్‌లో మెజారిటీ భాగం ఆమె కృషి ద్వారానే పూర్తి అయింది.

2003 సం॥లోనే డివిజనల్ కమిటీ మెంబర్‌గా కొనసాగుతున్న భగత్‌ను ప్రేమించి జీవిత సహచరుడుగా ఎన్నుకుంది. ఈ విషయంలో తన తండ్రి సీరియస్‌గా వ్యతిరేకించినప్పటికీ తను ఏ మాత్రం వెనకకు తగ్గకుండా తన ఇష్టంతోనే తన జీవిత సహచరున్ని ఎన్నుకుంది. తన జీవిత సహచరుడుగా ఎన్నుకున్న భగత్‌లో కొన్ని పాజిటివ్ అంశాలు ఉన్నప్పటికీ ముఖ్యంగా ఆయనలో సీరియస్‌గా కొనసాగుతున్న పితృస్వామిక ధోరణి మూలంగా నైతికపరంగా అనేకసార్లు తప్పుల్లో కురుకుపోవడం, పార్టీ ఆయనను సరిదిద్దడం కోసం అనేకసార్లు హెచ్చరిక తీర్మానాలు, చర్యలు తీసుకుంది. ఈ విషయంలో కా॥ శిరీష కూడా ఘర్షణకు గురైంది. ఆయన తప్పుడు భావాల మీద పోరాటం చేస్తూనే తనతో పాజిటివ్ సంబంధాలు కల్గిఉండే విధంగా ప్రయత్నం చేసింది. అయినప్పటికీ ఆయనలో మూర్తీభవించిన పితృస్వామ్య భావాల మూలంగా మరింత నైతికపరమైన సమస్యలలో కూరుకుపోతూ చివరకు దళంలో పని చేస్తున్న వేరే మహిళా కామ్రేడ్‌ను తీసుకొని పారిపోయాడు. ఈ సంఘటన కా॥ శిరీషను నిజంగా షాక్‌కు గురి చేసింది. చాలా రోజులు ఘర్షణ పడుతూనే పార్టీ, తోటి కామ్రేడ్స్ ఇచ్చిన సహకారంతో బయటపడుతూ మరల ఉద్యమ కర్తవ్యాలలో నిమగ్నమైంది.

కా॥శిరీష తన చిన్న వయసులోనే 14 సంవత్సరాల క్రితం అతిపెద్ద సామాజిక మార్పు బాధ్యతను చేపట్టింది. ఇటువంటి గొప్ప బాధ్యతను చేపట్టడం వేరు, ఆ బాధ్యతలను తుది శ్వాస వరకు కొనసాగించడం వేరు. తుదిశ్వాస వరకు ఎవరైతే ప్రజల కోసం, విప్లవం కోసం జీవిస్తారో వారే నిజమైన విప్లవకారులు, కమ్యూనిస్టులు. కా॥శిరీష ఈ కోవకు చెందినదే. అయితే ఆమెలో ఏర్పడిన ఈ ఔన్నత్యం సీదా సాదాగా ఏర్పడలేదు. ప్రజల కోసం జీవించాలనే నిర్ణయం తీసుకున్న దగ్గర నుండి తన పాత భావాలపై ముఖ్యంగా పెటిబూర్జువా భావాలపై ఎడతెగని పోరాటం చేస్తూ తనని తాను కమ్యూనిస్టుగా మలుచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. మరోవైపు సమాజమార్పు కోసం జరుగుతున్న సాయుధ వర్గపోరాటంలో పూర్తిగా మమేకమైంది. ఈ వర్గ పోరాటం కార్యాచరణ ఆమెను ఒక దృఢమైన కమ్యూనిస్టు కార్యకర్తగా, నాయకురాలిగా మలిచింది. ఆమె విప్లవ జీవితం అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, విప్లవ భావాలలో, కార్యాచరణలో స్థిరత్వం ఏర్పడి అభివృద్ధి కోసం ఒక మలుపు తిరుగుతున్న సమయంలో, పార్టీలో ఒక సైకో (పిచ్చి) చేసిన కాల్పులలో కా॥శిరీష చనిపోవటం ఉద్యమానికి, పీడిత ప్రజలకు ఎనలేని నష్టాన్ని కల్గించింది.

¦

---

**(23వ పేజి తరువాయి భాగం)**

37 ఏళ్ల సుదీర్ఘ విప్లవ జీవితం, అపార అనుభవం, పార్టీపై అచంచలమైన విశ్వాసం, అంకిత భావం, క్రమశిక్షణ, కలిగిన కా॥నరేందర్ ఉద్యమ అవసరాల రీత్యా కోరాపుట్-శ్రీకాకుళం డివిజన్ నందపూర్ ఏరియాలో కా॥ శ్యాం పేరుతో పనిచేస్తున్న క్రమంలో శతృవు దొంగదెబ్బకు నేలకూలాడు. కా॥నరేందర్ అమరత్వం ఏఒబి ఉద్యమానికి తీరని లోటు. కా॥ నరేందర్ అసంపూర్తిగా వదిలి వెళ్ళిన ఉద్యమ కర్తవ్యాలను నెరవేర్చడమే ఆ కార్మికవర్గ యోధుడికి మనమిచ్చే నిజమైన నివాళి.

¦

# పోరాట వార్తలు

**ఈస్ట్ డివిజన్**

## పోలీసుల ప్రలోభాలకు ప్రభావితులై పార్టీ, ప్రజలు ఇచ్చిన ఎన్నికల బహిష్కరణ పిలుపును బేఖాతరు చేసి ఏకగ్రీవం ముసుగులో పదవులు పంచుకున్న ఇంజెరి పంచాయితీ సర్పంచ్, పెత్తందార్లకు దేహశుద్ధి : (ఫిబ్రవరి 2014)

2013 పంచాయితీ ఎన్నికలను చురుగ్గా బహిష్కరించాల్సిందిగా కోరుకొండ ఏరియా వ్యాప్తంగా గ్రామ గ్రామాన, మండల సెంటర్లలో మౌకికంగా, కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు ఇత్యాది వీలయినన్ని విధాలుగా విస్తృతంగా పార్టీ, ప్రజా సంఘ నిర్మాణాలు, మిలీషియా ప్రచారం చేసాయి. అదే సమయంలో ఆయా పంచాయితీలలో గతం నుండి ఎన్నికల్లో పాల్గొంటున్న వారినీ, పాల్గొనే అవకాశం ఉన్న వారిని దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాలలో ప్రత్యేక సమావేశాలు సైతం నిర్వహించాము. సుమారు 10 సంIIల నుండి ఇంజెరి పంచాయితీ సర్పంచ్‌గా కొనసాగుతున్న జక్కం గ్రామానికి చెందిన వంతల కామేశ్వరరావు, అనేక సార్లు పోటీ చేసి వార్డు మెంబర్, సర్పంచ్ పదవులు పొందేందుకు ప్రయత్నిస్తున్న మూలలోవ గేదేల సత్యారావు, ఇంజెరి పాకెట్‌లో మెజారిటీ గ్రామాలపై పెత్తనం సాగిస్తున్న గిన్నెగరువు గొల్లూరి మెహనరావుల గ్రామాలలో సమావేశాల సందర్భంగా వారికి ఏ.సి నుండి కూడా గుర్తింపజేయడం జరిగింది.

పార్టీ పిలుపునందుకొని అనేక గ్రామాలలో ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు. కొన్ని పంచాయితీలలో నామినేషన్లు సైతం వేయలేదు. కొన్ని చోట్ల వేసినవి ఉపసంహరించుకున్నారు. ఇంజెరి పంచాయితీలో కూడా ప్రజలు బహిష్కరించడంతో ఎన్నికలు జరగలేదు. ఇలా ఎన్నికలు జరగని చోట్ల సైతం తన యంత్రాంగాన్ని నిలుపుకునేందుకు శత్రువు ఎవరో ఒకరిని నిలబెట్టి ఏకగ్రీవం అనే పేరుతో, తన తొత్తులతో సర్పంచ్ వ్యవస్థను శిథిలమై పోకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అందులో భాగంగానే శత్రు ప్రలోభాలకు ప్రభావితులై, ధనాశ, పదవీ వ్యామోహంతో జక్కం కామేశ్వరరావు ఎమ్.పి.టి.సి అయ్యేందుకు, మూలలోవ సత్యారావు సర్పంచ్ అయ్యేందుకూ అంతర్గతంగా ఒప్పందం కుదుర్చుకొని, నామినేషన్లు వేసి సత్యారావు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు. గిన్నెగరువు మెహనరావు లక్షరూపాయలు పెట్టుబడి పెట్టి సత్యారావును సర్పంచ్‌గా గెలిపించేందుకు మద్ధతిచ్చి ఒకరకంగా వాళ్ళిద్దరు సర్పంచ్ పదవిని పంచుకున్నారు. సత్యారావు ప్రత్యక్ష సర్పంచ్, మెహన్‌రావు ఆ ప్రాంత పెత్తందారునిగా సత్యారావుని నడిపించే పరోక్ష సర్పంచ్. అంతే కాకుండా మోహనరావు ఇంజెరి పంచాయితీలో అనేక గ్రామాలలో వడ్డికీ డబ్బులిచ్చి లక్షలాది రూపాయల విలువ చేసే సారవంతమైన భూములను కాజేసి ఆ ప్రాంత భూస్వామిగా, పంచాయితీలు జరిపి, జరిమానాలు, పన్నులు కట్టించుకుంటూ ఆ ప్రాంత పెత్తందారుగా కొనసాగుతున్నాడు. జక్కం కామేశ్వరరావు స్థానిక పార్టీ వద్దని వారించినా వినకుండా మద్దిగరువు, ఇంజెరి రోడ్డు సబ్ కాంట్రాక్టు పొంది, రోడ్డు నిర్మాణంలో ప్రత్యక్ష పాత్ర వహిస్తున్నాడు. ఆ విధంగా వీరు దోపిడి ప్రభుత్వ ప్రతినిధులుగా, వినాశకర అభివృద్ధిని మోసుకొచ్చే ప్రజా వ్యతిరేకులుగా ఉంటున్నందున్న వీరిని పార్టీ, పి.యల్.జి.ఎ మద్ధతుతో పంచాయితీ ప్రజలు నిలదీసి వారు ఎంపిక చేసుకున్న న్యాయకమిటీ ఆధ్వర్యంలో ప్రజాకోర్టు నిర్వహించి, మోజారిటీ ప్రజల నిర్ణయం మేరకు దేహశుద్ధి చేసి హెచ్చరించి విడిచి పెట్టడం జరిగింది. పంచాయితీలోని 20 గ్రామాల నుండి సుమారు 600 మంది ప్రజలు పాల్గొని ఈ ప్రజా కోర్టును విజయవంతం చేసారు.

## చాపగడ్డ ఎ.పి.యఫ్.డి.సి గోదాములు, పల్పర్లపై దాడి : (జనవరి 2014)

మన్యంలో కాఫీ తోటల ఆక్రమణ పోరాటం మిలిటెంట్‌గా పురోగమిస్తున్నది. ఎ.పి.యఫ్.డి.సి పల్పర్‌లనీ, గోదాములనీ, ఇతర ఆస్తులని ద్వంసం చేసి ఎ.పి.యఫ్.డి.సిని ఒక్కో ఎస్టేట్ నుండి తరిమికొడుతూ ప్రజలు ముందుకు సాగుతున్నారు. ఆక్రమణ నూతన ఎస్టేట్‌లకు విస్తరిస్తున్నది. గతంలో తీములుబంద, లంకపాకల, పల్పర్‌లను ద్వంసం చేసి ఎ.పి.యఫ్.డి.సిని తరిమేయడంతో, అది ఆర్.వి నగర్, చాపుగడ్డ పల్పర్లపై ఆధారపడి, గూడెం పరిధిలో గల కాఫీని కూడా పల్పింగ్ చేస్తూ తన కర్యకలాపాలు కొనసాగిస్తున్నది. ఎ.పి.యఫ్.డి.సికి కీలకంగా ఉన్న ఈ పల్పర్‌ను కాపాడుకునేందుకు శత్రువు శత విధాల ప్రయత్నిస్తున్నాడు. ప్రతిరోజు పల్పర్ వద్ద లేదా దాని పరిసరాలలో మాటు గాస్తున్నాడు. ఆ రోజు (జనవరి 28) మధ్యాహ్నం వరకు కూడా పోలీసులు పహారా కాసారు. ప్రధాన, ద్వితీయ, పునాది బలగాల సమ్మేళనంతో ఒక పి.యల్.జి.ఎ యూనిట్ ఆ రాత్రికి దాడి చేసింది. ముందుగా పల్పర్ సముదాయాన్ని మన నియంత్రణలోకి తెచ్చుకుని, సిబ్బందిని అందరినీ ఒక చోట సమావేశపరిచి, దాడి నేపథ్యాన్ని వివరించాము. విధ్వంసానికి ప్రాధాన్యతనిచ్చి, యార్డుల్లోనున్న కాఫీని చాలా వరకు తగలబెట్టాము. రెండు పల్పింగ్ యూనిట్‌లనూ, గోదాములనూ పేల్చివేసాము. ఎ.పి.యఫ్.డి.సి ట్రాక్టర్‌ను షెడ్‌లను తగులబెట్టాము. మొత్తం 30 లక్షల వరకు ఆస్థి నష్టం జరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. నిరంతరం పోలీసు పహారాలో ఉంటున్న ఈ పల్పింగ్ సముదాయాన్ని ప్రజా ఇంటలీజెన్సీపై ఆధారపడి, సమయస్ఫూర్తితో దాడి చేసి ధ్వంసం చేయడంతో శత్రువు దిగ్భ్రాంతికి గురయ్యాడు. మన పి.యల్.జి.ఎ శ్రేణుల్లో, ప్రజల్లో ఉత్సాహం నెలకొంది. ఈ చర్య కాఫీతోటల ఆక్రమణ పోరాటాన్ని పురోగమింపజేస్తుంది.

## ప్రజావ్యతిరేకిగా మారి శత్రు పంచన చేరిన ఒనుబెరడ చిన్నారావు భూమి, ఇతర స్థిరాస్తులను స్వాధీనపర్చుకున్న స్థానిక గ్రామాల ప్రజలు : (ఫిబ్రవరి 2014)

కోరుకొండ ఏరియా పరిధిలోని ఒడిశా రాళ్ళగడ్డ పంచాయితీకి చెందిన ఒనుబెరడ గ్రామం వాడు ఈ తల్లె చిన్నారావు. వ్యక్తిగతంగా చెడు నడవడిక గలవాడు. మహిళలపట్ల అసభ్యంగా

ప్రవర్తించడం, అత్యాచారాలకు పాల్పడటం, యువకులతో గొడవ పడి కొట్టడం వంటివి చేసేవాడు. గంజాయి పంటతో లభించే లక్షల ఆదాయంతో పాటు వీడు నాటు తుపాకులు (బర్మార్లు) తయారు చేసి విక్రయించడం ద్వారా విపరీతమైన ఆదాయం లభించి ఆర్థికంగా బలపడ్డాడు. గ్రామ మునసబు స్వయాన వీడికి మామ కావడంతో వీడి ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. వీడి అరాచకాలు, గ్రామస్తులతో గొడవలు, కొట్లాటలు తీవ్రం కావడంతో ప్రజలు, ఆ గ్రామంలోని రైతుకూలీ సంఘం వీడి సమస్యను మన దృష్టికి తీసుకువచ్చారు. వీడి విషయంలో మూడుసార్లు ఆ గ్రామంలోనూ, ఆ పరిసర గ్రామాల ప్రజల సమక్షంలోనూ నిలదీయడం జరిగింది. ఆ సమావేశాల్లో తప్పులను అంగీకరించి, పద్ధతి మార్చుకుంటానని చెప్పిన వీడు ప్రజలందరిముందు నిలదీయడంతో అహం దెబ్బతిని, సంఘ కార్యకర్త అయిన వీడి అన్న పట్ల వ్యతిరేకతతో పొలం నుండి ఇంటికిపోయే దారిలో అడ్డుకొని విపరీతంగా కొట్టాడు. అంతేకాక మరొకరికి డబ్బిచ్చి తనను చంపించేందుకు తన అన్నయ్యే ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం చేసుకొని మన పార్టీ దృష్టికి కూడా తీసుకు వచ్చాడు. గ్రామ విప్లవ రైతుకూలీ సంఘం, స్థానిక పార్టీ కలిసి గ్రామ ప్రజలతో పూర్వాపరాలు విచారించి, వాడు చేస్తున్నది తప్పుడు ప్రచారంగా నిర్ధారించి, ప్రజలందరి ముందు తీవ్రంగా హెచ్చరించడం జరిగింది. దాంతో ఆ గ్రామ రైతు కూలీ సంఘం పట్ల వ్యతిరేకత పెంచుకొని రాత్రికి రాత్రే స్థానిక పోలీసు క్యాంపుకు పారిపోయి బి.యస్.ఎఫ్ బలగాలను వెంటపెట్టుకొని వచ్చి గ్రామంపై దాడి చేయించి మెజారిటీ గ్రామ కమిటీ కార్యకర్తలను, నాయకులను పట్టించాడు. అప్పటినుండి భార్యతో సహా శత్రువు వద్దనే ఉంటూ గ్రామాలపై శత్రువు చేస్తున్న దాడుల్లో ముందుండటం, సంతకు వెళ్ళే యువకులను గుర్తుపట్టి శత్రువుకు పట్టించడం చేస్తున్నాడు. కనుక వాడిని ప్రజా వ్యతిరేకిగా గుర్తించి ఆ గ్రామ, పరిసర గ్రామాల ప్రజలతో చర్చించి వాడి భూములను, ఆస్తులను ప్రజలు స్వాధీనపరచుకోవాలని నిర్ణయించాము. ఆహార ధాన్యాలను, ఇతర గృహోపకారాలను ప్రజలకు పంచిపెట్టేయగా 5 గొడ్లు, 5 మేకలు, పండించిన పసుపు వీటిని విక్రయించి అరెస్టయిన ఆ గ్రామ విప్లవ రైతుకూలీసంఘం కార్యకర్తల జైలు, కోర్టు ఖర్చులకు వినియోగించాలని ప్రజలు నిర్ణయించారు. వాడి భూములను వర్గ పంథాననుసరించి పంపిణీ చేయవలసి ఉంది. వాడి ఆస్తుల స్వాధీనం, పంపిణీ పూర్తయ్యాక ప్రజలు, మిలీషియా ఆగ్రహంతో దాడి చేసి వాడి ఇంటిని నేలమట్టం చేసారు.

## ప్రజా వ్యతిరేకి పోలీసు ఏజెంట్స్ అయిన పూజారి సన్యాసిరావు, ఆనంద్‌లకు ప్రజా కోర్టు తీర్పు: (జనవరి 2014)

ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ రోళ్ళగడ్డ పంచాయితీ ఈస్ట్ డివిజన్‌లో కోరుకొండ ఏరియా కమిటీ పరిధి. వీరిద్దరు గత మూడు సంాల నుండి పోలీసు ఏజెంట్స్‌గా, ఐ.టి.డి.ఎ వర్కర్స్‌గా (అభివృద్ధి పేరుతో) చలామణి అవుతూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పూజారి సన్యాసిరావు విశాఖ జిల్లా చింతపల్లి మండలం బలపం పంచాయితీ (ఆర్.జి కాత్తువురు) గ్రామానికి చెందినవాడు. వీడి కుటుంబం ఈ ప్రాంతంలో (4 గ్రామాలపై) పెత్తనం చెలాయించడం, భూములు ఆక్రమించుకోవడం, ప్రజల్ని వెట్టిచాకిరీ చేయించుకోవడం వుంటూ వస్తున్నది. వీడి కుటుంబం అరాచకాలను భరించలేక గత 2012లో వీడి అన్నను (గ్రామ మునసను) ప్రజలు అడ్డు తొలగించుకున్నారు. పూజారి సన్యాసిరావు చిన్నతనం నుండి రోళ్ళగడ్డ పంచాయితీ ధుళిపుట్ హాస్టల్‌లో చదువుతున్న క్రమంలో పార్టీ పరిచయం ఏర్పడి 2000 సంాలో రిక్రూట్ అయ్యాడు. గ్రామంలోనే ఆధిపత్య శక్తి కావడంతో, మన పార్టీలో కూడా క్రమశిక్షణని పాటించకపోవడం, తోటి కామ్రేడ్స్‌ని, ప్రజలని గౌరవించకపోవడం వుంది. గ్రామ మహిళలపట్ల, దళంలోకి కొత్తగా వచ్చిన మహిళలపట్ల అరాచకంగా ప్రవర్తించడంతో 2010లో పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంతో మన పార్టీపైన ద్వేషం పెంచుకొని పార్టీని, ప్రజల్ని వదిలి శత్రువు ముందు మోకరిల్లాడు. నాటి నుండి ప్రజా వ్యతిరేకమైన పనులు చేయడం జరుగుతున్నది. షావుకార్లనుండి, సేల్స్‌మ్యాన్‌ల నుండి పార్టీ పేరును ఉపయోగించుకొని డబ్బులు, బియ్యం, నాటు తుపాకులు గవర్నమెంట్ నుండి వచ్చే ఆదాయాన్ని మళ్లించుకొని తినడం చేస్తున్నాడు. ప్రజలకు వచ్చే ప్రతి ఆదాయంలో నా వాటా అంటూ ప్రజల్ని బెదిరించి కాజేయడం, బెదిరింపులకు లొంగని ప్రజల్ని మల్కనగిరి జిల్లా యస్.పి దగ్గర చెప్పి గ్రామాలకు నోటీసులు మోసుకురావడం, లొంగకుంటే చంపుతామని బెదిరించడం వంటివి చేస్తూ వస్తున్నాడు. గత సంాలోనే ప్రజాకోర్టు నిర్వహించి పద్ధతులను మార్చుకోవాలని హెచ్చరించడం జరిగింది. గత 3 సంారాల నుండి ఎస్.పి దగ్గర 8000, ఐ.టి.డి.ఎ నుండి నెలకు 5000 జీతం పొందుతూ వస్తున్నాడు. పైగా ప్రభుత్వ సంస్కరణలు ఈ ప్రాంతంలోకి తీసుకొని రావడంలో మొదటి వ్యక్తిగానే చెప్పుకోవాలి. ధూళిపుట్, సింగారం ప్యాకెట్స్ 18 గ్రామాల పరిధిలో జి.సి.సి బియ్యం మినహాయిస్తే ఈ ప్రాంతంలో ఈ 65 సంాల కాలంలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రజలు చూడలేదు. వీడి రాకతోటి ఉద్యమాన్ని నీరుగార్చడం కోసం ప్రజలలో ఒక సెక్షన్ చీల్చడంలో భాగంగానే ప్రభుత్వం నుండి వస్తున్న ఎంగిలి మెతుకులకు ఆశపడి ప్రజా ఉద్యమానికి తీరని నష్టం చేసాడు. జిల్లా యస్.పితో నిరంతరం కాంటాక్ట్‌లో ఉంటూ దళం వస్తే పొడిపొడి మాటలతో సరిపెట్టడం (డబుల్ ఏజెంట్‌గా) చేస్తున్నాడు.

పూజారి సన్యాసిరావు తయారు చేసుకున్న ఆనంద్ సరుకుబంద గ్రామంవాడు. ధూళిపుట్ మునసబు పూజారి సన్యాసిరావు, ఆనంద్ తండ్రి నర్సింగ్‌లు ఈ ప్రాంత 18 గ్రామాలకు ఆధిపత్య శక్తులుగా ప్రభుత్వ ఏజెంట్స్‌గా పోలీస్ మనుషులుగా చలామణి అవుతూ ప్రజల్ని బెదిరించి భూములు లాగేసుకోవడం, దళ కదలికల్ని చేరవేయడం, పార్టీ సానుభూతి పరుల వివరాలుసేకరించి శత్రువుకు అందించడం, లొంగిపోవాలంటూ నోటిసులు తీసుకొని రావడం చేస్తున్నాడు. సన్యాసిరావు లొంగుబాట్లు చేయిస్తుండగా, ఆనంద్ రహస్య నెట్‌వర్కుని తయారు చేయడం జరుగుతున్నది. వీడు నెలకు 8000 జీతం పొందుతూ, ఐ.టి.డి.ఎ నుండి 5000 జీతం తీసుకుంటున్నాడు. ముఖ్యంగా వీడు పోలీసులకు చాలా ముఖ్యమైన వాడిగాపని చేస్తున్నాడు. మన పార్టీకి ఏ మాత్రం అనుమానం కలిగినా వెంటనే వచ్చే విధంగా శత్రువు ఏర్పాటు చేసి ఉంచాడు. వీడిని కూడా గత సంారం ప్రజాకోర్టులో హెచ్చరించడం జరిగింది. అయినప్పటికీ వీరు పద్ధతులను

మార్చుకోకపోగా మరింత అరాచకంగా తయారుకావడం జరిగింది. గత మీటింగ్‌లో ఐ.టి.డి.ఎ పనులు వదులుకొని ఇంటి పనులు చేయించుకోవాలని, ఎక్కడా తిరగవద్దని ప్రజలు ఆంక్షలు పెట్టినా వాటిని లెక్క చేయకుండా తిరగడం, మళ్ళీ ఐ.టి.డి.ఎ పనులు ప్రజలు కావలంటున్నారని చెప్పి వాటిని అమలు చేయడం, దీని అనుబంధంగా దళం కదలికలు, మిలీషియా కదలికలను తెలుసుకోవడం, శత్రువుకు చేరవేయడం చేస్తూ వస్తున్నాడు. ఈ పనిలో భాగంగానే 3-2-2014 న ఐ.టి.డి.ఎ అధికారులతో కలిసి ఏరియాకు రావడం జరిగింది. అనుకోకుండానే దళానికి దారిలో తారసపడటంతో పట్టుకొని ఇంటరాగేషన్ చేయగా మనం అనుకున్న విధంగానే పోలీసు ఏజెంట్స్‌గా ఉన్నారని తేలింది. మరుసటిరోజు ప్రజాకోర్టు ఏర్పాటు చేస్తుండగానే 10గం॥ సమయంలో పార్టీకీ ప్రజలకు సీరియస్‌గా నష్టం చేసి సన్యాసరావు పారిపోయాడు. ప్రజల సమక్షంలో ఐ.టి.డి.ఎ అధికారులను పెట్టి వారి దగ్గర ఉన్న జి.పి.యస్ మొబైల్స్ స్వాధీనం చేసుకొని, రికార్డ్స్‌ని కాల్చివేయడం జరిగింది. ఈ అధికారులను ఈ ప్రాంతంలోకి రావద్దని హెచ్చరించడం జరిగింది. పూజారి సన్యాసిరావుకి ఏరియాలో ఎవరు సహాయం చేయవద్దని చెప్పి ఏరియా బహిష్కరణ చేయడం జరిగింది. ఆనంద్‌ని అడ్డు తొలగించుకోవడం మంచిది అని ప్రజలు భావించడంతో అడ్డు తొలగించడం జరిగింది. ఈ ప్రజాకోర్టుకు ఆంధ్ర-ఒడిశా గ్రామాలకు చెందిన ప్రజలు 800మంది వరకు హాజరు అయ్యారు. చివరిగా మాట్లాడుతూ ప్రజా శత్రువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి అంటూ ప్రజలకు పిలుపు నివ్వడం జరిగింది. ఈ ప్రజాకోర్టు ప్రజలకు రాజకీయంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడగా ప్రజా శత్రువులకు, పోలీసు ఏజెంట్లకు గుణపాఠంగా నిలిచింది.

## పలకజీడి పోలింగ్ కేంద్రంపై దాడి-ప్రభుత్వ వాహనం, ఇ.వి.ఎమ్‌ల ధ్వంసం :

2014 మే 7న జరిగిన లోక్‌సభ మరియు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కొరకు శత్రువు మన ప్రభావం ఉన్న చాలా చోట్ల అదనపు జాగ్రత్తల్లో భాగంగా రోడ్లు, కాలిబాటలు ఉపయోగించకుండా, అటవీ మార్గం గుండా పోలింగ్ కేంద్రాల పరిసరాల అటవీ ప్రాంతానికి చేరుకొని,ఆ తరువాత రోడ్డు మార్గ గుండా ఓటింగ్ యంత్రాలను, పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించే పద్ధతిని ఎంచుకున్నాడు.

ఈ పద్ధతిని అనుసరించి రేవులకోట, పలకజీడి పోలింగ్ కేంద్రాల చుట్టూ ఉన్న అటవీ ప్రాంతానికి శత్రు బలగాలు చేరుకొని వాటి రక్షణలో ఓటింగ్ యంత్రాలను ఎన్నికల ముందు రోజు (మే-6)న పలకజీడి గ్రామానికి తీసుకువచ్చారు. ఆ రోజంతా పలకజీడి పరిసరాల్లో శత్రు బలగాలు ఉన్నాయి. ఎన్నికల రోజు (మే-7)న పలకజీడి పోలింగ్ కేంద్రానికి చెందిన ఓటింగ్ యంత్రాలను అక్కడే విడిచిపెట్టి, రేవులకోటకు సంబంధించిన ఇ.వి.ఎమ్‌లను రేవులకోట పోలింగ్ కేంద్రానికి తరలించారు. శత్రువుకు రేవులకోట పోలింగ్ కేంద్రానికి అధిక ప్రాధాన్యతనిచ్చి పలకజీడి వద్దనున్న బలగాలను కూడా రేవులకోట పోలింగ్ కేంద్రాల వద్దనే మోహరింపజేశాడు. పలకజీడి పోలింగ్ కేంద్రం వద్ద శత్రు బలగాలు లేవన్న సమాచారం మిలీషియా ద్వారా జి.కె.ఎల్.జి.ఎస్‌కు తెలిసింది. రేవులకోట వద్ద నున్న శత్రు బలగాలు కాలినడకన రావాలంటే ఒక గంట, ఎన్నికల సిబ్బంది వాహనం (జీపు)ను ఉపయోగించి రావాలంటే కనీసం 15 ని॥ల సమయం పడుతుంది. కనుక ఈ సమయాన్ని ఉపయోగించుకొని పోలింగ్ కేంద్రంపై దాడి చేసి ఇ.వి.ఎమ్‌లను ధ్వంసం చేయాలని నిర్ణయానికి వచ్చి జి.కె.ఎ.సి, అనుకున్న విధంగానే ఉదయం 10:30 గం॥లకు పలకజీడి పోలింగ్ కేంద్రానికి చేరుకొని, హుటాహుటీన సెంట్రీలను నియమించి పోలింగ్ సిబ్బందికీ, ఓట్లు వేయడానికి వచ్చిన వారికి విషయం చెప్పి 4 ఇ.వి.ఎమ్‌లను,4 ప్రాసెసింగ్ యూనిట్(పి.యు)లను, ఎన్నికల సిబ్బందిని తీసుకువచ్చిన ప్రభుత్వ జీపును దగ్ధం చేసి 15 ని॥ల్లో రిట్రీట్ కావడం జరిగింది. ఈ ఘటన గురించి వెంటనే టి.వి స్క్రోలింగ్స్‌లో, రేడియో వార్తల్లో రావడంతో, ఈ వార్త దావానంలా వ్యాపించి, పలకజీడిలోనే కాక పరిసర పోలింగ్ కేంద్రాలైన రేవులకోట, బండిగడ్డ, వీరవరం, చీడిపాలెం, దుర్గం, బూదరాళ్ళ, లూసంలలో కూడా పోలింగ్ అర్థాంతరంగా నిలిచిపోయింది. పోలింగ్ ఏజెంట్లు నయానా-భయానా నమ్మబలికి తీసుకువచ్చిన ఓటర్లు కూడా ఓట్లు వేయకుండా వెనుదిరిగి పోయారు.

ఎన్ని ఒత్తిళ్ళు తెచ్చినా ఓట్లు వేసేందుకు నిరాకరించిన గ్రామాల్లోని విప్లవ ప్రజానీకంలోనూ, విప్లవ శ్రేణుల్లోనూ ఈ చర్య ఉత్సాహాన్నిచ్చింది.

## గాలికొండ ఏరియాలో జరిగిన ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్ రిపోర్టు :

ఏప్రిల్ 11 స్థానిక, మే 7 ప్రాంతీయ ఎన్నికల బహిష్కరణను చురుకైన బహిష్కరణగా నిర్వహించాలనే పై కమిటీ నిర్ణేశాన్ని అమలు పరిచేందుకు స్థానిక గాలికొండ ఎ.సి రూపొందించిన ప్రణాళికలో పార్టీ, ప్రజా సంఘ కార్యకర్తలకు, శ్రేణులకు విద్య గరిపి, బూటకపు పార్లమెంటరీ ఎన్నికల తంతు, ప్రజా రాజ్యాధికారం, ప్రజా సైన్యం, ప్రజాయుద్ధం మొదలైన అంశాలపై వారికి అవగాహన కల్పించి, ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌లో వారిని క్రియాశీల భాగస్వాములను చేయడం ప్రధాన అంశంగా ఉంది. అందులో భాగంగానే 6 పాకెట్‌లలో ఎ.వి.ఆర్.సి.ఎస్ పాకెట్ కమిటీలను సంఘటిత పరిచి, 5 పాకెట్‌లలో ఎ.వి.ఆర్.సి.ఎస్ పాకెట్, గ్రామ కమిటీల సభ్యులకు, మిలీషియాకు 2 రోజుల చొప్పున అధ్యయన తరగతులు నిర్వహించాము. మరో 4 పాకెట్‌లలో గల కాఫీ పోరాట కమిటీలు, గిట్టుబాటు ధరల పోరాట కమిటీలను పాకెట్‌స్థాయి నిర్మాణాలుగా సంఘటిత పరిచి, ఒక్కో పాకెట్‌కు ఒక రోజు చొప్పున కేటాయించుకొని సమావేశాలు జరిపి అవగాహన కల్పించాము. గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహించేలా ప్రతి పాకెట్‌కు ఒక క్యాంపెయిన్ టీం చొప్పున నిర్మాణం చేసాము. ఈ క్యాంపెయిన్ టీంలు అన్నింటికీ ప్రచార సామాగ్రి ముద్రించిన కరపత్రాలు, బ్యానర్లు, పోస్టర్లు మనమే రాసి ఇవ్వడం జరిగింది. ఆ విధంగా మనం ప్రచారం కొరకు కేంద్రీకరించిన 9 పాకెట్‌లలో 5 పాకెట్‌లలో క్యాంపెయిన్ టీంలుగానూ, మరో 4 పాకెట్‌లలో విడివిడిగా గ్రామ స్థాయిలోనూ మౌకిక ప్రచారం జరిగింది. గూడెం, కొయ్యూరు, వై.రామవరం మండలాల్లోని 14 ప్రధాన కూడళ్ళలో దఫ దఫాలుగా బ్యానర్లు,

పోస్టర్లు వేయడం జరిగింది. పార్లమెంటరీ ఎన్నికల బూటకత్వంపై డి.వి.సి ప్రచురించిన కరపత్రాన్ని గ్రామాలలో చదివి వినిపించడం, చదవగలిగే వారికి పంపిణీ చేయడం, గోడలకు అతికించడం ద్వారా మరింత ప్రచారం జరిగింది. పోస్టు ద్వారా వివిధ దినపత్రికలకు, టి.విలకు, అదే విధంగా ఎన్నికల ప్రచారంలో ముందుండే వివిధ రాజకీయ నాయకులకు, కార్యకర్తలకు పంపించడం ద్వారా మన ప్రభావం ఉన్న చాలా సెంటర్లలో బూటకపు/బూర్జువా రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారాన్ని చాలా వరకు నియంత్రించ గలిగాము.

మే 7 అసెంబ్లీ/లోక్‌సభ ఎన్నికల రోజున పోలింగ్ సెంటర్లకు బ్యానర్లు కట్టి, పోస్టర్లు అతికించడం వలన 2 పోలింగ్ కేంద్రాల (గరిమండ, లూసం)లో పోలింగ్ మధ్యాహ్నం వరకూ మొదలు కాలేదు. పోలింగ్ జరిగిన చాలా చోట్ల కూడా నామమాత్రంగా పదుల సంఖ్యల్లోనే ఓట్లు పోల్ అయ్యాయి. (ఉదా: గరిమండలో 57 ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి.) అదే రోజున జి.కె.ఎల్.జి.ఎస్ పలకజీడి పోలింగ్ కేంద్రంపై దాడి చేసి ఇ.వి.ఎంలు ధ్వంసం చేయడం వలన పలకజీడితో పాటు మరో 7 పోలింగ్ కేంద్రాలలో (రేవులకోట, వీరవరం, బండిగడ్డ, చీలిపాలెం, దుర్గం, లూసం, బూదరాళ్ళు) ఓటర్లు ఓట్లు వేయకుండా వెనుదిరిగి పోవడంతో పోలింగ్ అర్థాంతరంగా నిలిచిపోయింది.

## మే 7 మన్యం పితూరిసేన 4వ వార్షికోత్సవ వేడుకలు :

గాలికొండ ఏరియా పరిధిలో గల ఎర్రగడ్డ, కొత్తగూడెం, మండపల్లి పాకెట్‌లలో సంయుక్తంగా మన్యం పితూరిసేన 4వ వార్షికోత్సవ వేడుకలు 3 పాకెట్ల ఎ.వి.ఆర్.సి.ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల నిర్వహణ కొరకు మూడూ పాకెట్‌లలో గల పార్టీ, ప్రజా సంఘ మరియు మిలీషియా నిర్మాణాల నుండి ఎంపిక చేసిన వారితో ఒక నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశాము. ఈ కమిటీ ఆధ్వర్యంలో 3 పాకెట్‌ల నుండి వచ్చిన యువతీ, యువకులకు మూడూ రోజుల పాటు పాకెట్ మిలీషియా రక్షణలో వాలీబాల్ పోటీలు, విల్లంబుల పోటీలు, మహిళలకు ప్రత్యేకంగా థింసా నృత్య పోటీలు నిర్వహించబడ్డాయి. మొత్తం 3 పాకెట్‌ల నుండీ 26 జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. ముందు పాకెట్‌ల వారిగా విడి విడిగా ఈ పోటీలను నిర్వహించి, చివరగా ముగింపు పోటీలను ఒక చోట నిర్వహించారు. ముగింపు పోటీల్లో వాలీబాల్, విల్లంబుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు, థింసా నృత్య పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలకు విజేతలను ఎంపిక చేయడమైనది. పాకెట్‌ల వారిగా విడివిడిగా మొదలైన ఈ పోటీలు మే 11న ముగింపు పోటీలతో మే 8న ముగిసాయి. పోటీలు నిర్వహించిన 4 రోజులు కూడా పోటీలలో పాల్గొన్న యువతీ, యువకులకు, రక్షణగా వచ్చిన మిలీషియాకు వారు తెచ్చుకున్న రేషన్‌తోనే సమిష్టిగా వంటలు ఏర్పాటు చేసి భోజనాలు అందించడం జరిగింది. మే 13న మన్యం పితూరిసేన 4వ వార్షికోత్సవ సభను ఏర్పాటు చేసి మూడు పాకెట్‌ల నుండి ప్రజలను ఆహ్వానించడం జరిగింది. సమాచార లోపం కారణంగా కొన్ని గ్రామాల నుండి ప్రజలు ఈ కార్యక్రమానికి హజరు కాలేకపోయారు. మే 13 మధ్యాహ్నం 1:20 గం॥లకు 537 మంది (మహిళలు 256, పురుషులు 281) ప్రజలతో సభను ప్రారంభించడం జరిగింది. సభకు పాకెట్ మిలీషియా బాధ్యుడు అధ్యక్షత వహించగా, ఎ.వి.ఆర్.సి.ఎస్ పాకెట్ కమిటీ అధ్యక్షుడు ప్రధాన వక్తగానూ, వరుసగా మన్యం పితూరిసేన ఆవిర్భావ నేపథ్యం, బాక్సైట్, కాఫీ పోరాటాలు, ప్రజా రాజ్యాధికారం మిలీషియా పాత్ర అంశాలపై ప్రసంగించారు. చివరగా పోటీల్లో గెలుపొందిన విజేతలను ప్రకటించి, వారికి అభినందనలు తెలిపి విప్లవ నినాదాలతో సభను ముగించారు.

## జి.సి.సేల్స్‌మెన్‌ని ప్రజాకోర్టులో నిలదీసిన ప్రజానీకం :

చిత్రకొండ బ్లాక్‌లోని రోళ్ళగడ్డ పంచాయితీ భౌగోళికంగా కానీ, గ్రామాల వారిగా కానీ, చాలా విశాలమైంది. మన ఉద్యమానికి కూడా అనుకూలమైన ప్రాంతంగా ఉంది. ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నారు. ఈ ఈ ప్రాంత ప్రజలు అడవిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పంచాయితీలో కొంతమంది ప్రభుత్వానికి అనుకూలంగా వుంటూ, ప్రజలను దోచుకుంటూ, వారిపై పెత్తనం చేస్తున్నారు. ప్రభుత్వం 2012 నుండి బి.ఎస్.ఎఫ్ క్యాంపులను దింపి, ప్రజల హక్కులను కాలరాస్తూ నిత్యావసర వస్తువులు, బియ్యం అందకుండా చేసి ప్రజలపై అణచివేత కొనసాగిస్తున్నది. దీన్ని అవకాశంగా తీసుకొని సేల్స్‌మెన్ బీమా తన దోపిడీని కొనసాగించడానికి కుట్టిగూడలో ఇవ్వవలసిన జి.సి.సి(బియ్యం)డిపోను ఆట్‌గూడ క్యాంపు దగ్గరకు మార్చి ప్రజలకు అందవలసిన బియ్యం ప్రైవేట్‌గా అమ్ముకోవడం, అడిగిన ప్రజల్ని హింసించడం లేదా బి.ఎస్.ఎఫ్ క్యాంపు పోలీసులకు చెప్పి భయపెట్టించడం వంటివి చేస్తున్నాడు. గతం నుండి వీడి కుటుంబం ప్రజలకు వ్యతిరేకంగా ఉంటున్నది. వీడి అన్న కొములు పంచాయితీ ప్రెసిడెంట్‌గా, వీడు పంచాయితీ సేల్స్‌మెన్‌గా చలామణి అవుతున్నారు. దీనితో వీరి ఆగడాలకు అంతే లేకుండా పోయింది. ముఖ్యంగా ప్రజల రేషన్ కార్డులను తీసుకొని ఇవ్వకపోవడం, 6 నెలలుగా బియ్యం ప్రైవేట్‌గా అమ్ముకోవడం, అన్యాయమని అడిగిన ప్రజల్ని తన గుమస్తా అయిన మహేష్‌తో కొట్టించడం బీమా చేస్తున్న ప్రజావ్యతిరేకమైన పనులు. ఈ విషయాన్ని ప్రజలు మన పార్టీ దృష్టికి తేవడంతో చుట్టుపక్కల గ్రామాల ముఖ్యులతో ముందుగా చర్చించి, సేల్స్‌మెన్ అయిన బీమాను, వాడికి గుమస్తాగా ఉన్న మహేష్‌ని మన పి.ఎల్.జి.ఎ, స్థానిక మిలీషియా కలిసి రాత్రికి పట్టుకుని వచ్చి, మరునటి రోజు ప్రెసిడెంట్ కాములును రావాల్సిందిగా కబురు పంపించినప్పటికీ అతను ప్రజాకోర్టుకు రావడానికి నిరాకరించాడు. ప్రజాకోర్టు సమక్షంలోనే వీరికి దేహశుద్ధి చేసి, పంచాయితీకి 2 విడతలుగా బియ్యం ఇవ్వాలనీ, లోతుగడ్డ అవతల మళ్ళిగూడకు, గడ్డ ఇవతల పనగరేవుకు విడివిడిగా రేషను డిపోలు ఉండాలనీ అటగూడలో ఉన్న జి.సి.సి డిపోను మార్చాలనీ, ప్రజలపట్ల దురుసుగా వ్యవహరించరాదనీ, రేషన్ వస్తువులను ప్రైవేట్‌గా అమ్మరాదని వంటి డిమాండ్స్ పెట్టి వాటి అమలుకై 15 మందితో ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. 500 మంది సమక్షంలో ప్రజాకోర్టు జరిగింది. మే 2014న జరిగిన ఈ ప్రజాకోర్టులో ప్రజా వ్యతిరేకి కొములుని పంచాయితీ బహిష్కరణ చేయాలనే నిర్ణయం జరిగింది. ప్రజలు, స్థానిక మిలీషియా, పి.ఎల్.జి.ఎ బలగాలు కలిసి అతని ఇంట్లో సామాన్లు స్వాధీనం చేసుకొని ఇంటిని ధ్వంసం చేయడం జరిగింది.

## ప్రజావ్యతిరేకి తిరుపతిరావు భూముల్ని స్వాధీనం చేసుకున్న ప్రజానీకం :

పెదబయలు మండలం లోని జాముగూడ పంచాయితీ కోరుకొండ ఏరియా కమిటీ పరిధి లోకి వస్తుంది. ఈ ప్రాంతంపై మన కేంద్రీకరణ చాలా తక్కువగా ఉండేది. ఈ మధ్య కాలంలో మిలీషియా, ఎ.వి.ఆర్.సి.ఎస్‌లు ఫంక్షన్ అవుతున్నాయి. ఈ ప్రాంతంలో భూమి కొద్దిమంది భూస్వాముల చేతిలో కేంద్రీకృతమై ఉంది. సాకిరేవు తిరుపతిరావు అనే పెత్తందారి పిన్నరావేల్లి, సాకిరేవు గ్రామాలలోని భూముల్ని ఆక్రమించాడు. దాంతో ప్రజలు తిరుపతిరావుపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలు కలిసి పార్టీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకొచ్చారు. మన పార్టీ గతంలో వారు ఆక్రమించిన భూముల్ని పంపిణీ చేసింది. పసుపు పంట తీసుకొని భూమిని అప్పగించాలనీ 5 సంవత్సరాల క్రితం చెప్పినప్పటికీ ఇప్పటికీ అమలు జరగలేదు. దాంతో మరోసారి ప్రజాకోర్టు ఏర్పాటు చేసి పసుపుని కులం సగం, వారు సగం తీసుకోవాలని తీర్పు చెప్పడం జరిగింది. మిగతా భూముల కోసం 9 మందితో కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ భూమిని స్వాధీనం చేసుకొని భూమి లేని కుటుంబాలకు పంపిణీ చేయాలనీ ప్రజాకోర్టులో నిర్ణయించారు. ఈ నిర్ణయానికి 200 మంది ప్రజలు ఆమోదం తెలిపారు. ఈ ఘటన ఈ ప్రాంత ప్రజలలో మంచి ప్రభావాన్ని వేయగా ప్రజావ్యతిరేకులకు, పెత్తందార్లకు హెచ్చరికగా మారింది.

## బి.ఎస్.ఎఫ్ క్యాంపులను చుట్టుముట్టి అరెస్టయిన కార్యకర్తలను విడిపించుకున్న ప్రజలు :

మల్కనగిరి జిల్లా దొండొలగొంది గ్రామం (రోళ్ళగడ్డ పంచాయితీ), కోటిపల్లి (పప్పర మెట్ట పంచాయితీ) ఈస్ట్ డివిజన్‌లో కోరుకొండ ఏరియా కమిటీ పరిధి. ఈ ప్రాంతంలో 2012 నుండి రాజ్య నిర్బంధం తీవ్రరూపం దాల్చుతూ వస్తున్నది. అటగూడ, బొడపడలో ఉన్న బి.ఎస్.ఎఫ్ క్యాంపు బలగాలు సమన్వయంతో గ్రామాలపై దాడులు చేయడం, అక్రమంగా అరెస్టు చేయడం, సంఘ నాయకత్వాన్ని పట్టుకుని చిత్రహింసలకు గురిచేయడం జరుగుతున్నది. వీరికి స్థానిక హోంగార్డులు, ఒనబెరడ చిన్నారావు, ధుళిపుట్‌కు చెందిన పూజారి సన్యాసిరావు (ప్రవీణ్)లు సహకరిస్తున్నారు. ఇందులో భాగంగానే దొండొలగొంది గ్రామంపై ఫిబ్రవరి నెలలో దాడి చేసి గ్రామస్తులను చితకబాది, ఒక వ్యక్తిని అరెస్టు చేసి క్యాంపుకు తీసుకుపోయారు. అదే విధంగా ఏప్రిల్ నెలలో కోటిపల్లి గ్రామంపై తెల్లవారు జామున 4 గం॥లకు దాడి చేసి సంఘ నాయకున్ని పట్టుకుని బొడపడ క్యాంపుకు తీసుకుని పోయారు. పై రెండు సంఘటనలలోనూ ప్రజలు కోపోద్రిక్తులై అందరూ కలిసి బి.ఎస్.ఎఫ్ క్యాంపులను చుట్టుముట్టి ఆందోళన చేయడంతో గత్యంతరం లేని పరిస్థితులలో అరెస్టు చేసిన వారిని విడిచిపెట్టారు.

## రాళ్ళగడ్డకు చెందిన హోంగార్డు రాజును ఖతం చేసిన మిలీషియా :

చిత్రకొండ బ్లాక్‌లోని రాళ్ళగడ్డ పంచాయితీ కోరుకొండ ఏసి పరిధిలోకి వస్తుంది. ఎస్.ఆర్. కంపెనీ వ్యతిరేక పోరాటంలో ఈ గ్రామం కీలక పాత్ర పోషించింది. గతంలో ఈ ప్యాకెట్‌లో ఒక ప్యాకెట్ కమిటీ, ఒక సెల్ ఫంక్షన్ అయ్యేవి. 2012లో నిర్బంధానికి గురై తాత్కాలిక వెనుకపట్టు పట్టాయి. ఈ ప్యాకెట్‌ను దెబ్బతీయడంలో భాగంగా శతృవు సిబో అనే హోంగార్డును తయారు చేసాడు. ఈ గ్రామంలోనే వెనుకబడిన తెగకు చెందిన రాజు గతంలో ఎవిఆర్‌సిఎస్‌కు అధ్యక్షుడిగా పని చేసి శతృ నిర్బంధానికి గురై, లొంగిపోయి, హోంగార్డుగా తయారయి, ప్రజా వ్యతిరేకిగా మారాడు.

2014 జనవరి 11న చీకటిపల్లి అటవీ ప్రాంతంలో వేటకు వెళ్ళిన ఆదివాసులపై కాల్పులు జరుపగా సువ్వపల్లి గ్రామనివాసి సొన్యొ మరణించాడు. తరువాత గ్రామంపై దాడి చేసి వస్తు సామాగ్రిని ధ్వంసం చేసి, నాలుగు నాటు తుపాకులు, కత్తులు ఎత్తుకుపోయారు. ఈ ఘటనలలో హోంగార్డు రాజు ముఖ్యపాత్ర వహించాడు. ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని ప్రజలు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోవడంతో పార్టీ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ప్రజలు, పి.ఎల్.జి.ఎ కలిసి ప్రజాకోర్టు నిర్వహించి దోషిగా తేలడంతో రాజుకు మరణశిక్ష విధించారు. 2014 మార్చి నెలలో మిలీషియా ఇతన్ని ఖతం చేసింది. ఈ చర్య ప్రజలలో పాజిటివ్ ప్రభావాన్ని వేసింది.

## శతృ చుట్టివేతను తిప్పికొట్టిన సున్నంగొయ్యి ప్రజల సాహసం, సమయస్ఫూర్తి :

మల్కనగిరి జిల్లా రాళ్ళగడ్డ పంచాయితీకి చెందిన సున్నంగొయ్యి గ్రామం ఆంధ్రప్రదేశ్ కిల్లంకోట పంచాయితీకి సమీపంలో వుంది. ఇక్కడ కువ్వి తెగకు చెందిన వారు అధికంగా ఉన్నారు. మన కేంద్రీకరణ తక్కువగానే ఉన్నప్పటికీ ప్రజలు మాత్రం పార్టీనీ, సంఘాలనీ, నాయకత్వాన్ని చాలా ఆదరిస్తున్నారు. ఈ మధ్య కాలంలో కిల్లంకోట పంచాయితీ తడ్డాల్ గ్రామానికి చెందిన విజయ్(మాజీ మావోయిస్టు) పోలీసుల దగ్గర చేరి ఈ ప్రాంత సంఘనాయకత్వాన్ని పట్టించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు.దాంతో వాడిని పట్టుకొని విచారించడం జరిగింది.

ఈ మధ్య తడ్డాల్ గ్రామంపై శత్రువు రెండు దఫదఫాలుగా దాడులు చేయడం కొంత మందిని అరెస్టు చేయడం జరిగింది. తప్పించుకున్న వారికోసం శత్రువు రాత్రి సమయంలో వస్తున్నాడు. ఇందులో భాగంగానే తడ్డాల్ గ్రామానికి 40 నిమిషాల దూరంలో వున్న సున్నంగొయ్యి గ్రామాన్ని కూడా చుట్టుముట్టాడు. అప్పటకి మన సంఘనాయకత్వం అక్కడే ఉంది. దీంతో సంఘనాయకత్వం ధర్నా చేయాలని అలోచించగా ప్రజలు సమయస్ఫూర్తిగా అలోచించి శత్రువు చుట్టివేతనుండి బయట పడేయడం కోసం ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం డప్పులు, కత్తులు, వెంటి బద్దలు తీసుకొని వేటకు బయలుదేరి సంఘ నాయకత్వాన్ని శత్రువు చుట్టివేత దాడి నుండి దాటించారు. దీంతో శత్రువుకు నిరాశనే మిగిలింది. ప్రజానీకం తలచుకుంటే శత్రువు చుట్టివేత దాడులు వమ్ము చేయగలరు అనేది ఈ సంఘటన ద్వారా మరోసారి రుజువయింది.

## ఎమ్.పి.టి.సి/జడ్.పి.టి.సి/పార్లమెంటు/శాసనసభ ఎన్నికల్ని బహిష్కరించిన కె.కె ఏరియా ప్రజానీకం :

కోరుకొండ ఏరియాలోని ప్రజలు ఏప్రిల్, మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్ని బహిష్కరించారు. ఈ ఎన్నికల సందర్భంగా ఏరియాలో విప్లవ ప్రజా మిలీషియా, ప్రజా సంఘాలు ప్రచార బృందాలుగా ఏర్పడి గ్రామ, గ్రామానా విస్తృతమైన ప్రచారం నిర్వహించాయి. ఈ ప్రచారంలో బూర్జువా పార్టీల నాయకుల వైఖరిని ఎండగడుతూ ప్రజల్ని సంఘటితం చేసి ఎమ్.పి.టి.సి, జెడ్.పి.టి.సి, పార్లమెంటు, శాసనసభ ఎన్నికలపై భ్రమలను పోగొట్టే విధంగా ప్రజా మిలీషియా, ప్రజా సంఘాలు కృషి చేయడం చేసాయి. నిప్పులు చెరుగుతున్న నిర్బంధం మధ్యలో కూడా ఈ ప్రచార బృందాలు తిరగడం శత్రువుకు ఒక సవాలుగా నిలిచింది. శత్రు బలగాల మధ్యలోనే ఏప్రిల్ 5న బూసుపుట్ పంచాయితీ బ్యాలెట్‌ను మిలీషియా, ప్రజాసంఘ నాయకత్వం కలిసి ధ్వంసం చేసారు. దాంతో మరోదఫా రీపోలింగ్ జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మే 7న పార్లమెంటు/శాసనసభ ఎన్నికల బహిష్కరణ పిలుపులా భాగంగానే మన పి.ఎల్.జి.ఎ/స్థానిక మిలీషియా కలిసి జక్కం కొండలపై శత్రువును లక్ష్యంగా చేసుకుని మైను పేల్చడం జరిగింది. అయితే మనం సరిగ్గా ఆపరేట్ చేయని కారణంగా విఫలం అయినప్పటికీ శత్రువుకు కొద్దిపాటి కలవరాన్ని కలిగించింది. ఈ చర్య తర్వాత కూడా బ్యాలెట్ బాక్సుల్ని ఎత్తుకురావడానికి రెండు టీంలు ప్రయత్నాలు చేసాయి. అయితే అప్పటికే మైన్లు పేల్చడంతో భారీ మొత్తంలో బలగాలను దింపి పకడ్బంది ఏర్పాట్లు చేసుకున్నారు. ఏమైనా ఈ రెండు చర్యలు శత్రువుకు సవాల్ విసురుతూ విప్లవ ప్రజానికానీకంలో ఉత్సాహాన్ని నింపాయి.

---

**మల్కనగిరి డివిజన్**

## లోక్‌సభ, శాసనసభ ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌ను విజయవంతం చేసిన పాడియా ప్రజానీకం :

మల్కనగిరి జిల్లా పొడియా ఏరియాలో పార్టీ ఇచ్చిన బహిష్కరణ పిలుపు స్ఫూర్తితో ఏరియాలో ఎక్కడికక్కడ ఏ.వి.ఆర్.సి.ఎస్ కార్యకర్తలు, మిలీషియా సభ్యులు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ఏరియా ఏవిఆర్‌సిఎస్ నాయకత్వం చొరవతో పాకెట్స్ వారీగా ముందు నుండే స్థానిక ఎన్నికలపై ప్రచార క్యాంపెయిన్ బృందాల ద్వారా, బహిరంగ మీటింగ్స్, పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా విస్తృత ప్రచారం చేసారు.

సంవత్సరానికి ఒకసారి వచ్చే ఆదాయపంట ఈడు సీజన్‌లో కూడా ప్రజలు, ప్రజాసంఘాలు, మిలీషియా ఎన్నికల బహిష్కరణ ప్రచారాన్ని విజయవంతం చేసారు. ఎన్నికల ప్రచారంలో 17 పంచాయితీలకు చెందిన స్థానిక సర్పంచ్‌లు ఎవరూ పాల్గొనరాదనీ, ప్రజా సమస్యలు పట్టించుకోనివారికి అధికారంలో కొనసాగే హక్కులేదని తెలియచేస్తూ ఉత్తరాల ద్వారా హెచ్చరించడం జరిగింది.

పొడియా ఏరియాలో తాగునీరు కెనాల్ సమస్య కేంద్రంగా ఎన్నికల బహిష్కరణ జరిగినప్పటికీ ఈ క్యాంపెయిన్ సందర్భంగా దోపిడీ పాలక వర్గాలను సాయుధంగా కూలదోసి ప్రజా రాజ్యాధికారాన్ని నిర్మించేందుకు ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేయాలనే ప్రచారాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళాము. వారికి రాజకీయ లక్ష్యాన్ని అర్థం చేయించి కొంతమేర సంఘటిత పరిచాము.

## లోక్‌సభ, శాసనసభ ఓట్ల బహిష్కరణ పిలుపును అమలు చేసిన పాడియా ఏరియా ప్రజలు :

ఒడిశాలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను ఒక సవాలుగా తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీ ప్రభావ ప్రాంతాలలో రెండు విడతలుగా ఎన్నికలను నిర్వహించాలనీ, మల్కనగిరి జిల్లాలో అత్యధిక సాయుధ బలగాలను కేంద్రీకరించి ఎన్నికల బహిష్కరణ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని అనుకున్నారు.

ప్రజల మౌళిక సమస్యలైన తాగునీరు, సాగునీరు, కెనాల్, ఉపాధి, విద్యా, వైద్యం, పంటల నష్ట పరిహారం, రైతుల ఆత్మహత్యల నష్ట పరిహారం వంటి వాటిని పరిష్కరించకుండా సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం ప్రజలను నిర్వాసితులను చేస్తూ, ఓట్ల కోసం వస్తున్న పాలక, ప్రతిపక్ష పార్టీలను నిలదీయాలని మల్కనగిరి డివిజన్ కమిటీ పిలుపునిచ్చింది.

నవీన్ పట్నాయక్ ప్రభుత్వం శాంతి భద్రతల పేరుతో ప్రజలపై, పార్టీపై వేలాది బలగాలను మొహరించి ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను అమలు చేస్తున్నది. అందులో భాగంగా 2013 సెప్టెంబర్ 13న పొడియా బ్లాక్‌లోని శీలకోట గ్రామ సమీపాన 10 సంవత్సరాల బాలికతో పాటు 13 మందిని పట్టుకుని కాల్చి చంపింది. ప్రజలను అమాయకులుగా భావించి బూటకపు వాగ్దానాలతో ఓట్లకై ముందుకు వచ్చిన వారిని ఎన్‌కౌంటర్లు, అక్రమ అరెస్టులు, మౌళిక సమస్యల పట్ల తమ వైఖరిని తెలియచేయాలని నిలదీసారు. ఎన్నికల నిర్వాహణకు వచ్చిన అధికారులను శీలకోట గ్రామస్తులు నిలదీయడంతో ప్రజల ఆగ్రహాన్ని చూసిన అధికారులు వెనుదిరిగి వెళ్ళిపోయారు.

పొడియా బ్లాక్‌లోని 8 పంచాయితీలు ఎన్నికలను బహిష్కరించాయి. ఏరియా వ్యాప్తంగా అతి తక్కువ ఓట్లు పోలైనాయి.(20 నుండి 30 వరకు) వేసిన వారిలో వృద్ధులు, సంస్కరణలు లభించవని భయపడ్డ వారు ఉన్నారు. అలాగే రోడ్డు పక్కనున్న బెంగాలీ గ్రామాల ప్రజలు ప్రభుత్వ సంస్కరణలకై ప్రలోభపడి ఓట్లు వేసారు.

కొన్ని గ్రామాల ప్రజలు, రైతుకూలి సంఘాలు, మిలీషియా బ్యాలెట్ బాక్సులు తగులబెట్టడానికి వెళ్ళినపుడు ప్రభుత్వ తొత్తులైన సర్పంచ్‌లు పోలీసులు వచ్చారని ప్రజలను భయపెట్టడంతో వెనుతిరిగారు. కొన్ని చోట్ల అలా ప్రజలను గందరగోళ పరిచి బ్యాలెట్ బాక్సులను తీసుకెళ్ళారు.

## ఓంగే గ్రామ ఎస్.పి.ఓ కోసాలు ఖతం, మరో ఎస్.పి.ఓ మంగ్లీకి దేహశుద్ధి :

మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్‌లోని ఓంగే గ్రామానికి చెందిన మడ్కమి కోస కోయ ఆదివాసి తెగకు చెందినవాడు. అదే గ్రామానికి చెందిన ఓంగే లచ్చాలు అనే ఎస్.పి.ఓతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ పెత్తందారిగా మారాడు. ఈ గ్రామం పొడియా ఏరియా పరిధిలోకి వస్తుంది. పొడియా ఏరియాలో మన ఉద్యమాన్ని నిరోధించడం కోసం శత్రువు వీరిద్దరిని ఎస్.పి.ఓలుగా

తయారు చేసాడు. దీంతో ప్రజలు, పి.ఎల్.జి.ఎ బలగాలు కలిసి వీరిద్దరిని విచారించి మరణశిక్ష విధించాలని నిర్ణయించారు. అందులో భాగంగానే కోసను ఖతం చేయగా లచ్చాలు తప్పించుకుని పారిపోయి మల్కనగిరిలోని పోలీసుల వద్దకు చేరుకున్నాడు. అదే గ్రామానికి చెందిన కోసకు పినతల్లి అయిన మంగ్లీ కోసను పార్టీ అనవసరంగా చంపి వేసిందని భావించి పార్టీపై వ్యతిరేకత పెంచుకుంది. దీన్ని శత్రువు ఉపయోగించుకుని ఆమెను ఎస్.పి.ఓగా మార్చుకున్నాడు. ఆమె పోలీసులకు మన డేరాలు, నీళ్ళ జాగాలు, సంఘనాయకుల ఇల్లు చూపించింది. దీంతో ప్రజలు, పి.ఎల్.జి.ఎ కలసి ప్రజాకోర్టు నిర్వహించి మంగ్లీకి దేహశుద్ధి చేయాలని నిర్ణయించి అమలు చేసారు. దాంతో మంగ్లీ తన తప్పులు ఒప్పుకుని ప్రజలతో కలిసి బతుకుతానని తెలియచేసింది. ఈ ఘటనలు ఏరియాలో మంచి ప్రభావాన్ని వేసాయి.

**పోలీసు స్టేషన్‌ను చుట్టుముట్టి అరెస్టయిన కార్యకర్తలను విడిపించుకున్న ప్రజలు:**

కలిమెల బ్లాక్‌లోని కేరియగుడియం గ్రామం పొడియా ఏసి పరిధిలోకి వస్తుంది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ నిర్బంధం కారణంగా ప్రజలు సంతలకు, చుట్టాల ఇల్లకు, ఇతర అవసరాలకు బయటకు వెళ్లడం తగ్గించుకున్నారు. బయటకు వెళుతున్న ప్రజలను మావోయిస్టులకు సామాన్లు చేరవేస్తున్నారనీ, ఇతరత్రా సహాయం చేస్తున్నారని ఆరోపిస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారు. దాంతో పోలీసులను తప్పించుకుని తిరుగుతున్న ప్రజలను ప్రభుత్వ సంస్కరణల ఆశ చూపి బ్లాక్ ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారు. ప్రజా సంఘాలలో, కమిటీలలో పని చేసే వారికి ఇందిరావస్ ఇల్లు ఇస్తామని చెప్పి ఇన్‌ఫార్మర్ల, సరెండర్ అయిన వారి సహాయంతో బ్లాక్ ఆఫీసుల దగ్గర అక్రమ అరెస్టులు చేస్తున్నారు. కేరియగుడియం సంఘసభ్యులను ఈ విధంగానే అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టారు. ఒక్కొక్కరి దగ్గర 5 వేల రూపాయల చొప్పున తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు, కుటుంబసభ్యులు స్టేషనును చుట్టుముట్టి ఆందోళన చేయడంతో వారిని వదిలిపెట్టారు.

**విప్లవ ప్రతిఘాతుకులు, శత్రు ఇన్‌ఫార్మర్లపై ఏరియాలో పోస్టర్లు:**

పొడియా ఏరియాలోని రెండు ప్యాకెట్లలో కొంతమంది ఇన్‌ఫార్మర్లు, వారి కుటుంబాలు గతం నుండి ప్రజలకు, పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ఎన్ని విధాలుగా నచ్చ చెప్పినప్పటికీ, హెచ్చరించినప్పటికీ వారి పద్ధతులు మార్చుకోక పోవడంతో వారి పేర్లను బహిర్గతం చేస్తూ పోస్టర్లు వేయడం జరిగింది. గుమ్మిలో మిలీషియా కమాండర్‌గా పని చేసిన గంగాల్ ఓంగే లచ్చాల్ ప్రభావంతో ఇన్‌ఫార్మర్‌గా పనిచేయడానికి సిద్ధమైనాడు. దాంతో ప్రజలు, పి.ఎల్.జి.ఎ కలిసి విచారించి ఒక సంవత్సరం పాటు సంతలకు వెళ్ళరాదని షరతు విధించారు.

**పార్టీకి ఆర్థిక వనరులను చేకూర్చిన ప్రజలు, ప్రజా సంఘాలు:**

పొడియా ఏసి పరిధిలోని 2 ప్యాకెట్లలో ఉన్న ప్రజలు, విప్లవ రైతుకూలి సంఘం, విప్లవ మహిళా సంఘం, మిలీషియా, జి.ఎమ్.ఎస్, బాలల సంఘాలు పార్టీకి నిధులు సేకరించి ఇచ్చారు. డబ్బు రూపంలో, పి.ఎల్.జి.ఎకు అవసరమైన వస్తు సామాగ్రి రూపంలో (సబ్బులు, బట్టలు, స్టేషనరీ.....) అందించి నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం తమ కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వర్తించారు.

---

**సెప్టెంబర్ 21 - 2014 కు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడి 10 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా, దశాబ్ధి ఉత్సవాలను 10 రోజులు (సెప్టెంబర్ 21నుండి 30 వరకు) పాటు ఘనంగా జరుపుకుందాం!**

**నినాదాలు:**

1. పార్టీని బోల్షివీకరించి బలోపేతం చేయాలి!
2. కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ అత్యంత ధైర్య సాహసాలతో ముందుకు సాగేలా పార్టీని దృఢతరం చేయాలి!
3. శత్రు దాడుల నుండి పార్టీ నాయకత్వాన్ని కాపాడుకోవాలి! రహస్య పని విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలి!
4. మితవాద అవకాశవాదాన్ని ఓడించాలి! మార్క్సిజాన్ని ఎత్తిపట్టాలి!
5. పార్టీని నూతన ప్రాంతాలకు విస్తరింప చేయాలి!
6. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలో పార్టీని శక్తివంతం చేయాలి!
7. ప్రజాసంఘాల్లో, విప్లవ ప్రజాకమిటీల్లో పార్టీని బలోపేతం చేయాలి!
8. ప్రపంచ కార్మిక వర్గానికి పీడితులకు ఆశజ్యోతిగా పార్టీని నిలపాలి! కార్మిక వర్గ అంతర్జాతీయతను చాటాలి!